# MODERN POLITICAL THEORY

## M.A. Political Science, Semester-II

## Paper-I

**Lesson Writers**

**Sri V. Anji Reddy**
**Assistant Professor**
**Dept. of Political Science &**
**Public Administration, ANU**

**Dr.D.Mano Vikas**
**Dept. of Political Science &**
**Public Administration, ANU**

**Editor**

**Prof. M. Ravi Sekhar**
M.A. LLB., Ph.D
**Dept. of Political Science & Public Administration**
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510

**Director**

**Dr.Nagaraju Battu**
M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510
Phone No.0863-2346208, 0863-2346222,
0863-2346259 (Study Material)
Website: www.anucde.info
e-mail: anucdedirector@gmail.com

M.A. :Modern Political Theory

First Edition: 2022

No. of Copies

©Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of M.A Political Science Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Printed at

## *FOREWORD*

***Since its establishment in 1976, Acharya Nagarjuna University has been forging aheadin the path of progress and dynamism, offering a variety of courses and research contributions. I am extremely happy that by gaining 'A' grade from the NAAC in the year 2016, Acharya Nagarjuna University is offering educational opportunities at the UG, PG levels apart from research degrees to students from over 443 affiliated colleges spread over the two districts of Guntur and Prakasam.***

***The University has also started the Centre for Distance Education in 2003-04 with the aim of taking higher education to the door step of all the sectors of the society. The centre will be a great help to those who cannot join in colleges, those who cannot afford the exorbitant fees as regular students, and even to housewives desirous of pursuing higher studies. Acharya Nagarjuna Universityhas started offering B.A., and B.Com courses at the Degree level and M.A., M.Com., M.Sc., M.B.A., and L.L.M., courses at the PG level from the academic year 2003-2004 onwards.***

***To facilitate easier understanding by students studying through the distance mode, these self-instruction materials have been prepared by eminent and experienced teachers. The lessons have been drafted with great care and expertise in the stipulated time by these teachers. Constructive ideas and scholarly suggestions are welcome from students and teachers involved respectively. Such ideas will be incorporated for the greater efficacy of this distance mode of education. For clarification of doubts and feedback, weekly classes and contact classes will be arranged at the UG and PG levels respectively.***

***It is my aim that students getting higher education through the Centre for Distance Education should improve their qualification, have better employment opportunities and in turn be part of country's progress. It is my fond desire that in the years to come, the Centre for Distance Education will go from strength to strength in the form of new courses and by catering to larger number of people. My congratulations to all the Directors, Academic Coordinators, Editors and Lesson- writers of the Centre who have helped in these endeavours.***

***Prof. P. Raja Sekhar***
***Vice-Chancellor (FAC)***
***Acharya Nagarjuna University***

**M.A. POLITICAL SCIENCE AND M.A. PUBLIC ADMINISTRATION**
**SEMESTER – II**

**(COMMON FOR BOTH M.A. POLITICAL SCIENCE AND**
**M.A. PUBLIC ADMINISTRATION**
**WITH EFFECT FROM THE ACADEMIC YEAR 2017-18**

## 201PO21-PAPER I: MODERN POLITICAL THEORY

**UNIT – I**

**NATURE OF POLITICAL THEORY**

1. The conceptual distinction between Normative and Empirical Political theory as two distinctive areas of Political Enquiry.
2. Behaviouralist Foundations of Empirical Political Theory.
3. The Study of Texts in Context.

**UNIT - II**

THEORIES OF JUSTICE

1. An Egalitarian Theory of Justice: John Rawls
2. Libertarian Conception of Rights: Robert Nozick
3. Neo Liberal Conception of Justice: Friedrich Hayek

**UNIT - III**

**CONTEMPORARY POLITICAL THEORY**

1. Multiculturalism: Will Kymlicka, Bhikhu Parekh
2. Legitimation Crisis of the Modern State: Jurgen Habermas.
3. End of History: A defense of liberal Democracy: Francis Fukuyama

**UNIT - IV**

**SOCIALIST THEORY**

1. Civil Society, Hegemony, Passive Revolution: Antonio Gramsci
2. A critical analysis of Soviet Socialism: Alec Nove
3. Market Socialism: David Miller

**RECOMMENDED BOOKS:**


1. David Held: Political Theory and the Modern State.
2. Andrew Heywood: Political Theory: An Introduction.
3. Will Kymlicka: Contemporary Political Philosophy: An Introduction.
4. David Miller: Principles of Social Justice
5. Francis Fukuyama: The End of History and the last Man.
6. S.P. Verma: Modern Political Theory.
7. Michael Walzer, Spheres of Justice.
8. Amy Gutman, Multiculturalism.
9. Jurgen Habermas, Legitimation Crisis.
10. Bhikhu Parekh, Rethinking Multiculturalism.


***

# CONTENT


| | | |
|---|---|---|
| పాఠం - 1 | రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రామాణిక దృక్పథం మరియు అనుభవైక దృక్పథం మధ్య గల వ్యత్యాసం | 1.1-1.7 |
| పాఠం - 2 | అనుభవైక రాజనీతి సిద్ధాంతం-ప్రవర్తనావాద పునాదులు | 2.1-2.8 |
| పాఠం - 3 | సందర్భోచిత భావనాంశాల అధ్యయనం | 3.1-3.7 |
| పాఠం - 4 | జాన్ రాల్స్ (1921 - 2003) | 4.1-4.7 |
| పాఠం - 5 | రాబర్ట్ నోజిక్ - స్వేచ్ఛావాద హక్కుల సిద్ధాంతం | 5.1-5.8 |
| పాఠం - 6 | ఎఫ్. ఏ. హేయక్ (1899 - 1992) | 6.1-6.5 |
| పాఠం - 7 | బహుళ సాంస్కృతికత - విల్ కిమ్లిక్కా, భిఖు పరేఖ్ | 7.1-7.8 |
| పాఠం - 8 | ఆధునిక రాజ్యాలలో చట్టబద్ధమైన సంక్షోభం-జుర్గెన్ హెబెర్మాస్ | 8.1-8.7 |
| పాఠం - 9 | చరిత్ర ముగింపు - ఉదార ప్రజాస్వామ్య సమర్ధన-ప్రాన్సిస్ ఫుకుయామా | 9.1-9.6 |
| పాఠం - 10 | ఆంటోనియో గ్రాంసీ | 10.1-10.8 |
| పాఠం - 11 | మార్కెట్ సోషలిజం - డేవిడ్ మిల్లర్ | 11.1-11.9 |

పాఠం - 1

# రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రామాణిక దృక్పథం మరియు అనుభవైక దృక్పథం మధ్య గల వ్యత్యాసం

# The Concept Distinction between Normative and Empirical Political Theory as Two Distinctive ares of Political Enquiry

పాఠ్య నిర్మాణ క్రమం:

1.0. లక్ష్యం

1.1. రాజనీతి శాస్త్ర అధ్యయనం-పరిచయం

1.2. రాజనీతిశాస్త్రం అధ్యయనం-ప్రామాణిక దృక్పథం (Normative Approach) **(లేదా) సిద్ధాంతం** (Theory)

1.3. ప్రామాణిక దృక్పథం - విలువలు

1.4. ప్రామాణిక దృక్పథం - జాతి రాజ్య భావన

1.5. అనుభవైక దృక్పథం (Empirical Approach) **(లేదా) సిద్ధాంతం** (Theory)

1.6. అనుభవైక వాదం - అర్థం

1.7. అనుభవైక వాదం - రకాలు

1.8. ప్రామాణిక దృక్పథం-అనుభవైక దృక్పథం మధ్య గల వ్యత్యాసాలు

1.9. ముగింపు

1.10. మాదిరి పరీక్ష ప్రశ్నలు

1.11. ఆధార గ్రంథాలు

## 1.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశం అధ్యయనం ద్వారా ప్రామాణిక దృక్పథం అనేది విలువల ఆధారంగా రాజనీతిశాస్త్ర అధ్యయన విషయాలను ఏవిధంగా చర్చిస్తుంది. అదేవిధంగా అనుభవైక వాదం విలువల కంటే కూడా ఆచరణాత్మక సామాజిక, సంస్కృతిక మార్పులతో సంబంధం ఉన్న రాజకీయ వ్యవస్థలను, సమస్యలను ఏవిధంగా అధ్యయనం చేస్తుందో తెలుసుకొనడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

## 1.1. రాజనీతి శాస్త్ర అధ్యయనం-పరిచయం:

రాజనీతి శాస్త్ర అధ్యయనం కేవలం రాజ్యం, దాని ప్రధాన అంగమైన ప్రభుత్వం పైనే తన దృష్టిని కేంద్రీకరించింది. ఈ అధ్యయనం రాజనీతి విశ్లేషణలో రాబర్ట్‌ధాల్ వివరించినటువంటి నాలుగు దృక్పధాలను పేర్కొంటు అందులో ప్రముఖమైనటువంటి దృక్పధాల మధ్య సంబంధాలను విశ్లేషించడం జరిగింది. రాబర్ట్‌ధాల్ రాజనీతి విశ్లేషణలో తోడ్పడే నాలుగు దృక్పధాలను సూచించాడు. అవి:

1. ప్రామాణిక దృక్పధం (Normative Approach)
2. అనుభవైక పూర్వక దృక్పధం (Empirical Approach)
3. విధాన దృక్పధం
4. భావనా దృక్పధం

ఈ నాలుగు దృక్పధాలలో ప్రామాణిక దృక్పధం భవిష్యత్తులో సంభవించబోయే సంఘటనలను వివరించేదిగా ఉండగా, అనుభవ పూర్వక దృక్పధం వర్తమనా పరిస్థితులను విశ్లేషించేదిగా తోడ్పడుతుంది.

## 1.2. రాజనీతిశాస్త్రం అధ్యయనం-ప్రామాణిక దృక్పధం (Normative Approach) (లేదా) సిద్ధాంతం (Theory):

రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రామాణిక దృక్పధంను అతిపురాతన దృక్పధంగా పరిగణించవచ్చును. ఈ దృక్పధం పురాతన గ్రీకు రాజనీతి తత్వవేత్తల రచనల్లో రూపుదిద్దుకుంది. గ్రీకు తత్వవేత్తలు రాజ్యాన్ని ఒక నైతిక సంస్థగా భావించి, దాని నైతిక అంశాలపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించారు. ప్రామాణిక దృక్పధం సాంప్రదాయక దృక్పధం అయినప్పటికి ఆధునిక కాలంలో రాజనీతి సిద్ధాంతాల అధ్యయనంలో విరివిరిగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ప్రామాణిక దృక్పధాన్ని ఓటింగ్ ప్రవర్తన, ప్రజల భాగస్వామ్యం, మైనారిటీ, మెజారిటీ వర్గాల సమస్యలు మొదలైన అంశాల అధ్యయనంలో ఉపయోగిస్తున్నారు.

ప్రామాణిక దృక్పధం (లేదా) సిద్ధాంత స్వభావాన్ని తత్వవేత్తలు విభిన్నంగా వివరించారు. R.C. మాక్‌రిడిస్ అనే రచయిత ప్రామాణిక దృక్పధాన్ని వివరణాత్మక దృక్పధంగా వర్ణించాడు. H. బాల్ ప్రామాణిక దృక్పధం విలువలు, సంస్థల పట్ల అధిక ఆసక్తిని కనపరుస్తుంది అని సూచించారు. డేవిడ్ ఆస్టర్ (David Aastor) అనే రచయిత అభిప్రాయం ప్రకారం ప్రామాణిక దృక్పధం విలువలు, చట్టాలు, సంస్థల అధ్యయనానికి ఉపకరిస్తుంది. ఈ దృక్పధం ఒక రాజకీయ సమస్య

అవగాహనకు అవసరమైన మూలాన్ని గుర్తించేందుకు కూడా తోడ్పడుతుంది. ఈ దృక్పధం రాజ్యం, వనరులు, సాధనాలను అధ్యయనం చేస్తుంది.

## 1.3. ప్రామాణిక దృక్పధం - విలువలు:

ప్రామాణిక దృక్పధం విలువలపై అత్యధిక ప్రాధాన్యతను, ఆసక్తిని కనపరుస్తుంది. ప్రామాణిక దృక్పధం రాజనీతి శాస్త్రాన్ని, నైతిక శాస్త్రంగా మలిచేందుకు ప్రయత్నించింది. ప్రామాణిక దృక్పధం నైతిక విలువల అధ్యయనంతో పాటు ప్రమాణాల అధ్యయనం పట్ల కూడా అధిక ఆసక్తిని ప్రదర్శిస్తుంది. ఈ దృక్పధం ప్రకారం ప్రమాణాలు, విలువల కన్నా శాశ్వతమైనవి. స్పష్టమైనవి. ప్రమాణాల అధ్యయనం ద్వారా సామాజిక విలువలు, వ్యక్తిగత విలువలకు మధ్య గల సంబంధాన్ని అవగాహన చేసుకోవచ్చని ప్రామాణిక దృక్పధం రాజకీయ ప్రక్రియలో ప్రత్యామ్నాయాలను ఎంపిక చేయుటలో తోడ్పడే విలువలు, ప్రమాణాల విశ్లేషణను చేపడుతుంది. ప్రామాణిక దృక్పధం ఒక వ్యక్తి తనకు విలువల వల్ల కలిగే ప్రయోజనాన్ని గుర్తించినప్పుడు ఇతరుల దృష్టిలో విలువలు అంటే ఏమిటో గుర్తించగలడు అని వివరిస్తుంది.

## 1.4. ప్రామాణిక దృక్పధం - జాతి రాజ్య భావన:

ప్రామాణిక దృక్పధాన్ని అనుసరించే సిద్ధాంత వేత్తలు మొత్తం సమాజాన్ని తమ విశ్లేషణకు అంశంగా ఎన్నుకొన్నారు. వారు జాతి రాజ్యాన్ని (Native State) అధ్యయనం చేయటానికి ప్రాధాన్యత కనబర్చారు. ఎందుచేతనంటే జాతి రాజ్యం మానవ మనుగడకు తోడ్పడే నైతిక సంస్థగా భావించబడింది.

ప్రామాణిక దృక్పధం ఆది భౌతికవాద (Meta Physical) ధోరణిని బలపర్చినప్పటికి ప్రామాణిక దృక్పధాన్ని అనుసరించే అనేక మంది రాజనీతి శాస్త్రవేత్తలు అనేక ఊహలను (Assumptions) ప్రతిపాదించారు. వారు ప్రతిపాదించిన ఊహలలో ప్రధానమైనది ఏమంటే, ప్రతి విలువ నుండి ఒక వ్యతిరేఖ విలువ ఉద్భవించింది. ప్రతి వ్యక్తి సాంస్కృతిక మూర్తిమత్వాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో జరిగే ప్రతి సంఘటనకు అందులోని వ్యక్తుల భావాలే మూలం. ఒక సమాజంలో మార్పు ఆ సమాజంలోని పరస్పరం వ్యతిరేఖించే విలువల మధ్య ఏర్పడే సంఘర్షణ. పరస్పరం విరుద్ధమైన అభిప్రాయాలు గల విభిన్న గణాల మధ్య సంబంవించే ఘర్షణల నుంచి ఉత్పన్నమౌతుంది. కాబట్టి సమాజంలో ప్రతి విలువకు, వ్యతిరేకమైన మరో విలువ ఉంటుంది. అలాగే మానవుడు సాంస్కృతిక జీవి. అతని అనుభవాలే సామాజిక సంఘటనలకు ఆధారాలు. చివరగా ఈ దృక్పధం అభివృద్ధి చెందుతున్న దేశాలలో సంభవిస్తున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను, ప్రగతిని ఆయా సమాజాలలోని విలువల ఆధారంగా అవగాహన చేసుకోవడానికి ప్రతిపాదించింది.

## 1.5. అనుభవైక దృక్పధం (Empirical Approach) (లేదా) సిద్ధాంతం (Theory):

అనుభవైక వాదం (Empirical Approach) ప్రాచీన పాశ్చాత్య వాదన. గ్రీకు తత్వవేత్తలు అనుభవైక వాదాన్ని తమ సిద్ధాంతాల నిర్మాణానికి ఉపయోగించారు. గ్రీకు తత్వవేత్తలయిన అరిస్టాటిల్ ప్రఖ్యాత అనుభవైక వాది అరిస్టాటిల్ అభిప్రాయం ప్రకారం వాస్తవం (Reality) స్పష్టమైనది. అది కళ్ళకు గోచరిస్తుంది. అరిస్టాటిల్ తన రాజనీతి విశ్లేషణను అనుభవైక పరిశోధన ద్వారా సాగించాడు. అయితే అరిస్టాటిల్ నైతికత, ఆచరణాత్మక పరిజ్ఞానం కలిసికట్టుగా ఉండాలని వాదించాడు. అరిస్టాటిల్

తరువాత రూసో, బెంధామ్‌లు అనుభవైక దృక్పధాన్ని అనుసరించి తమ సిద్ధాంతాలను రూపొందించారు. బెంధామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాదం, అనుభవైక వాదానికి ప్రతిరూపము కాగా ఆధునిక కాలంలో లార్డ్‌బ్రైస్, బెర్ట్రాండ్ రస్సెల్, కారల్ మార్క్స్‌మొదలైన రాజనీతి తత్వవేత్తలు తమ సిద్ధాంతాలను, భావాలను తమ అనుభవాల ప్రాతిపదికగా రూపొందించారు.

## 1.6. అనుభవైక వాదం - అర్థం:

అనుభవం, పరిజ్ఞానానికి మూలం అనే అంశం. అనుభవైక ప్రాతిపదిక అనగా రాజకీయ ప్రవర్తన, శాస్త్రీయ అధ్యయనమే - అవెరీ లీసర్‌సన్. వి.వి. డైక్ అనుభవైక వాదం అనగా రాజకీయ వాస్తవాలు, వాటి అన్వేషణలో సన్నిహితంగా ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఆల్మండ్, పోవెల్ పేర్కొన్నట్లు అనుభవైకవాదం సామాజిక స్థిరీకరణ, సాంస్కృతిక, సామాజిక మార్పులతో సంబంధం ఉన్న రాజకీయ వ్యవస్థలను, సమస్యలను అధ్యయన చేస్తుంది. డైకీ అభిప్రాయంలో అనుభవైక వాదం ఏది ఎలా ఉండాలి అనే అంశంపై కానీ, ఏది ఏమిటి ? అనే అంశంపై ప్రాధాన్యత వక్కాణిస్తుంది. దీని అర్థం ఏమిటంటే అనుభవైక వాదం విలువల అధ్యయనానికంటే వివరణాత్మక అధ్యయనానికే అధిక ప్రాధాన్యత కనబరుస్తుంది.

## 1.7. అనుభవైక వాదం - రకాలు:

అనుభవైక వాదాన్ని బలపరచిన ఆధునిక రాజనీతి శాస్త్రవేత్తలో రాబర్ట్ ధాల్ (Robert Dahl) ప్రముఖుడు. ధాల్ అనుభవైక వాదులను రెండు తరగతులుగా విభజించారు. అవి:

1. అనుభవైకవాద సిద్ధాంతవేత్తలు
2. బహుళ అనుభవైక సిద్ధాంతవేత్తలు.

ధాల్ అభిప్రాయం ప్రకారం ఈ సిద్ధాంతవేత్తలు విశ్లేషణలు రెండు అంశాల చుట్టూ పరిభ్రమిస్తుంది. అవి:

1. రాజకీయ విశ్లేషణ తటస్థత సాధ్యమా
2. రాజకీయ విశ్లేషణ తటస్థంగా ఉండవచ్చా! అనేది అంశాలుగా ఉన్నాయి.

అనుభవైక వాదులు వారించేది ఏమంటే రాజకీయాల పట్ల వ్యక్తుల ఆచరణాత్మకతను, విలువలతో ప్రమేయం లేకుండా పరిశీలించవచ్చును. ఆచరణాత్మకంగా సరైనటువంటి నిర్ణయం, విలువల దృష్ట్యా సరైంది కాకపోవచ్చు. వాస్తవాలను అనుభవైక పరీక్షకు గురిచేయవచ్చును. కాని విలువలను ఎలాంటి పరీక్షకు గురిచేయలేము. విలువలు పూర్తిగా ఆత్మాశ్రయమైనవి. అయితే వాస్తవాలు కంటికి గోచరించడమే కాకుండా పరీక్షించవచ్చును.

బహుళ అనుభవైక వాదులు విశ్లేషించేది ఏమంటే రాజనీతి శాస్త్ర అధ్యయనంలో విలువలు, యదార్థాలు అతి సన్నిహితంగా ముడిపడి ఉండడం వలన వాటిని వేరుపరచడం అతికష్టం. వీరి వాదన ప్రకారం ఏ రాజకీయ సిద్ధాంతమైనా యదార్థ ప్రతిపాదనల మాన్యతను (Validity), మూల్యాంకనాలనే కాక ఆ సిద్ధాంతంలో పేర్కొన్న రాజకీయ సంఘటనలు, ప్రక్రియల, వ్యవస్థల నైతిక స్వభావాలు కూడా మూల్యాంకనను కలిగి ఉంటుంది. అందుచేత రాజనీతిశాస్త్రం పూర్తిగా వస్తుపరమైనది అని భావించడం సహేతుకం కాదని వారు వాదించారు.

పై రెండు దృక్పధాల మధ్య వ్యత్యాసాలు ఉన్నప్పటికి వాటి మధ్య కొంత ఏకాభిప్రాయం లేకపోలేదని రాబర్ట్ ధాల్ పేర్కొన్నారు. ఈ రెండు దృక్పధాలు అనుభవైక అధ్యయనాల నుంచి విలువలను పూర్తిగా తొలగించటం సాధ్యం కాదని పేర్కొన్నాయి. ఈ రెండు దృక్పధాలు కొన్ని అంశాలపై ఏకాభిప్రాయాన్ని కలిగి ఉన్నాయి. అవి:

- సామాజిక శాస్త్రాలలో, ప్రకృతి శాస్త్రాలలో పరిశోధకుని విలువలు, ప్రయోజనాలు, అతని పరిశోధన అంశాల ఎంపికను ప్రభావితం చేస్తాయి.
- కేవలం అనుభవైక పరిజ్ఞానం ఆధారంగా ప్రాముఖ్యత, ఉపయుక్తతల ప్రాతిపదికను స్థాపించలేము.
- రాజకీయాల నిష్పాక్షిక విశ్లేషణను చేపట్టక ముందు యదార్థం విలువలను అంగీకరింపక తప్పదు.
- అనుభవైక పరిశోధనను చేపట్టే ముందు కొన్ని అంశాలకు ఊహలను అంగీకరించాలి.
- ప్రకృతి శాస్త్రాలలో వలె సామాజిక శాస్త్రాలలో పరిశోధకుల పాక్షిక భావాలను పూర్తిగా తొలగించడం సాధ్యం కాదు.

రాజనీతి శాస్త్రంలో అనుభవైక వాదం సంఘటనలు, వ్యక్తులు, సంస్థలు మధ్య గల సంభావ్యత (Probability) కార్యపరమైన, కారణ కారక సంబంధాలను గుర్తించేందుకు, వివరించేందుకు, ఊహించేందుకు ప్రయత్నిస్తుంది. రాబర్ట్ ధాల్ పేర్కొన్నట్లు రాజనీతి శాస్త్రంలో అనుభవైక వాదం సిద్ధాంతాలను, సాధారణీరణలను నిశిత పరిశీలన ద్వారా, వర్గీకరణ కొలమానముల ద్వారా నిశితమైన పరీక్షకు గురిచేస్తుంది. అందుచేత ఈ అనుభవైక రాజనీతి విశ్లేషణ శాస్త్రీయ దృక్పధాన్ని కలిగి ఉంది.

## 1.8. ప్రామాణిక దృక్పధం-అనుభవైక దృక్పధం మధ్య గల వ్యత్యాసాలు:

రాజనీతి శాస్త్రం అధ్యయనానికి సంబంధించిన విభిన్న కాలాల్లో విభిన్న దృక్పధాలు వెలుగులోనికి వచ్చాయి. ఈ దృక్పధాలను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

- ప్రామాణిక దృక్పధం (Normative Approach)
- అనుభవైక దృక్పధం (Empirical Approach)

ఈ రెండు దృక్పధాలు విలువలకు భిన్నంగా వాస్తవాలకు లేదా వాస్తవాలకు భిన్నంగా విలువలకు ఇస్తున్న ప్రాముఖ్యత ప్రాతిపదికగా స్పష్టంగా వేరుచేయబడ్డాయి.

ఈ రెండు దృక్పధాలు మౌలికంగా కొన్ని అంశాలలో విభేదించినప్పటికి ఆ విభేదాలు అంత తీవ్రమైనవి మాత్రము కావు. రాబర్ట్ ధాల్ సూచించినట్లు ఈ రెండు దృక్పధాలకు విస్తృత విషయాలలో ఏకాభిప్రాయం ఉంది. ప్రయోగాత్మక అధ్యయనాల నుండి, విలువలను వేరుచేయడానికి వీల్లేదని ఇరువురూ అంగీకరిస్తారు. ఈ రెండు దృక్పధాలు క్రింది అంశాలలో సమాన ఆసక్తిని కలిగి ఉంటాయి.

- సాంఘిక శాస్త్రాల్లోను, ప్రగతి శాస్త్రాల్లోను విషయాలను ఎంపిక చేసే సందర్భంలో పరిశీలకుని సొంత ఆసక్తి, ప్రయోజనాలు అతనిని ప్రభావితం చేస్తాయని రెండు సిద్ధాంతాల కర్తలు అంగీకరిస్తారు.

- పరిశోధనా రంగంలో ఏ అంశం మిగతావాటి కంటే ముఖ్యమైనదో నిర్ణయించడానికి ప్రతి పరిశోధకుడికి ఏదో ఒక విలువ అవసరమవుతుంది.
- ఎలాంటి ప్రయోగాత్మక పరిశోధనైనా ప్రారంభించబోయే ముందు కొన్ని అంశాలకు సంబంధించిన ఊహలు, సాక్ష్యాధారాలు అవసరం లేని శాస్త్ర పూర్వ విజ్ఞానాన్ని ఆమోదించాలి.
- ప్రకృతి శాస్త్రాలకు సంబంధించిన పరిశోధనకు భిన్నంగా, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన పరిశోధనల్లో పరిశీలకుని దురభిప్రాయాలకు తావు లేకుండా చేయడం సాధ్యం కాదు. ప్రకృతి శాస్త్రాల్లో పరిశోధనకు సంబంధించిన ఫలితాలను సులువుగా పరీక్షించడానికి వీలైన నిర్మాణాత్మకమైన పద్ధతులుండటం వలన ఈ దురాభిప్రాయాలను సరిదిద్దుటకు వీలుంటుంది.

ఈ రెండు తాత్విక సిద్ధాంతాల మధ్య వివాదం రాజనీతిశాస్త్రం తటస్థంగా ఉండాలా? లేదా? అన్న అంశం గురించి మాత్రమే. అనుభవైక వాదులు మోపిన అభియోగాలను రాబర్ట్ డాల్ నాలుగు రకాలుగా పేర్కొన్నారు. అవి:

- ప్రామాణిక వాదులకు సంబంధించి ప్రమాణాలు లేవు.
- తటస్థత కొరకు, నిష్పాక్షికత కొరకు కృషి చేయడంతో ప్రామాణిక వాదులు, నూతనమైన, క్లిష్టమైన పరిభాషను ఆశ్రయించారు.
- విలువలను విడనాడే ప్రయత్నంలో ప్రామాణికవాదులు అంచనా వేయటానికి వీలైన అంశాలన్నింటిని తిరస్కరించి అన్ని విలువలను ఒకే విధంగా పరిగణిస్తారు.
- తటస్థ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకుంటున్నా కూడా వారు ఉదారవాద ప్రజాస్వామ్య పక్షపాతులు, వారికి ఖచ్చితమైన ప్రమాణాలు లేవని అతీత ప్రామాణిక వాదులు అంటారు.

అదేవిధంగా ప్రామాణిక వాదులు భావిస్తున్న లాగా శాస్త్ర విజ్ఞానాన్ని సంకుచిత దృక్పథంలో పరిగణించదని అనుభవైక వాదుల యొక్క మరొక అభియోగం. విలువలకు సంబంధించిన అన్ని నిర్ణయాలను తమలో ఇముడ్చుకునేలా శాస్త్ర విజ్ఞానాన్ని విస్తృతం చేయాలని వారు భావిస్తారు. ఫ్రెంచి తత్వవేత్తలైన జాక్విన్, మారిషైన్ లాంటి వారందరూ ఈ దృక్పథాన్ని అనుసరిస్తున్నారు.

చివరిగా ప్రామాణిక వాదుల పట్ల, అనుభవైక వాదులు చేసిన మరో రెండు విమర్శనాంశాలను పరిశీలించవలసిన అవసరముంది. అవి:

- ప్రామాణిక వాదులు ప్రాముఖ్యం లేని, మానవ లక్ష్యాలకు సంబంధం లేని పరిశోధనల్లో సమయం వృధా చేస్తారని విమర్శ చేయడం జరిగింది.
- తటస్థతను, నిష్పాక్షికతను రూపొందించుటలో ప్రామాణిక వాదులు నూతనమైన క్లిష్టమైన ప్రత్యేక పరిభాషను సృష్టించవలసిన అవసరం ఏర్పడింది. దీనికి ప్రామాణిక వాదులు, విషయ సంబంధమైన అంశాలు, సాంప్రదాయ సిద్ధాంతవేత్తల దృష్టిని ఆకర్షించిన విషయాలను గురించే చర్చిస్తున్నాయని సమాధానం చెప్పారు.

రాజకీయ వ్యవస్థల రకాలు, మార్పు, విప్లవం, నియంతృత్వం, యుద్ధం, శాంతి, సమానత్వం, అసమానతలు వంటి సమస్యలు సాంప్రదాయక రాజనీతి తత్వవేత్తల దృష్టినాకర్షించి, వాటిని కూలంకుషంగా చర్చించడానికి అవకాశం లభించింది.

## 1.9. ముగింపు:

అనేకమంది అనుభవైక వాదులు ప్రామాణిక సిద్ధాంతానికి, విలువలకు సంబంధించిన ప్రకటనలన్నీ అర్ధరహితం అన్న పురాతన తార్కిక సిద్ధాంతవాదుల వాదనను పురస్కరించుకొని ప్రామాణికవాదులపై అభియోగం చేయడం జరిగినది. రాజనీతి శాస్త్రాన్ని గూర్చి తటస్థమైన, నిష్పాక్షికమైన వివరణను రూపొందించటానికి విలువల పట్ల ఉపేక్ష వహించవలసిన అవసరం లేదని వారు విశ్వసించడం లేదు అనేక మంది ప్రామాణిక వాదులు బ్రెక్ట్ (Brecht) తన శాస్త్రీయ విలువలకు సంబంధించిన సాపేక్ష సిద్ధాంతంలో ప్రతిపాదించిన సూత్రాలను అంగీకరిస్తున్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం విలువలు శాస్త్ర విజ్ఞానానికి అతీతమైనది. నైతికపరమైన ఎంపికకు, శాస్త్రీయ పద్ధతులకు అనుగుణమైన విధానం అవసరమని బ్రెక్ట్ భావించాడు.

## 1.10. మాదిరి పరీక్ష ప్రశ్నలు:

**వ్యాసరూప ప్రశ్నలు:**

1) రాజనీతి శాస్త్రంలో ప్రామాణిక దృక్పధాన్ని గూర్చి చర్చించండి?

2) రాజనీతి శాస్త్రంలో అనుభవైక దృక్పధాన్ని గూర్చి వివరింపుము?

3) ప్రామాణిక మరియు అనుభవైక దృక్పధాల మధ్య వ్యత్యాసాలను చర్చించుము?

## 1.11. ఆధార గ్రంథాలు:

1. రాబర్ట్ ధాల్ - ఆధునిక రాజకీయ విశ్లేషణ.
2. ఆధునిక రాజనీతి సిద్ధాంతం - S.P. వర్మ.
3. రాజనీతి శాస్త్రం - ఒక తాత్విక విశ్లేషణ - Van Dyke.

రచన:
**డా॥ డి. మనో వికాస్**
M.A., B.Ed., Ph.D.
రీసెర్చ్ స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

పాఠం - 2

# అనుభవైక రాజనీతి సిద్ధాంతం-ప్రవర్తనావాద పునాదులు

# Behaviouralist Foundations of Empirical Political Theory

**పాఠ్య నిర్మాణ క్రమం:**


2.0. లక్ష్యం

2.1. పరిచయం

2.2. నూతన దృక్పథాల అభివృద్ధి (Development of New Approaches)

2.3. ప్రవర్తనావాదం - అనుభవైక దృక్పథం

2.3.1. ప్రవర్తనావాదం-స్వభావం, అర్థం (Nature and Meaning of Behaviouralism)

2.3.2. ప్రవర్తనావాద సిద్ధాంతం, ప్రవర్తనావాదము

2.3.2.1. ప్రవర్తనా సిద్ధాంతం (Behavioural Theory)

2.3.2.2. ప్రవర్తనావాదం (Behaviouralism)

2.4. అనుభవైకవాదం, ప్రవర్తనావాదం (Empiricalism, Behaviouralism)

2.4.1. ప్రవర్తనావాదం లక్షణాలు (Characteristics of Behaviouralism)

2.4.1.1. క్రమబద్ధతలు (Regularities)

2.4.1.2. పరిశీలనలు లేక నిరూపణలు (Verifications)

2.4.1.3. పద్ధతులు (Techniques)

2.4.1.4. పరిమాణాత్మీకరణము (Quantification)

2.4.1.5. విలువలు (Values)

2.4.1.6. క్రమబద్ధీకరణము (Systematization)

2.4.1.7. శాస్త్రీయత లేక నిర్దిష్ట శాస్త్రము (Pure Science)

2.4.1.8. ఏకీకరణము (Integration)

2.4.2. రాజనీతి శాస్త్రంపై ప్రవర్తనావాద ప్రభావం (Impact of Behaviouralism on Political Science)

**2.5. ముగింపు**

**2.6. మాదిరి పరీక్ష ప్రశ్నలు**

**2.7. ఆచూకి గ్రంధాలు**

## 2.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశం అధ్యయనం వలన ప్రవర్తనావాదం అనగా ఏమిటి, రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ఏవిధంగా తన పరిశోధనా పద్ధతులను, విజ్ఞానశాస్త్రాలను రాజనీతి శాస్త్రానికి ఏవిధంగా అన్వయించారు. అదేవిధంగా అనుభవవాద దృక్పధం రాజనీతి శాస్త్రములో ప్రాధాన్యత కలిగి ఉండడానికి ఈ ప్రవర్తనా వాద అంశాలు ఏవిధంగా సహాయకారిగా ఉన్నాయి మరియు తాత్విక పునాదులను ఏవిధంగా ఏర్పరచినది తెలుసుకొనడం జరుగును.

## 2.1. పరిచయం:

రాజనీతి శాస్త్ర చరిత్రలో ప్రవర్తనావాదం ప్రముఖమైనది. రాజనీతి శాస్త్రపు గమ్యాలు, పరిధి, స్వభావం, క్రమపద్ధతుల్లో మార్పులను కొనితెచ్చిన గొప్ప విప్లవంగా ఈ ప్రవర్తనావాదం కొనియాడబడింది. ప్రత్యక్ష, పరోక్ష మానవ ప్రవర్తన పరిశీలన ఆధారంగా తమ నిర్ణయాలను రూపొందించాలన్న నూతన శాస్త్రవేత్తల నిర్ణయం ప్రవర్తనాధ్యయనం ఆరంభాన్ని సూచిస్తుంది. ఈ వైఖరి ఆధునికమైనది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రచారంలోనికి తీసుకొనివచ్చిన కొత్త పంథాయే ప్రవర్తనావాద వైఖరి.

ప్రారంభంలో ప్రవర్తనావాదులకు ఈ ఉద్యమాన్ని గురించి స్పష్టమైన భావం లేదు. సాంప్రదాయక దృక్పధాన్ని వ్యతిరేకించడమే వారి ప్రధాన ఉద్దేశ్యం క్రమంగా ప్రవర్తనా వాదం నూతన వాస్తవాలను కనుగొనడంలోనూ, అభివృద్ధి చేయటంలోను, నూతన ప్రక్రియలను క్రమబద్ధమైన విధానంలో రూపొందించడంలోనూ, ఒక నూతన విధానమని అంగీకరించబడింది. రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనా వాద ఉద్యమాన్ని మూడు ప్రత్యేక దశల్లో గమనించవచ్చు.

1. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం 1920లో ఆరంభమై 1930తో అంతమైన దశాబ్దంలో అనుభవ పూర్వక, పరిమాణాత్మక పద్దతుల ఉపయోగం విస్తృతంగా వ్యాప్తిలోనికి రావడం గమనించవచ్చు.
2. ప్రవర్తనావాదం రెండవ దశలో 1950 వరకు ప్రవర్తనావాదులు పరిపూర్ణమైన, అపరిపూర్ణమైన రెండు రంగాలకు తమ కార్యకలాపాలను విస్తరించారు. తర్వాత వారు విభిన్న విషయాలలో ప్రత్యేక నైపుణ్యతను సంతరించుకోవడం ప్రారంభించారు.
3. 1960లో ప్రారంభమైన దశాబ్దంలో ప్రవర్తనావాదులు సిద్ధాంతపరమైన ప్రవర్తనావాదులుగాను, కార్యశీలక ప్రవర్తనావాదులు గాను విడిపోయారు.

## 2.2. నూతన దృక్పధాల అభివృద్ధి (Development of New Approaches):

ప్రవర్తనావాదం అన్న నూతన దృక్పధం ప్రధానంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అభివృద్ధి చెంది క్రమంగా పెరిగి, ప్రపంచ రాజనీతి శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. చార్లెస్ మెరియం (Charles Marriam), హెరాల్డ్ లాస్వెల్ (Harold Lasswel), డేవిడ్ ట్రూమన్ (David Truman), సైమన్ (Simon), ఆల్మండ్ (Almond) మొదలగువారు ప్రవర్తనావాదాన్ని ప్రచారంలోనికి తీసుకొనివచ్చారు. ప్రవర్తనావాద ఉద్యమ అభివృద్ధిని గూర్చి పరిశీలిద్దాం.

1. ఇప్పటివరకు రాజనీతి శాస్త్ర అధ్యయనంలో చారిత్రక పద్ధతి ముడిపడి ఉండేది. రాజనీతి శాస్త్రజ్ఞులు, రాజ్యాంగాలను, పార్లమెంటు, రాజు, మంత్రివర్గం లాంటి వ్యవస్థలను చారిత్రక దృష్టితోనే పరిశీలిస్తూ ఉండేవారు. వ్యవస్థల చారిత్రక అధ్యయనానికే ప్రాధాన్యత యిచ్చినప్పటికీ, కొందరు రాజనీతి తత్వవేత్తలు సార్వభౌమత్వం, హక్కులు మొదలైన భావాలతో పాటుగా ప్రభుత్వాలు పనిచేస్తున్న తీరుతెన్నులను విశ్లేషించే ప్రయత్నాలు చేశారు. ఇటువంటి అధ్యయన సాంప్రదాయం సోక్రటీసు కాలం నుండి ఉన్నప్పటికి 19వ శాతాబ్ద కాలంలో ప్రాధాన్యతను సంతరించుకొన్నది. క్రమంగా రాజకీయ సంస్థల వ్యవహార సరళిని గూర్చి మేధావులు చర్చించడం ప్రారంభమయింది. 1903వ సంవత్సరంలో అమెరికా రాజనీతి శాస్త్ర సంఘం స్థాపించడంతో రాజనీతి శాస్త్ర అధ్యయన పద్ధతులలో నూతనత్వం ప్రవేశించడం ప్రారంభమయినది. గత శతాబ్దం కంటే 20వ శతాబ్దంలో ఆరంభంలో రాజనీతి శాస్త్రం ఎక్కువ సమాచారాన్ని సేకరించగలిగింది. 20వ శతాబ్దం ఆరంభం నాటికి విజ్ఞాన రంగంలో సాధించబడిన ప్రగతి రాజనీతిశాస్త్రాన్ని బాగా ప్రభావ పరిచింది. ప్రధానంగా జీవ, మానవ శాస్త్రాల పరిశోధనా పద్ధతులు రాజనీతి శాస్త్రానికి బాగా ఉద్దీపన కలుగజేసాయి. సామాజిక శాస్త్రాలన్నింటిలోనూ, మానవ జీవన విధానమే ప్రధాన అధ్యయనమైనందువల్ల, సామాజిక శాస్త్రాల అధ్యయన పద్ధతులు అనుసరించడం రాజనీతిశాస్త్రానికి లాభదాయకమైన విషయంగా భావించబడింది.

   ప్రవర్తనావాదుల ప్రవేశంతో పరిశోధకులకు నూతన పద్ధతులు, అవసరమన్న విషయాన్ని గుర్తించడం జరిగినది. అప్పటివరకు రాజనీతి శాస్త్ర పరిశోధకులు సాంప్రదాయకమైన పురాతన పద్ధతులనే వినియోగిస్తూ వచ్చారు. లార్డ్‌బ్రైస్ లాంటి మేధావులు కేవలం అంతర్ దృష్టితోనే సూత్రాలను రూపొందించుకున్నారు. ప్రవర్తనావాదులు అంతకంటే మంచి పద్ధతులను, విశ్లేషణా పరికరాలను ఉపయోగించడం ఆరంభించారు. ప్రవర్తనావాదుల రంగప్రవేశంతో రాజనీతి శాస్త్రంలో పెల్లుబికిన నూతనత్వమే. ప్రవర్తనావాద దృక్పధం అని పిలువబడుచున్నది. రాజనీతి శాస్త్ర స్వభావంలో బాగా మార్పులు సంభవించాయి. కొత్త పద్ధతులు, పరికరాలు, విధానాలు అనుసరించడంతో రాజనీతి శాస్త్ర అధ్యయనానికి కొత్త జీవం లభించింది. గతంలో వలె విశ్లేషణకు రాజకీయ సంస్థలు ప్రధానమైన విషయంగా భావింపబడలేదు. రాజకీయ సందర్భాల అధ్యయనం, వ్యక్తుల ప్రవర్తనల పరిశీలన వైపు అధ్యయన దృష్టి మళ్ళించబడింది.

2. 1906 నుండి అమెరికన్ పొలిటికల్ సైన్స్ రివ్యూ అను సంచిక ప్రచురింపబడడం ప్రవర్తనావాద ఆవిర్భావంలో ప్రధానమైన సంఘటనగా భావించబడుతున్నది. ఈ సంచికలో ప్రచురింపబడిన వ్యాసాలు కొత్త దృక్పధాన్ని ఏర్పరచినది అని చెప్పవచ్చును. 1908లో బ్రిటీషు రచయిత గ్రాహమ్ వేల్స్ రచించిన "రాజకీయాలలో మానవ

స్వభావం" (Human Nature in Politics) అనే గ్రంథంలో రాజకీయ ప్రవర్తనకు, మనోవిజ్ఞాన శాస్త్ర విజ్ఞానం యొక్క ప్రాతిపదిక, ప్రాముఖ్యతలను వివరించాడు. గ్రాహమ్ వెల్స్ మానవుడు కేవలం ప్రాణికాదని, అతని రాజకీయ కార్యకలాపాలన్నింటికి స్వప్రయోజనం అనేది మార్గదర్శకంగా ఉంటుందని భావించాడు. రాజకీయ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి రాజకీయ పరిస్థితులలో మానవుడు ఎలా ప్రవర్తిస్తాడో అన్న విషయం అవగాహన చేసుకోవలసిన అవసరానికి అతడు ప్రాధాన్యమిచ్చాడు.

3. రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనావాద దోరణికి పునాదులు వేసిన వారితో ఆర్థర్ బెంట్లీ (Aurther Bentley), చార్లెస్ మెరియం (Charle Merriam) ప్రముఖులు. ఆర్థర్ బెంట్లీ రచించిన "ప్రభుత్వ ప్రక్రియ" (The Process of Government) అనే గ్రంథంలో రాజకీయ ప్రక్రియలో ఒత్తిడి తెచ్చే సమూహాల, పార్టీల, ఎన్నికల, ప్రజాభిప్రాయం పాత్రల ప్రాముఖ్యాన్ని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

## 2.3. ప్రవర్తనావాదం - అనుభవైక దృక్పథం:

చార్లెస్ మెరియమ్ (Charles Marriam) ప్రవర్తనావాద రాజనీతి శాస్త్రానికి మూలపురుషుడుగా భావింపబడుచున్నారు. 1908లో ఆయన ప్రచురించిన 'Primary Elections' అను గ్రంథం అనుభవవాద దృక్పధానికి సంబంధించిన ప్రధానమైన గ్రంధాలలో మొదటిది. 1921లో 'అమెరికన్ రాజనీతి శాస్త్ర సమితి' పత్రికలో వ్రాసిన వ్యాసంలో సమాజ, మనోవిజ్ఞాన, భూగోళ, మానవవర్గ, వర్ణన, జీవ, గణాంక శాస్త్రాలలో అనుసరించబడుతున్న పరిశోధనా పద్ధతుల ఫలితాల పట్ల అధిక శ్రద్ధ వహించవలసినదిగా రాజనీతి శాస్త్రజ్ఞులు మెరియమ్‌ను కోరినారు. రాజనీతి శాస్త్ర అధ్యయనంలో అనుసరించబడుతున్న పద్ధతుల పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరిచాడు. అమెరికన్ రాజనీతి శాస్త్ర సంఘంలోనే, పరిశోధనా పద్ధతులు మెరుగుపరచే ఉద్దేశ్యంలో రాజనీతి శాస్త్ర పరిశోధనపై ఒక కమిటీని ఏర్పరచారు. 1925లో అమెరికా రాజనీతి శాస్త్ర సంఘంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ మెరియమ్ రాజకీయ ప్రవర్తనను పరిశోధనాత్మక విషయంగా పరిగణించాల్సిందిగా కోరారు.

రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనావాద ఉద్యమంలో అనేక మంది రాజనీతి తత్వవేత్తలకు సంబంధం ఉంది. వారిలో చాలా మంది అమెరికా దేశస్థులే, వీరు అందరూ సాంప్రదాయక రాజనీతి శాస్త్ర దృక్పధం పట్ల అసంతృప్తిని కలిగి ఉన్నారు. నూతన పరిశోధనా పద్ధతులను అనుసరించడం ద్వారా రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాద శాస్త్రంగా (Empirical Science) తీర్చిదిద్దుకోవచ్చని వీరి భావన. రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాదం ద్వారా శాస్త్రీయమైన దానినిగా చేయడానికి ప్రయత్నించడం జరిగినది.

### 2.3.1. ప్రవర్తనావాదం-స్వభావం, అర్థం (Nature and Meaning of Behaviouralism):

అనేక మంది రచయితలు 'ప్రవర్తనావాదం' అన్న పదాన్ని నిర్వచించడానికి ప్రయత్నించారు. కాని వారందరు ఈ భావనకు సమానార్థక భావాన్ని కల్పించడంలో విఫలమయ్యారు. ఈ భావం విప్లవం, సంస్కరణోద్యమం, మానసిక స్థితి, దృక్పధం, వైఖరి అని బహుముఖమైంది. దీనిని బట్టి "ప్రవర్తనావాదం" యొక్క ప్రధాన విషయం 'ప్రవర్తన' అని మనం అవగాహన చేసుకోవచ్చును. ప్రవర్తనావాదం ప్రవర్తనను నూతన అధ్యాయానికి సంబంధించిన విషయంగా తీసుకొని, తద్వారా

అన్ని నిర్ణయాలను రూపొందిస్తుంది. రాబర్ట్ ఎ. ధాల్ (Robert A. Dahl) ప్రవర్తనా వాదాన్ని ఒక మనోభావంగా వ్యాఖ్యానించాడు. 1951లో చికాగో విశ్వవిద్యాలయం జరిపిన సెమినార్‌లో పాల్గొంటూ డేవిడ్ ట్రూమన్ (David Truman) ప్రవర్తనా వాదాన్ని ఈ విధంగా నిర్వచించాడు. పాలనా ప్రక్రియలో భాగస్వామ్యులైన వ్యక్తుల, వర్గాల చర్య, ప్రతిచర్యలే రాజకీయ ప్రవర్తనా పాలనా ప్రక్రియలో అంతర్భాగమైన మానవుల చర్యలన్నింటిని రాజకీయ ప్రవర్తనలో చేర్చవచ్చును.

ప్రవర్తనావాదుల దృష్టిలో అసలైన పరిశోధనకు రెండు ప్రాధమిక విషయాలు ముఖ్యమై ఉన్నాయి. అవి:

1. పరిశోధన శాస్త్రీయమైనదిగా ఉండటం పరిశోధనలో ఉపయోగపడే నిర్దిష్ట సాక్ష్యాధారాలు నిరూపణ చేయబడేవిగా ఉండాలి.

2. రాజకీయ ప్రవర్తనల పరిశోధనలు అనుభవైక పద్ధతులపై ఆధారపడి ఉండటం. సిద్ధాంత ప్రాతిపదిక లేని అనుభవవాదం నిర్జీవమై పోతుంది. అనుభవవాద పరీక్షలకు నిలవని ఊహాలోచనలు నిష్ప్రయోజనం. రాజకీయ ప్రవర్తన అధ్యయనంలో రాజకీయ ప్రక్రియల శాస్త్రీయ విజ్ఞానం వృద్ధి చెందించడం ప్రధాన ధ్యేయంగా ఉండాలి.

సమాజంలో వ్యక్తులు ఏవిధంగా వ్యవహరించాలన్నది పరిశోధనాంశంగా ఉండరాదు. వ్యక్తుల ప్రవర్తనలోని ప్రాధమిక విలువలను ప్రధానమైన పరిశోధనాంశంగా గ్రహించాలి. పరిశోధకుని వ్యక్తిగతమైన విలువలు కూడా పరిశోధనాంశాన్ని ఎంచుకోవడంలో ప్రధానమైన ప్రభావాన్ని కలుగజేస్తాయి. రాజనీతి శాస్త్రము ప్రవర్తనా వాదానికి నిర్దిష్ట నిర్వచనం కన్నా ప్రధాన స్వభావాల వివరణకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది.

### 2.3.2. ప్రవర్తనావాద సిద్ధాంతం, ప్రవర్తనావాదము:

ఆధునిక రాజనీతి సిద్ధాంతాన్ని అధ్యయనం చేయువారు, తరచు ప్రవర్తనావాద సిద్ధాంతం, ప్రవర్తనావాదము అన్న రెండు పదాల మధ్య భేదాలను గుర్తించలేకపోతున్నారు. దీనివలన దుష్ఫలితాలు, తప్పుడు నిర్ణయాలకు అవకాశం కలుగుతుంది. అందువలన ఈ రెండింటి మధ్య భేదాన్ని తెలుసుకొనివలసిన అవసరం ఎంతైనా ఉంది.

#### 2.3.2.1. ప్రవర్తనా సిద్ధాంతం (Behavioural Theory):

ప్రవర్తనా సిద్ధాంతం మనస్తత్వ శాస్త్రానికి సంబంధించినది. ఇది ఉద్దేశాలు, భావనలు, భావాలకు సంబంధించిన కోరికలపై ఆధారపడుతుంది. పరిశోధన ఆధారంగా లేకపోతే ఈ వాదం శాస్త్రీయం కాదు.

#### 2.3.2.2. ప్రవర్తనావాదం (Behaviouralism):

ప్రవర్తనావాదం శాస్త్రీయ సిద్ధాంత, పరిశోధనలను ప్రాతిపదికలుగా కలిగి ఉంది. రాజనీతి శాస్త్రంలో ఇది ఒక నిరసనోద్యమం. ఈ వాదం రాజకీయ వాస్తవాలను విశ్లేషించటంలోను, వివరించటంలోను ఒక పద్ధతిగా ఉపయోగపడతుంది.

## 2.4. అనుభవైకవాదం, ప్రవర్తనావాదం (Empiricalism, Behaviouralism):

అనుభవైకవాదం పురాతన దృక్పధం కాగా ప్రవర్తనావాదం నూతన దృక్పధం. ప్రవర్తనావాద ఆవిర్భావం గ్రాహమ్‌వెల్స్

(Graham Wells) రచన. అయిన “రాజకీయంలో మానవ స్వభావం” (Human Nature in Politics) లో గమనించవచ్చు. సాంఘిక శాస్త్రాలలో పరిశోధన పద్ధతులు, ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల పరిశోధనల ప్రాముఖ్యాన్ని గురించి ప్రవర్తనావాదులు చెప్పారు. అనుభవైకవాద అధ్యయనంలో అవలంభించే చారిత్రక, సాంస్కృతిక అధ్యయనం, విశ్లేషణ కూడా ఇమిడి ఉంటాయి.

**2.4.1. ప్రవర్తనావాదం లక్షణాలు (Characteristics of Behaviouralism):**

డేవిడ్ ఈస్టన్ తన "Essay on the Current Meaning of Behaviouralism" అనే గ్రంథంలో ప్రవర్తనావాద విప్లవానికి సంబంధించిన కొన్ని ముఖ్య సూత్రాలను సూచించారు. ఈయన సూత్రాలను ప్రవర్తనావాద ఉద్యమ నిర్మాణానికి కారణభూతమైన మేధా సంబంధమైన ప్రాతిపదికలుగా భావించాడు. ఈస్టన్ వివరణలో ఈక్రింది లక్షణాలు ప్రధానంగా ఉన్నాయి. అవి:

**2.4.1.1. క్రమబద్ధతలు (Regularities):**

వ్యకుల రాజకీయ ప్రవర్తనలలో క్రమబద్ధతగల, గుర్తించుటకు వీలైన ఏకాకృతులు ఉన్నవని ప్రవర్తనావాదులు భావిస్తారు. అలాంటి వాటిని సాధారణీకరించుట ద్వారా గాని సూత్రబద్ధం చేయడం ద్వారా గాని లేక రాజకీయ సంఘటనలను సూచించేందుకు గాని, వివరించటానికి అవకాశమున్నదంటారు. రాజకీయ ప్రవర్తన ఎప్పుడు ఒకే రకంగా ఉంటుందని చెప్పలేకపోయినప్పటికీ, కొన్ని విషయాలలో అనేక సందర్భాలలో ప్రజలు ఒకే రకంగా ప్రవర్తిస్తారు. దీనికి ఉదాహరణగా ఓటింగ్ ప్రవర్తనను తీసుకొనవచ్చును. ఎన్నికలలో వివిధ సందర్భాలలో ఓటర్లు ఒకే వ్యక్తిని గాని, పార్టీకి గాని ఓటు వేస్తారనేది మన అందరికీ తెలిసిన విషయమే. ఈ విధమైన ఓటర్ల ప్రవర్తన వారి సామాజిక, ఆర్థిక, కుల, మత, వృత్తిపరమైన విషయాలతో పరిశీలించినప్పుడు మనం వారి ప్రవర్తనలలో ఏకాకృతి ఉన్నదన్న విషయాన్ని గమనించవచ్చు.

**2.4.1.2. పరిశీలనలు లేక నిరూపణలు (Verifications):**

ప్రవర్తనావాదుల దృష్టిలో విజ్ఞానం పరిపూర్ణంగా ఉండాలంటే అనుభవైకవాదంగా పరీక్షింపబడిన ప్రతిపాదనలు మాత్రమే కలిగి ఉండాలి. దీనికి సంబంధించిన సాక్ష్యం అంతా పరిశీలనాధారంగా ఉండాలి. పరిశీలనలన్నింటిని సక్రమమైనవా? కావా? అని నిగ్గు తేల్చడంలో పరీక్షించడం పునఃపరీక్షించటం జరగాలి.

**2.4.1.3. పద్ధతులు (Techniques):**

విషయాలను సేకరించటంలోను, వివరించటంలోను సరియైన పద్ధతులనవలంభించవలసిన అవసరాన్ని గూర్చి ప్రవర్తనావాదులు నొక్కి చెప్పారు. ఈ ప్రవర్తనావాదులు పరిశోధకున్ని తన పద్ధతులను గూర్చి ఆత్మవిజ్ఞానం కలిగి ఉండేలా చేయాలని భావిస్తారు. ఇందుకు వారు విభిన్న విశ్లేషణ, గణిత శాస్త్ర నమూనాలు లాంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించాలని సూచనలు చేశారు. ఈ పద్ధతులన్నీ పరిశీలన వల్ల లభించే వివరాలు శాస్త్రవేత్తలకు మరింతగా విశ్వసనీయంగాను, ప్రసాద యోగ్యంగానూ ఉండాలంటే ఈ పద్ధతులు నిరంతరం సంస్కరింపబడుతూ, మెరుగుపడుతూ ఉండాలి.

**2.4.1.4. పరిమాణాత్మీకరణము (Quantification):**

ప్రవర్తనావాద శాఖలు రాజకీయ జీవనాన్ని గుణాత్మకమైన నిర్ణయాల ద్వారా కాకుండా పటిష్టమైన విషయ సేకరణ ద్వారా అంచనా వేసినట్లయితే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని భావిస్తారు. సంక్లిష్టమైన రాజకీయ ప్రవర్తనలపై అనిశ్చితమైన,

గుణాత్మక అభిప్రాయాలకు బదులు కఠిన ప్రమాణాలతో కూడిన సమాచార సేకరణను బట్టి వ్యాఖ్యానించాలన్నారు. పరిమాణీత్మికరణము చేయదగు సమాచార వ్యాప్తి (బోగట్టా) ఆధారంగానే యితర సమాజ శాస్త్రముల వలె రాజనీతి శాస్త్రంలో కూడా పరిమాణాత్మకరణ చేయవలెను.

### 2.4.1.5. విలువలు (Values):

ప్రవర్తనావాదుల అభిప్రాయంలో నైతిక విలువలకు, అనుభవవాద వివరణలకు మధ్య బేధం ఉంది. యధార్థాలు, విలువలూ రెండు ప్రత్యేకమైన విషయాలే. విశ్లేషణలో రెండింటిని విడివిడిగా అధ్యయనం చేయవచ్చునే గాని కలిపి అధ్యయనం చేయుటకు వీలులేదు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వాతంత్రం, పరమ పవిత్రమైన విలువలు గల భావాలు. కాని వాటిలోని నిజానిజాలను శాస్త్రీయ పద్ధతిలో తప్పు నిరూపణ చేయలేం. రాజకీయాల శాస్త్రీయ అధ్యయనం చేయబడాల్సిందే కాని అందులో నైతికత ప్రశ్నలు ఉదయించవు. అభివృద్ధికాబడిన పరిశోధనా పద్ధతులద్వారా విలువలకు అతీతంగా పరిశోధనలు నిర్వహించాల్సి ఉంటుంది.

### 2.4.1.6. క్రమబద్ధీకరణము (Systematization):

రాజనీతి శాస్త్రంలో పరిశోధన ఒక క్రమమైన పద్ధతులు సాగాలని ప్రవర్తనావాదులు ఆకాంక్షించారు. పరిశోధనలు సైద్ధాంతిక దృక్పధంతోను, సైద్ధాంతిక మార్గదర్శకత్వంలోను జరగాలంటారు. సిద్ధాంతమూ, పరిశోధనా, పొందిక గానూ, క్రమబద్ధమైన విజ్ఞానంతో సన్నిహిత సంబంధాలు కలిగిన భాగాలుగా ఉండాలని దీని భావం. పరిశోధనా సిద్ధాంతాన్ని విశదపరిచేలాగ ఉండాలి. సిద్ధాంతం విషయాధారంగా ఉండాలి. సిద్ధాంతానికి, ఆచరణకు సన్నిహిత సంబంధం ఉండాలని క్రమబద్ధీకరణ భావన.

### 2.4.1.7. శాస్త్రీయత లేక నిర్దిష్ట శాస్త్రము (Pure Science):

రాజనీతి శాస్త్రం పూర్తిగా విజ్ఞాన శాస్త్రంలా ఉండాలని ప్రవర్తనావాదులు చెప్పారు. ప్రవర్తనా పరమయిన సిద్ధాంత అవగాహన నుండి సంపాదించిన విషయ పరిజ్ఞానము జీవిత సమస్యలను పరిష్కరించడానికి సహాయపడుతుంది. కనుక సిద్ధాంతము కేవలము సిద్ధాంతం కోసమే గాక ప్రయోజనకరముగా వినియోగించుకోవడానికి వీలుగా ఉండాలి.

### 2.4.1.8. ఏకీకరణము (Integration):

ప్రవర్తనావాదులు అంతర్‌వర్గీయ దృక్పధానికి అధిక ప్రాధాన్యమిచ్చి రాజనీతి శాస్త్రాన్ని ప్రత్యేకమైన శాస్త్రంగా అంగీకరించారు. వారి అభిప్రాయంలో రాజనీతి శాస్త్రం సమాజ శాస్త్రాలలో ఒకటి. అందువల్ల రాజనీతి శాస్త్రం ఇతర సమాజ శాస్త్రాలలో ఏకీకరణము చెందాలంటారు. వివిధ సామాజిక శాస్త్రాల మధ్య హద్దులు ఏర్పడి ఉన్నప్పటికి, సంఘజీవియైన మానవుడు రాజకీయ ప్రవర్తనల అవగాహనకు విస్తృత దృక్పధంతో పరిశీలించాల్సి ఉంటుంది. కనుక రాజకీయ ప్రవర్తనను అధ్యయనం చేసేటప్పుడు వీటన్నింటిని సంఘటిత పరచుకుంటే సక్రమమైన ఫలితాలు వచ్చును.

### 2.4.2. రాజనీతి శాస్త్రంపై ప్రవర్తనావాద ప్రభావం (Impact of Behaviouralism on Political Science):

ప్రవర్తనావాదం రాజనీతిశాస్త్రానికి ప్రయోగాత్మక పద్ధతులను, పరికరాలను నిర్వహణా పద్ధతులను అందించి రాజనీతి శాస్త్రం పరిపూర్ణం కావటానికి కారణమైంది. మానవుడి ప్రాథమిక ప్రేరణలు, అవసరాలు, కోరికలను మరింత చక్కగా అవగాహన చేసుకోవడానికి సహాయకారి అయ్యింది. రాజనీతితత్వవేత్తలు యీ ప్రవర్తనావాదం వల్ల స్వతంత్ర అస్థిత్వం కలిగి

రాజకీయపరంగా స్థిరమైన జీవనం గల వ్యవస్థల పట్ల ఆసక్తి పెంపొందించుకున్నారు. రాజనీతి శాస్త్రం భౌతికశాస్త్రంలాగ కాకుండా, భౌతికశాస్త్రం కంటే పురోగమించి మానవాళికి ఉపయోగకరంగా రూపొందించాలని ప్రవర్తనవాదులు కోరుకుంటున్నారు. పురాతన కాలంలోని రాజనీతి తత్వశాస్త్ర రూపం నుండి సమకాలీన రాజనీతి శాస్త్రంగా మారి భవిష్యత్తులో రాజనీతి విజ్ఞానశాస్త్రంగా రూపొందే అవకాశం ఉంది.

## 2.5. ముగింపు:

ప్రవర్తనావాదం అంతాశూన్యం అని మనం నిర్ణయించుకోకూడదు. విభిన్న విద్యా విభాగాల మధ్య సామరస్యం ఉండాలని సూచించడం ద్వారా ప్రవర్తనా వాదం రాజనీతిశాస్త్రానికి నూతన మార్గాన్ని నిర్ధేశించింది. నూతన పద్ధతలు, అనుభవవాద ప్రక్రియల ద్వారా ప్రవర్తనావాదం రాజనీతిశాస్త్రానికి సన్నిహితం చేసింది. ఈవిధంగా ప్రవర్తనావాదం రాజనీతిశాస్త్ర అధ్యయనం పరిధిని విస్తరింపజేసింది.

## 2.6. మాదిరి పరీక్ష ప్రశ్నలు:

### I. వ్యాసరూప ప్రశ్నలు:

1) ప్రవర్తనావాద దృక్పధాన్ని గూర్చి వివరించండి?

2) ప్రవర్తనావాద లక్షణాలను గూర్చి తెలియపర్చండి?

3) ప్రవర్తనావాద - అనుభవైకవాదం గూర్చి ఒక వ్యాసం వ్రాయండి?

### II. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:

1) నూతన దృక్పధాల అభివృద్ధిని గూర్చి క్లుప్తంగా వివరించండి?

2) అనుభవైక దృక్పధం గురించి క్లుప్తంగా వ్రాయండి?

## 2.7. ఆచూకి గ్రంథాలు:


1. David Easton "Introduction: The Current Meaning of Behaviouralism".
2. Robert.A. Dahl. "The Behavioural Approach in Political Science".
3. Heinz Eulau. "Behaviouralism in Political Science-Translation".



రచన:

**డా॥ డి. మనో వికాస్**

M.A., B.Ed., Ph.D.

రీసెర్చ్ స్కాలర్,

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

పాఠం - 3

# సందర్భోచిత భావనాంశాల అధ్యయనం

# THE STUDY OF TEXTS IN CONTEXT

పాఠ్య నిర్మాణ క్రమం:

3.0. లక్ష్యం

3.1. పరిచయం

3.2. వివిధ రాజకీయ భావనల అధ్యయనం

3.2.1. సాంప్రదాయక భావనల అధ్యయనం (Study of Various Traditional Concepts)

3.2.1.1. ఫిలాసఫికల్ విధానము

3.2.1.2. చారిత్రక భావనలు వాటి అధ్యయనం

3.2.1.3. న్యాయశాస్త్ర భావనల అధ్యయనం

3.2.1.4. సంస్థాగత భావనల అధ్యయనం

3.2.2. ఆధునిక రాజనీతి భావనల అధ్యయనం

3.2.2.1. సామాజిక భావనల అధ్యయనం

3.2.2.2. మానసిక విశ్లేషణల అధ్యయనం

3.2.3. ఆర్థిక భావనల అధ్యయనం

3.2.4. ప్రవర్తనావాద భావనల అధ్యయనం

3.2.5. మార్క్సిస్ట్ భావనల అధ్యయనం

3.2.6. నిరంకుశ భావనల అధ్యయనం

3.2.7. స్త్రీవాద భావజాల అధ్యయనం

3.2.8. స్ట్రాస్సియన్ భావజాలం

3.2.9. ఆధునిక అనంతరవాదం

**3.3. ముగింపు**

**3.4. మాదిరి పరీక్ష ప్రశ్నలు**

**3.5. ఆధార గ్రంథాలు**

## 3.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశం అధ్యయనం వలన విద్యార్థులు రాజనీతి శాస్త్రానికి సంబంధించిన వివిధ భావజాలాలను అర్థవంతంగా తెలుసుకొని రాజనీతిశాస్త్రానికి సంబంధించిన విమర్శనాత్మక జ్ఞానాన్ని పొందుతారు.

## 3.1. పరిచయం:

రాజనీతి శాస్త్రాన్ని అధ్యయనం చేసేటటువంటి పరిశోధకులు మరియు విద్యార్థులు శాస్త్రానికి సంబంధించిన అనేక రచనలను పదే పదే చదవడం మరియు చదివిన అంశాలను అర్థం చేసుకుంటూ సామాజిక నిర్మాణంలో ఆ అంశాలు ఎటువంటి పాత్రలను పోషించాయి అని మూల్యాంకనం చేసుకుంటూ ఉండాలి. అదేవిధంగా వివిధ భావాలను, రాజకీయ అంశాలను, సిద్ధాంతాలను అధ్యయనం చేయడం వలన వివిధ కాలాలకు చెందిన తత్వవేత్తల భావాలను అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. రాజనీతి శాస్త్రమును అభ్యసించే విద్యార్థులు రాజనీతి గ్రంథాలను అధ్యయనం చేస్తూ వాటిపై వచ్చే విమర్శలను కూడా పరిశీలిస్తూ అభిప్రాయాలను ఏర్పరచుకోవాలి. వివిధ భాషలను అర్థం చేసుకోవడంలో విభిన్న మార్గాలు ఉన్నాయి. రాజనీతి శాస్త్ర అధ్యయనంలో కేవలం పదాల వివరణ మాత్రమే కాకుండా ప్రాచీన భావాల అర్థం తెలుసుకోవడం కూడా అవసరం. ఎందుచేతనంటే తప్పుడు వివరణల నుండి ఉత్పన్నమయ్యే అపార్థాలను సిద్ధాంత వాఖ్యానాలు, విమర్శలు నిరోధించలేవు. ఏమంటే వివరణ అనేది లేకుండా అవగాహన ఉండదు.

## 3.2. వివిధ రాజకీయ భావనల అధ్యయనం:

రాజకీయ శాస్త్రం, సాంప్రదాయం మరియు శాస్త్రీయ లేదా ఆధునిక విధానాల కలయికగా చెప్పవచ్చును. సాంప్రదాయ విధానాలు అత్యంత ఊహాజనిత మరియు సూత్రప్రాయమైనవి మరియు ఆధునిక విధానాలు మరింత అనుభావిక మరియు శాస్త్రీయ స్వభావం కలిగి ఉంటాయి. కనుక వీటి అధ్యయనం వలన రాజనీత శాస్త్ర పరిశోధకులు, విద్యార్థులు వివిధ కాలాలకు చెందిన భావనలను సిద్ధాంతాలను విమర్శనాత్మకంగా పరిశీలించుటకు అవకాశం దొరుకుతుంది.

### 3.2.1. సాంప్రదాయక భావనల అధ్యయనం (Study of Various Traditional Concepts):

సాంప్రదాయక భావనల అధ్యయనంలో వివిధ ప్రాచీన భావనలను గురించి తెలుసుకుంటూ అవి ఏయే కాలాలలో రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రాధాన్యతలను కలిగి ఉన్నాయో పరిశోధకులు, విద్యార్థులు అవగాహన చేసుకొని అధ్యయనం చేయుటకు ఉపయోగపడతాయి. అవి:

**3.2.1.1. ఫిలాసఫికల్ విధానము:**

రాజనీతి శాస్త్ర అధ్యయనానికి సంబంధించి ఇది పురాతన విధానము. దీనిని ఊహాజనిత, మెటాఫిజికల్ లేదా నైతిక విధానం అని కూడా అంటారు. రాజ్యం, ప్రభుత్వం, మానవుని యొక్క రాజకీయ ప్రవర్తన యొక్క అధ్యయనం నిర్దిష్ట లక్ష్యాలు, నైతికత లేదా సత్యాలను సాధించాలనే తపనతో సంక్లిష్టంగా ముడిపడి ఉంటుంది. ఇక్కడ క్రమశిక్షణ నైతిక ప్రపంచానికి దగ్గరగా ఉంటుంది. ఈ విధానం విలువలకు, నైతికతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన వాస్తవిక ప్రపంచంలో వీరి భావనలు కేవలం ఊహాజనిత మరియు వాస్తవ దూరమైన అంశాలుగా విమర్శలను ఎదుర్కొనడం జరిగినది. ఈ భావనల అధ్యయనం ద్వారా రాజనీతి శాస్త్రం అధ్యయనంలో నైతికత, విలువల యొక్క ప్రాధాన్యతను అర్థం చేసుకోగలము.

**3.2.1.2. చారిత్రక భావనలు వాటి అధ్యయనం:**

ఈ భావనలు గతానికి సంబంధించిన అంశాలను, సిద్ధాంతాలను వెలుగులోనికి తెస్తుంది మరియు రాజకీయ సంస్థల యొక్క మూలాలు మరియ వాటి అభివృద్ధిని గుర్తిస్తుంది. ఇది వ్యక్తుల పాత్ర మరియు వారి ఉద్దేశ్యాలను గతంలో సాధించిన విజయాలు మరియు వైఫల్యాలు, భవిష్యతు కోసం దాని ప్రభావాలను అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తుంది. నేటి రాజకీయ వ్యవస్థలలోని సమస్యలను అర్థం చేసుకోవడంలో చారిత్రక సంఘటనలు మరియు భావనల సహాయం ఎంతో అవసరం. అంతేగాక ఒక నిర్దిష్ట కాలంలో సంభవించిన సంఘటనల పూర్వాపరాల మీద దృష్టిని కేంద్రీకరిస్తుంది. గతంలో సంస్థలు ఏవిధంగా ఉండేవి ప్రస్తుతం ఎలా ఉండాలి. భవిష్యత్తులో ఎలా ఉంటాయన్న అంశాలను వివరించడమే చారిత్రక భావన ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. గతాన్ని వివరించడంతో పాటు భవిష్యత్తును సూచించడంలోనే రాజనీతి శాస్త్రం గొప్పతనం దాగి ఉంది అని సబైన్ పేర్కొన్నాడు. లార్డ్‌బ్రైస్ చారిత్రక దృక్పథం అవాస్తవికమైన పోలికలతో నిండి ఉండటం వలన అనేక సందర్భాలలో వక్రమార్గాన్ని పట్టిస్తాయని విమర్శించారు. బార్కర్ అభిప్రాయంలో ఈ పద్ధతిలో పరిశోధకుడు తన మనోభావాలను మానసిక ద్వేషాలను (Emotions) కూడా ఇందులో జోడించడానికి అవకాశం ఉంటుందని పేర్కొంటాడు. ఏది ఏమైనప్పటికి చారిత్రక భావనల అధ్యయనం ప్రయోజనకరం అనే వాస్తవాన్ని అంగీకరింపతప్పదు.

**3.2.1.3. న్యాయశాస్త్ర భావనల అధ్యయనం:**

రాజనీతి శాస్త్ర అధ్యయనంలో న్యాయ ప్రక్రియ, న్యాయ సంస్థలకు కూడా ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది. న్యాయపరమైన అంశాలు, చట్టాలకు సంబంధించిన విషయాలను న్యాయశాస్త్రానికి సంబంధించిన విషయాలుగానే కాక రాజకీయ పరమైన అంశాలుగా కూడా గుర్తించి, వాటిని అధ్యయనం చేయాలి. దీనిని బలపరచిన రచయితల అభిప్రాయం ప్రకారం సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడం రాజ్యం ప్రధాన కర్తవ్యం. అందుచేత న్యాయానికి సంబంధించిన అంశాలను రాజనీతి శాస్త్రం విడదీయరాని అంతర్భాగంగా పరిగణిస్తూ అధ్యయనం చేయాలి. సిసిరో, డైసీలు రాజ్యానికి న్యాయశాస్త్ర మూర్తిమత్వం ఉందని, అందుచేత రాజనీతి శాస్త్రాన్ని న్యాయ ప్రమాణాల శాస్త్రంగా పరిగణించాలని వాదించారు. కాబట్టి రాజనీతి శాస్త్రం చట్ట ప్రక్రియకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేయడం తప్పదని భావించారు. ప్రజల రాజకీయ ప్రవర్తనను ఊహించేందుకు వారి న్యాయశాస్త్ర పరిజ్ఞానం, చట్టాల పట్ల వారి విధేయతలు ప్రాతిపదికలుగా ఉపయోగపడతాయని ఈ రచయితలు పేర్కొన్నారు. జెల్లిఎక్ (Jellinek) అనే రచయిత ప్రకారం "వ్యవస్థీకరణ సమాజం కేవలం, సామాజిక రాజకీయ దృగ్గోచరం మాత్రమే కాదు. అది ప్రభుత్వ చట్టాలు శాసనాలు, హక్కులు, బాధ్యతల సమ్మేళనం కనుక రాజ్య అవతరణ, అభివృద్ధి అవగాహనకు, చట్టాలకు సంబంధించిన అంశాల అవగాహన అవసరము.

### 3.2.1.4. సంస్థాగత భావనల అధ్యయనం:

సంస్థాగత భావనలు రాజనీతి శాస్త్రం ప్రభుత్వం, శాసనసభ, కార్యనిర్వాహక వర్గం, న్యాయశాఖ, రాజకీయ పార్టీలు, ప్రయోజన గణాలు మొదలైన రాజకీయ నిర్మాణాల అధ్యయనంపై ప్రాధాన్యత కనపరచాలని వాదిస్తుంది. వీటిని పురాతన తత్వవేత్తలైన బ్రైస్, ఫైనర్‌ల రచనల్లో గుర్తించవచ్చును. ఆధునిక రచయితలైన ట్రూమన్ రాజనీతి శాస్త్రం, అధ్యయనం చేయవలసిన నిర్మాణాలలో ఒత్తిడి సముదాయాలు, ఉద్యోగి బృందం, ప్రచార సాధనాలు మొదలైన వాటిని చేర్చాడు. ఈవిధంగా నిర్మాణాలు అధ్యయనానికి రాజనీతి శాస్త్రంలో ప్రాధాన్యతను కల్పించారు. కానీ సంస్థాగత భావనలు సంకుచితమైనవిగా విమర్శించబడ్డాయి. నేటి కాలంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న అంతర్జాతీయ రాజకీయ సంస్థల గురించి ఈ భావాలలో ఎలాంటి ప్రస్తావన గోచరించదు.

### 3.2.2. ఆధునిక రాజనీతి భావనల అధ్యయనం:

సాంప్రదాయ రాజకీయ విశ్లేషణలోని లోపాల కారణంగా శాస్త్రీయంగా రాజకీయ విశ్లేషణ చేయవలసిన అవసరం ఏర్పడింది. ఆధునిక రాజకీయ భావనలు నూతన శాస్త్రీయ సిద్ధాంతాలను, అనుకరణ పద్ధతులను, గణిత శాస్త్ర దృక్పధాలు, ప్రసార సిద్ధాంతాలు లాంటి ఎన్నో ప్రయోగాత్మక శాస్త్రీయ పద్ధతుల వినియోగాన్ని కలిగి ఉంది" కాబట్టి ఆధునిక రాజకీయ బావనల అధ్యయనం ఆవశ్యకతను కలిగి ఉంది. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

### 3.2.2.1. సామాజిక భావనల అధ్యయనం:

ఈ భావాలు సంఘంలోని సభ్యుల రాజకీయ ప్రవర్తనలను వివరించడానికి సామాజిక సందర్భం యొక్క అవగాహనను నొక్కి చెబుతుంది. రాజ్యంలో నివసించే మానవుని సంఘజీవిగా పరిగణిస్తారు మరియు రాజకీయాలు సామాజిక అంశాల ద్వారా అర్థం చేసుకొనబడతాయి. కానీ విమర్శకుల అభిప్రాయం ప్రకారం సామాజిక సందర్భంపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం క్రమశిక్షణ యొక్క స్వయం ప్రతిపత్తిని ప్రభావితం చేస్తుంది.

### 3.2.2.2. మానసిక విశ్లేషణల అధ్యయనం:

ఈ విధానం మానసిక విశ్లేషణకు సంబంధించినది దీనిని సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రాచుర్యంలోనికి తీసుకునివచ్చారు. ఇతను ఒక వ్యక్తి యొక్క చర్యలు, కోరికలు అనేవి వ్యక్తికే తెలియని భయాల ద్వారా నడుపబడుతున్నాయని వాదించాడు. ఈ విధానం మానసిక చట్టాల ద్వారా రాజకీయ మరియు సామాజిక సంస్థలను అధ్యయనం చేస్తుంది మరియు వివరిస్తుంది. రాజకీయ నాయకుల మానసిక విశ్లేషణ రాజకీయాల గురించి ముఖ్యమైన జ్ఞానాన్ని వెల్లడిస్తుంది. అయితే, ఈ విధానం రాజకీయాల అధ్యయనంలో సామాజిక, చట్టపరమైన మరియు ఆర్థిక అంశాలను విస్మరిస్తుంది.

### 3.2.3. ఆర్థిక భావనల అధ్యయనం:

వస్తువుల ఉత్పత్తి మరియు పంపిణీకి సంబంధించిన విషయాలు రాజ్యంచే నియంత్రించబడుతున్నందున, ఆర్థిక విషయాలు కూడా రాజకీయ సిద్ధాంతకర్తలకు ఆందోళన కలిగిస్తాయి. ఈ విధానం ఆర్థిక విషయాలను నియంత్రించడంలో రాజ్యం యొక్క పాత్రను నొక్కి చెబుతుంది మరియు ఆర్థిక వ్యవహారాలు రాష్ట్ర రాజకీయ ప్రక్రియలో సన్నిహితంగా ముడిపడి ఉన్నాయని వాదించింది. అదేవిధంగా వ్యక్తుల రాజకీయ మరియు ఆర్థిక జీవితాన్ని అనుసంధానం చేయడం

మరియు అర్థం చేసుకోవడం వైపు మొగ్గుచూపుతుంది. అయితే, ఈ విధానం ఆర్థిక అంశాలను మాత్రమే పరిగణలోనికి తీసుకుంటుంది మరియు సామాజిక, మానసిక కారకాలు వంటి ఇతర అంశాలను విస్మరిస్తుంది.

**3.2.4. ప్రవర్తనావాద భావనల అధ్యయనం:**

ఈ వాదం రాజకీయ ప్రవర్తనపై దృష్టిపెడుతుంది మరియు రాజకీయ కార్యకలాపాలలో మానవుల వైఖరులు మరియు ప్రాధాన్యతలను అధ్యయనం చేస్తుంది. అందువలన, రాజకీయాల అధ్యయనం దాని దృష్టిని ఫార్మలిజం మరియు నార్మేటివిజం నుండి రాజకీయ ప్రవర్తన అధ్యయనానికి మార్చింది. అయినప్పటికీ, ఈ విధానం శాస్త్రీయ పద్ధతుల యొక్క తప్పుడు భావనపై ఆధారపడి ఉందని విమర్శకులు వాదించారు.

**3.2.5. మార్క్సిస్ట్ భావనల అధ్యయనం:**

మార్క్సిస్ట్ భావాలు ఇతర ఆధునిక భావాల నుండి ప్రాథమికంగా భిన్నంగా ఉంటుంది. ఇది రాజ్యాన్ని (రాష్ట్రాన్ని) వర్గవైరుధ్యాల యొక్క అనివార్య పరిణామంగా గ్రహిస్తుంది. రాజకీయ మరియు ఆర్థిక శక్తుల మధ్య నిరంతర పరస్పర చర్య ఉందని మరియు ఒకదాని నుండి మరొకటి వేరుచేయడం సాధ్యం కాదని ఇది ఊహిస్తుంది. అయితే ఈ విధానం ఆర్థిక అంశాలకు అవసరమైన ప్రాముఖ్యతనిస్తుంది మరియు ఇతర ముఖ్యమైన అంశాలను విస్మరిస్తుంది. మార్క్సిస్ట్‌లు అన్ని సిద్ధాంతాలను సైద్ధాంతిక ముసుగులుగా చూస్తారు. కానీ వారి సిద్ధాంతాన్ని ఎందుకు మినహాయించాలి అనేది వివరించలేదు. మార్క్సియన్ వివరణలు కూడా సూత్రపాయంగా మరియు నిర్ణయాత్మకంగా ఉంటాయి. ప్రతిచోట సైద్ధాంతిక మోసాలను చూస్తాయి.

**3.2.6. నిరంకుశ భావనల అధ్యయనం:**

ఫాసిజం మరియు కమ్యూనిజం యొక్క పెరుగుదల ఆధునిక నిరంకుశవాదం యొక్క తాత్విక మూలాలపై పరిశోధనను ప్రేరేపించింది. మూలాలు ఒకసారి చూడటం ప్రారంభించిన తర్వాత, ప్రతిచోటా కనిపిస్తాయి. ఉదాహరణకు, ప్లేటో యొక్క తాత్విక రాజు, మాకియావెల్లి యొక్క క్రూరమైన యువరాజు, హాబ్స్ యొక్క సర్వశక్తిమంతుడైన సార్వభౌమాదికారి మరియు రూసో యొక్క అన్ని విజ్ఞతలు గల శాసనకర్త ఇలాగ అందరూ 20వ శతాబ్దపు నిరంకుశ పాలకులకు పూర్వకులుగా కనిపిస్తున్నారు.

**3.2.7. స్త్రీవాద భావజాల అధ్యయనం:**

ఈ స్త్రీ వాద భావజాలం 1960వ దశకంలో మహిళలకు సమానత్వం కల్పించాలని బలంగా చెప్పినటువంటి స్త్రీ వాదులు మేరీ ఊల్‌స్టన్‌క్రాఫ్ట్, ఎమా గోల్డ్‌మెన్, బెంథమ్, మిల్ మరియు ఏంగెల్స్ వంటి వ్యక్తులు కృషి చేయడం ద్వారా పొందింది.

**3.2.8. స్ట్రాస్సియన్ భావజాలం:**

ఈ భావజాలం ప్లేటో మరియు ఇతర ప్రాచీన మరియు పూర్వయుగ ఆలోచనపరుల రచనలలో రాజకీయాల యొక్క శాశ్వతమైన సత్యాన్ని గుర్తించడానికి ప్రయత్నించిన లియోస్ట్రాస్ యొక్క పరిశోధనల నుండి ఉద్భవించినది. ఈ శక్తివంతమైన రచనలు ఆధునిక ఉదారవాద ఆలోచనాపరుల జాబితాలో లేని పుకార్లలో విభేదించబడ్డాయి. మతోన్మాదం

యొక్క హింసాత్మక గాలుల నేపథ్యంలో క్రమబద్ధమైన పునాదులు బలహీనపడుతున్నాయని స్ట్రాస్ విచారం వ్యక్తం చేశాడు. నాజీ జర్మనీ నుండి వచ్చిన యూదు శరణార్థిగా అతని అనుభవాలు అతని ఆలోచనలు అతనిని సందర్భోచితంగా ఉంచాయి.

సంక్షోభాన్ని ఎత్తి చూపిన తరువాత, స్ట్రాస్ మరియు అతని అనుచరులు ఉదారవాదం, సాపేక్షవాదం, చారిత్రాత్మక మరియు శాస్త్రీయత యొక్క మూలాలను గుర్తించడానికి మరియు లోపాలను నిర్ధారించడానికి ప్రయత్నించాడు. పూర్వపు యుగంలోని గ్రంధాలలోని నిజమైన అర్థాన్ని జాగ్రత్తగా తిరిగి చదవడం మరియు అర్థం చేసుకోవడం ద్వారా పరిష్కారాలను కనుగొనవలసి ఉంటుంది.

### 3.2.9. ఆధునిక అనంతరవాదం:

ఆధునిక అనంతరవాదం గొప్ప కధనాల వైఫల్యాల నుండి ఉద్భవించింది. ఇది చాలా భిన్నమైనది. భిన్నమైన ఆలోచనాపరులచే పంచుకున్న విస్తృత దృక్పధం. పోస్ట్ మోడర్నిజం ప్రపంచం యొక్క అసంబద్ధమైన మరియు అపారమయిన స్వభావాన్ని నొక్కి చెబుతుంది మరియు ఐక్యతను కనుగొని ప్రతి ప్రయత్నాన్ని నిరోధిస్తుంది. ఇది పురోగతి యొక్క ఆలోచనను ఇతరులపై ఆధిపత్యం చెలాయించే ఒక సమూహం యొక్క శక్తిలో కేవలం పరోగతి అని కొట్టి పారేసింది.

ఫూకాల్ట్ నుండి ఉద్భవించిన ఈ విధానం యొక్క ఒక సంస్కరణ మానవులను సాధారణీకరించే మార్గాలను పరిశీలిస్తుంది. అంటే వారి స్వంత ఆధీనంలో ఇష్టపూర్వకంగా పాల్గొనేలా చేసింది. ఇది వర్తమాన దృక్కోణం నుండి పాఠాలను తిరిగి చదవడం మరియు కొత్త విశ్లేషణల ప్రకారం వాటిని తిరిగి అమర్చడం మరియు మార్చడం వంటివి కలిగి ఉంటుంది. వివరణల యొక్క అనిశ్చితిపై పట్టుదల అనేది మన జ్ఞానాన్ని అభివృద్ధి చేయని అత్యంత నిరాశావాద వైఖరి. కానీ మరింత ప్రమాదకరమైనది. ఇది చట్ట బద్ధం చేస్తుంది కానీ కనీసం ప్రచారాన్ని మరియు అసత్యాన్ని గుర్తించలేకపోతుంది.

## 3.3. ముగింపు:

మనం కోరుకునే సమాధానాలను పొందడానికి ఏ ఒక్క పద్ధతి సరిపోదు. మనం అడిగే ప్రశ్నల శ్రేణిలో మనల్ని ఇబ్బంది పెట్టని అనేక విధానాలు ఉత్తమం. ఈ బహువచన విధానాన్ని అవలంబించడంలో, మేధో, రాజకీయ మరియు భాషా సందర్భాలను దృష్టిలోఉంచుకోవాలి. గ్రంధాలు ప్రచురించబడిన తరువాత వాటి స్వంత జీవితాన్ని తీసుకుంటాయనే వాస్తవాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఒక నిర్దిష్ట వచనంలో రచయిత ఉద్దేశించిన దానిపై మాత్రమే దృష్టి కేంద్రీకరించడం, ఇతర ఆలోచనాపరులు చెప్పిన భావనల గురించి ఏమి చెప్పాలనే విషయాన్ని నిర్లక్ష్యం చేయడం ఎల్లప్పుడూ ఉపయోగకరంగా ఉండదు.

వివరణాత్మక ప్రశ్నలు సమస్య ఆధారితమైనది. తరచుగా సందేహాలను నివృత్తి చేయడానికి పాఠ్యాంశాలను ఆశ్రయిస్తాము. ఈ సందేహాలు ఎక్కడినుండైనా తలెత్తవచ్చును. కానీ వాటి వివరణాత్మక పరిష్కారాలు కఠినమైన పండితుల ప్రమాణాల ద్వారా సమర్ధించబడాలి. భావాలు మరియు దాని యొక్క రెండు లేదా అంతకంటే ఎక్కువ వివరణల మధ్య వివరణ త్రిభుజాకారంలో ఉంటుంది. విమర్శలు మరియు పునర్విమర్శలు ద్వారా చారిత్రక రచనలను సజీవంగా ఉంచవచ్చు.

## 3.4. మాదిరి పరీక్ష ప్రశ్నలు:

**I. వ్యాసరూప ప్రశ్నలు:**

1) వివిధ రాజకీయ భావనలను గూర్చి వ్యాసం వ్రాయండి?

2) ఆధునిక రాజనీతి అధ్యయనాల ప్రాధాన్యతను వివరించండి?

**II. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:**

1) సాంప్రదాయ భావనలను గూర్చి క్లుప్తంగా వ్రాయండి?

2) చారిత్రక భావనల గూర్చి వివరించండి?

## 3.5. ఆచూకి గ్రంథాలు:


1. Terence Ball: "Reappraising Political Theory".

2. Tony Burns "Interpreting and appropriating texts in the history of political thought.

3. Suinner, Quention - "Meaning and Understanding in the History of Ideas".



రచన:

**డా॥ డి. మనో వికాస్**

M.A., B.Ed., Ph.D.

రీసెర్చ్ స్కాలర్,

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

పాఠం - 4

# జాన్ రాల్స్ [John Rawls 1921 - 2003)

**విషయసూచిక**


4.0. లక్ష్యం

4.1. పరిచయం

4.2. న్యాయ ుసిద్ధాంత ఆవశ్యకత

4.3. రాల్స్ న్యాయ సూత్రాలు

4.4. రాజకీయ వ్యవస్థ - స్వభావం - విధులు

4.5. పౌర విధులు - బాధ్యతలు

4.6. సారాంశము

4.7 మాదిరి ప్రశ్నలు

4.7. చదువదగిన గ్రంథాలు


## 4.0 లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

ఎ) ఉదారవాద ఉపయోగితావాద సిద్ధాంత పరిమితులు

బి) న్యాయసిద్ధాంతం, సామాజిక సహజీవనానికి ఎందుకు అవసరమో

సి) రాల్స్ న్యాయసిద్ధాంతం

డి) రాజ్య వ్యవస్థ యొక్క విధులు, బాధ్యతలపై రాల్స్ అభిప్రాయాలు.

## 4.1 పరిచయం :

గత అర్ధశతాబ్ద కాలంగా ఆంగ్లో - అమెరికన్ రాజనీతి తత్వవిచారంపై అత్యంత ప్రభావాన్ని చూపిన తత్వవేత్త జాన్‌రాల్స్, 1971 వ సంవత్సరంలో ప్రచురించబడిన, "A theory of Justice" అనే గ్రంథ రచయిత అయిన జాన్‌రాల్స్, గత 50 సంవత్సరములుగా తాను ప్రతిపాదించిన న్యాయసిద్ధాంతం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా మేధావుల ప్రశంసలను అందుకున్న మహనీయుడు. "A Theory of Justice" అనే గ్రంథం వ్యక్తీకరించిన భావాలపై ఒక సుదీర్ఘమైన చర్చ గత అర్ధశతాబ్ద కాలం నుండి తత్వవేత్తలు మరియు ఇతర సామాజిక శాస్త్ర వేత్తల మధ్య కొనసాగించడం, ఆ గ్రంథ విశిష్టతను తెలియచేస్తుంది. రాజీనీతి తత్వశాస్త్రంలో ప్రాబల్యం వహిస్తున్న ఉపయోగితావాదానికి భిన్నంగా ఒక ప్రత్యామ్నాయ నీతిసిద్ధాంతాన్ని ప్రతిపాదించడమే రాల్స్ చేసిన ప్రధాన కృషి మరియు సేవ (Contribution). రాజనీతిపరంగా చూసినట్లయితే ఆయన ప్రతిపాదించిన న్యాయసిద్ధాంతం ఆధునిక కాలంలో ఉదారవాదానికి, ప్రజాస్వామ్యానికి ఒక సమర్ధనీయ భూమికను ఏర్పరిచిందని విశ్లేషకుల అభిప్రాయం.

రాజనీతి తత్వమౌలిక భావనలలో న్యాయం అత్యంత ముఖ్యమైనది. ప్లేటో (Plato) నుండి సిడ్‌విక్ వరకు (Sidgwick, 19th Century Cambridge University కి చెందిన Moral Philosopher) న్యాయంను గూర్చి విభిన్న రకాలుగా వ్యాఖ్యానించడం జరిగింది. ఒక సమాజ నిర్మాణం ఏ న్యాయసూత్రాల ఆధారంగా జరిగిందన్న దాన్నిబట్టి, ఆ సమాజం సమంజసమైనదా, కాదా అనే చర్చకు మూలం న్యాయభావనే. అయితే 20వ శతాబ్దం మొదటి దశాబ్దంలో తత్వశాస్త్రం తన పరిధిని కేవలం భావనలను (Concepts) స్పష్టపరచడమే తన శాస్త్రలక్ష్యంగా ప్రకటించుకొన్న తరువాత, అప్పటివరకు తత్వశాస్త్రం మానవ జీవనానికి సంబంధించి మౌలిక ప్రశ్నలను వేయడం దానికి వివిధ సమాధానాలను ఇచ్చే సాంప్రదాయాన్ని కోల్పోవడం వలన, తత్వశాస్త్రానికి అత్యంత సన్నిహితంగా ఉండే రాజనీతి శాస్త్రం తన గమ్యాన్ని మరియు ఆ క్రమంలో తన అస్థిత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జాన్‌రాల్స్ వ్రాసిన వ్యాసాలు, ఆ తరువాత వాటికి కొనసాగింపుగా 1971లో రచించిన 'A Theory of Justice' అనే గ్రంథం చూపిన ప్రభావ ఫలితంగా, తత్వశాస్త్రం తన అధ్యయన అంశాలను పునర్ నిర్వచించుకోవడానికి తద్వారా, తిరిగి రాజనీతి మౌలిక భావనలపై చర్చ కొనసాగడానికి కారణం అయ్యాయి. పాశ్చాత్య సమాజాల మౌలిక నిర్మాణ సూత్రాల సమంజసత్వాన్ని విశ్లేషించడానికి రాల్స్ న్యాయ సిద్ధాంతం తోడ్పడింది.

## 4.2. న్యాయ సిద్ధాంత ఆవశ్యకత :

మనుషులు నైతికజీవులుగా తమ జీవిత కార్యాచరణను, సామాజిక సంప్రదాయాలను, సంస్థలను గూర్చి తరచుగా న్యాయనిర్ణయాలు చేస్తూ ఉంటారు. రాల్స్ దృష్టిలో మనుషుల ఈ న్యాయనిర్ణయాలే తత్వశాస్త్రజ్ఞునికి అధ్యయన అంశం. మనుషుల ఈ న్యాయనిర్ణయాలను తత్వశాస్త్రజ్ఞుడు విశ్లేషించడం, తద్వారా మానవ సామర్థ్యాన్ని పరిశీలించడం ద్వారా మానవులు ఏ నిర్దేశిక న్యాయప్రమాణాలను పాటిస్తున్నారో అంచనా వేయడానికి వీలవుతుంది. తొందరపాటుతోనో, భయాందోళనలతోనో, ఆత్మవిశ్వాసం లేని సందర్భాలలో మనుషులు చేసే నిర్ణయాలుకాక, సామర్థ్యం, అవకాశం, సరైన నిర్ణయాలు చేయాలనే కోర్కె ఉన్న సందర్భాలలో వివేచనతోచేసే నిర్ణయాలను, ఆ నిర్ణయాలను నిర్దేశించే న్యాయప్రమాణాలను విశ్లేషించి తద్వారా ఒక న్యాయసిద్ధాంతాన్ని ఆవిష్కరించడమే తత్వవేత్త యొక్క కర్తవ్యం. అయితే మనుషులు ఆలోచించి తీసుకునే నిర్ణయాలు అనేక సందర్భాలలో వాళ్ళు చేసే ఇతర నిర్ణయాలకు విరుద్ధంగానో, లేక వాళ్ళు పాటించాలనుకొనే న్యాయ ప్రమాణాలకు భిన్నంగానో ఉండే అవకాశం ఉంది. కావున ఒక స్పష్టమైన న్యాయ సిద్ధాంతాన్ని తత్వవేత్త రూపొందించడం ద్వారా వాళ్ళ నిర్ణయాలకు ప్రాతిపదికగా కొన్ని సార్వజనీన ప్రమాణాలను ఏర్పరచడం ద్వారా వాళ్ళ ఆచరణకు, ఆలోచనకు మధ్య అంతరాన్ని ఈ న్యాయసిద్ధాంతం తగ్గిస్తుందని రాల్స్ ఉద్దేశ్యం. కాబట్టి మనుషులు న్యాయం, అన్యాయాలపై చేసే నిర్ణయాలను (Judgements) తాత్విక స్థాయిలోనే వివరించడం మరియు విశ్లేషించడమే రాల్స్ దృష్టిలో న్యాయసిద్ధాంతం యొక్క కర్తవ్యం.

రాల్స్ న్యాయసిద్ధాంతం వివిధ భావనలను విశ్లేషించడమేకాక మానవ స్వభావాన్ని మరియు సమాజాన్ని గూర్చి అనుభవవాద స్థాయిలో అనేక సూత్రీకరణలను చేస్తుంది. న్యాయబద్ధంగా వ్యవహరించడానికి గల మానవ సామర్థ్యాన్ని పరిశీలించి, అలాగే అతని యొక్క ఇతర సామర్థ్యాలను కూడ దృష్టిలో ఉంచుకొని, మనిషి యొక్క నైతిక స్వభావాన్నే రాల్స్ వివరిస్తాడు. రాల్స్ ఇతర న్యాయసిద్ధాంతాలను వివరించడమేకాక, తన న్యాయసిద్ధాంతం ఏ విధంగా మనుషులు పర్యాలోచన సమతౌల్యస్థితి (Reflective Equilibrium) లో చేసే నిర్ణయాలకు అనుగుణంగా ఉంటుందో వివరిస్తాడు. రాల్స్ రచనా పద్ధతి. సోక్రటీస్ సంవాద పద్ధతిని పోలి ఉంటుంది. అంటే తన అభిప్రాయాలకు, తన పుస్తక పాఠకుల అభిప్రాయాలకు మధ్య సంవాదంగా ఉంటూ, వాళ్ళ న్యాయనిర్ణయాలు తన న్యాయసూత్రాలతో సరితూగుతాయో, లేదో పరీక్షించుకోమని చెప్తూ, చివరగా వాళ్ళ న్యాయనిర్ణయాలు, తన న్యాయసూత్రాల మధ్య అంగీకారం ఎలా సాధ్యమో వివరిస్తాడు.

ఏ సమాజంలోనైనా మనుషుల మధ్య సామరస్యత మరియు సంఘర్షణ రెండూ కలిసి ఉంటాయి. ఒంటరి జీవితం కంటే సామరస్యత, సహకారం ద్వారానే మంచి జీవితాన్ని పొందగలనని ఏ వ్యక్తైనా భావిస్తాడు. అలాగే ఆ సహకార ఫలితాల్లో ప్రతివ్యక్తి ఇతర వ్యక్తుల కంటే ఎక్కువ వాటాను పొందేందుకు ప్రయత్నిస్తాడు కాబట్టి మనుష్యుల మధ్య సంఘర్షణ కూడా ఉంటుంది. కావున ప్రతి సమాజం కొన్ని సార్వత్రిక పంపిణీ నియమాలను ఏర్పరచుకోవడం అవసరం. ఈ పంపిణీ నియమాలు సామాజిక న్యాయనియమాలు. ఆయా సమాజాలలోని పౌరులు ఆయా సమాజాలలో వ్యవస్థీకృతమైన సామాజిక సంస్థల మరియు సాంప్రదాయాల మంచి చెడులను ఈ సామాజిక న్యాయసూత్రాల వెలుగులో చర్చించేందుకు వీలు కలుగుతుంది. సామాజిక సహజీవన ఫలితాలైన చట్టబద్ధహక్కులు, విధులు, సామాజిక, ఆర్థిక అవకాశాలు, ఆస్థి, సామర్థ్యం మొదలగునవన్నీ కాబట్టి సామాజిక న్యాయసూత్రాలకనుగుణంగా పౌరుల మధ్య పంపిణీ చేయవలసి ఉంటుంది. ఏ సమాజంలోనైనా, ఏదైతే ప్రయోజనకరమైనదని ఆ సమాజ సభ్యులు భావిస్తారో దానిని వాళ్ళమధ్య పంపిణీ చేయవలసిరావడం, దానికి అనుగుణ్యమైన న్యాయసూత్రాలను రూపొందించవలసిన అవసరం ఏర్పడుతుంది. కాబట్టి సామాజిక సహజీవనంలో పంపిణీకి సంబంధించిన న్యాయసూత్రాలను ఆ సామాజిక వ్యవస్థ నిర్మాణానికి సంబంధించిన మౌలిక నియమాలుగా భావించవలసి ఉంటుంది. ఒక సమాజం ఏవిధంగా వ్యవస్థీకృతం అయిందో దానినిబట్టి ఆ సమాజంలోని వివిధ వ్యక్తుల సామాజిక స్థానాలు, వాళ్ళజీవన అవకాశాలను నిర్దేశించడం జరుగుతుంది. అంతేకాక వాళ్ళ జీవన ప్రారంభ అవకాశాలు, వాళ్ళ జీవిత లక్ష్యాలు, కోర్కెలు, స్వీయభావనలు అన్నీ కూడ వాళ్ళ సామాజిక స్థానాలపై ఆధారపడి నిర్ణయించబడతాయి. కావున ఏ సమాజంలో అసమానతలు వ్యవస్థీకృతం కాబడతాయో, ఆ అసమానతలు ఏ విధంగా సమర్థనీయమో వివరించేందుకే వివిధ న్యాయసిద్ధాంతాలు రూపొందించబడతాయి. అయితే రాల్స్ దృష్టిలో వ్యక్తులు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఏర్పరచుకొనే ఒప్పందాలనే న్యాయానికి ప్రాతిపదికగా భావిస్తాడు. మార్కెట్‌లో వ్యక్తులు ఏర్పరచుకొన్న ఒప్పందాలు స్వేచ్ఛగా ఏర్పరచుకొన్నవికావని, ఎందువలనంటే మార్కెట్ వ్యవస్థను నిర్దేశించే సామాజిక, ఆర్థిక నేపధ్య పరిస్థితులు, ఆ నిర్ణయాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి కావున, ఆ నేపధ్య పరిస్థితులు (Background Conditions) న్యాయబద్ధమైనవి అని భావించినప్పుడు మాత్రమే, మార్కెట్‌లోని వ్యక్తుల మధ్య జరిగే ఆదాయ, ఆస్థి పంపిణీలు, న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించబడుతుంది. అయితే ఈ న్యాయసూత్రాలు ఏ ప్రాతిపదికపై రూపొందించబడాలన్నప్పుడు, రాల్స్ మూడు పరిమితులకు లోబడాలని ప్రతిపాదిస్తాడు. మొదటిగా ఈ న్యాయసూత్రాలు అందరికీ వర్తించబడేటట్లు ఉండాలి. అంతేకాక పరస్పర విరుద్ధమైన అభ్యర్థనలను (Claims) పరిష్కరించే లక్షణాలన్నీ ఈ న్యాయసూత్రాలు కలిగి ఉండటమేకాక ఆచరణ సాధ్యమైన అంతిమ సూత్రాలుగా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి. రెండవ లక్షణం ఏమంటే, ఈ న్యాయసూత్రాలు నైతిక సూత్రాలుగానేకాక, వాటి ఎంపికను స్వార్థరహితంగా చేయగలగాలి. రాల్స్ దృష్టిలో నైతికంగా ఆలోచించడమంటే, తన వ్యక్తిగత రాగద్వేషాలను అధిగమించి, నిష్పక్షపాతంగా ఆలోచించగలగటం. అంటే ఆ వ్యక్తి తన సామాజిక స్థానాన్నిబట్టి అభిప్రాయాలకు, నిర్ణయాలకు రాకుండా వాటిని అధిగమించి నిష్పక్షపాతంగా నిర్ణయాలకు రాగలగటం.

మూడవ లక్షణమేమంటే, ఈ న్యాయసూత్రాలు మానవ సంబంధాలను నిర్దేశించేవి కనుక, మానవ స్వభావానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక వాస్తవాలు అందరికి తెలిసి ఉండాలి. అవి ఏమంటే ప్రతి మనిషి తన ప్రయోజనాలను హేతుబద్ధంగా సాధించేందుకు ప్రయత్నిస్తాడని, తను వాంఛించేవి పరిమితంగానే లభ్యమవుతాయని, ఏది మంచి జీవితం అన్న అంశంపై వివిధ దృక్పధాలను కలిగి ఉంటాడని రాల్స్ ప్రతిపాదిస్తాడు. అయితే అందరూ కొన్ని ప్రాథమిక అంశాలైన హక్కులు, స్వేచ్ఛలు, అవకాశాలు, అధికారము, ఆదాయం, ఆస్థి, ఆత్మ గౌరవం మొదలైన వాటిని కావాలని అంగీకరిస్తారని రాల్స్ ప్రకటిస్తాడు.

## 4.3 రాల్స్ న్యాయసూత్రాలు :

పైన పేర్కొన్న మూడు పరిమితులకు లోబడి, రాల్స్ తన న్యాయసూత్రాలను వివరిస్తాడు. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలను ప్రతిపాదించిన హాబ్స్, లాక్, రూసోల మాదిరిగానే, రాల్స్ కూడ ఊహాజనిత ప్రాకృతిక మానవ సముదాయం అనే భావనను ప్రతిపాదిస్తాడు. ఈ ప్రాకృతిక వ్యవస్థ నుండి వ్యక్తులు పరస్పర ఒప్పందం ద్వారా సమాజంగా ఏర్పడతారు. ఇలా సహజంగా ఏర్పడటానికి ముందు ఉండే సర్వసమానదశలో ఒడంబడికకు మౌలిక షరతులుగా ఈ న్యాయసూత్రాలను వ్యక్తులు అంగీకరిస్తారని రాల్స్ చెప్తాడు. ఈ సర్వసమాన తొలిదశను రాల్స్ అసలు స్థితి (Original Condition) అని పేర్కొంటాడు. ఈ అసలు స్థితిలో ఏ వ్యక్తికి సమాజంలో తన స్థానం ఏమిటో తెలియదు. తనశక్తి సామర్థ్యాల గురించిగాని, సహజ సంపదల పంపిణీలో తన అదృష్టం గురించి కాని స్పృహ ఉండదు. ఇలాంటి అజ్ఞాన పూరిత స్థితిలో న్యాయసూత్రాల ఎంపికను తొలిదశలో పరస్పర ఒడంబడిక ద్వారా సమాజంగా ఏర్పడే వ్యక్తులు చేస్తారు. ఈ 'అసలు స్థితి'లో వున్న వ్యక్తులు ఈ క్రింది విధంగా పేర్కొన్న న్యాయసూత్రాన్ని అనుసరిస్తారని రాల్స్ చెప్తాడు. ఆ న్యాయసూత్రం ఏమంటే, "సమాజానికి అవసరమైన ప్రాథమిక వస్తువులైన స్వేచ్ఛ మరియు అవకాశం, ఆదాయం మరియు సంపద, అలాగే ఆత్మాభిమాన మూలాలు అసమానంగా పంపిణీ చేసినట్లయితే తద్వారా ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రయోజకంగా ఉండేటట్లయితే అలా చేయడం సమంజసమని, లేనట్లయితే వాటిని సమాజ సభ్యులందరికి సమానంగా పంపిణీ చేయడమే సమంజసమని" ప్రతిపాదిస్తుంది. ఈ న్యాయసూత్రాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది స్వేచ్ఛకు సంబంధించినది కాగా, రెండవది ప్రాథమిక వస్తువుల పంపిణీకి సంబంధించినది. తన న్యాయ సూత్రాలలో మొదటి దానిని రాల్స్ ఇలా నిర్వచిస్తాడు.

"ప్రతివ్యక్తికి ఎంత విస్తృతమైన స్వేచ్ఛలు సమాన హక్కుగా కలిగి ఉండవచ్చునంటే, అంతే విధమయిన స్వేచ్ఛలు అందరికీ అందుబాటులో ఉండేంతవరకు".

రెండవ సూత్ర నిర్వచనం - సామాజిక, ఆర్థిక అసమానతలు రెండూ ఎలా వ్యవస్థీకృతం కావాలంటే :

ఎ) పొదుపు సూత్రానికి భంగం కలిగించనిమేరకు, ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉండేరీతిలో చేయవచ్చును.

బి) అందరికి సరైన సమాన అవకాశాలను కల్పించడం ద్వారా ఆయా ఉద్యోగాలలో మరియు పదవులలో అందరికీ ప్రవేశించేందుకు వీలుగా పంపిణీ చేయవచ్చును.

అయితే ఈ రెండు న్యాయసూత్రాలను ప్రమాణంగా తీసుకొన్నప్పుడు కొన్ని సందర్భాలలో ఆచరణలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలనే సమస్య ఎదురైనపుడు, రెండింటిలో మొదటిదానికి, అలాగే రెండవ సూత్రంలో రెండవ దానికి ప్రాధాన్యతనివ్వాలని రాల్స్ ఉద్దేశ్యం. రాల్స్ ప్రతిపాదిస్తున్న మౌలిక స్వేచ్ఛలలో ముఖ్యమైనవి నాలుగు. అవి :

1) రాజకీయ స్వేచ్ఛ అంటే ఓటు హక్కు. ఎన్నికలలో పోటీ చేసే హక్కు, భావప్రకటన మరియు సమావేశ హక్కులు.

2) అంతరాత్మ స్వేచ్ఛ (Liberty of conscience) అనగా స్వేచ్ఛగా ఆలోచించేందుకు మరియు తన కిష్టమయిన విశ్వాసాలను కలిగి ఉండేందుకు స్వేచ్ఛ

3) వ్యక్తిగత ఆస్థి కలిగి ఉండే స్వేచ్ఛ

4) చట్టంతో ప్రమేయం లేకుండా నిర్బంధించబడకుండా ఉండే స్వేచ్ఛ.

పైన పేర్కొనబడిన స్వేచ్ఛలను అందరూ ఆచరణలో పొందేందుకు అనుగుణమైన విధంగా సామాజిక వ్యవస్థ నిర్మాణం జరగాలని, అప్పుడు మాత్రమే ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా తాను నిర్దేశించుకున్న విలువలను సాధించగలడని రాల్స్ ఉద్దేశ్యం. అలాగే ఏ సమాజంలోనైనా సామాజిక ఆర్థిక అసమానతలు ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థనీయం. అనగా ఆ అసమానతల వలన ప్రతివ్యక్తి ఆ సమాజంలోని ఉద్యోగాలలోగాని, పదవులలోగాని సమాన అవకాశాల ద్వారా ప్రవేశించేందుకు వీలుగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థనీయం. ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగాలు, పదవులలోకి పోటీపడి ప్రవేశించాలంటే లాంఛనప్రాయమైన స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన సరిపోదు; సరైన సమాన అవకాశాల ద్వారా ఆ అర్హతలను సాధించడం ద్వారా, వాటిల్లోకి ప్రవేశించడానికి వీలు కల్పించబడాలి.

రాల్స్ తన న్యాయ సూత్రాలను వివరించే క్రమంలో హాబ్స్, లాక్, కాంట్ మొదలగు వారు అనుసరించిన ఊహాత్మక పద్ధతిని ఆధారం చేసుకొని, తాను ప్రతిపాదిస్తున్న న్యాయసూత్రాలు ప్రజల మనోభావాలకు ఏవిధంగా సన్నిహితంగా ఉంటాయో వివరించాడు. తాను ప్రతిపాదించిన న్యాయసూత్రాలను ఆమోదించిన వ్యక్తుల సమూహం, తమ అజ్ఞానతెరను (Veil of ignorance) వివిధ దశలలో తొలగించుకుంటూ, ఆయా దశలలో ఆ న్యాయ సూత్రాలను నిర్దిష్ట పరిస్థితులకు ఎలా అన్వయిస్తారో వివరిస్తాడు. మొదటి దశలో వాళ్ళు రాజ్యాంగ చట్టాన్ని రూపొందించుకొంటారని, ఆ రాజ్యాంగానికి తన మొదటి న్యాయసూత్రం ప్రమాణంగా ఉంటుందని రాల్స్ ఉద్దేశ్యం. రెండవదశలో చట్టాలను రూపొందించుకుంటారని ఈ చట్టాలు తన రెండవ సూత్రంపై ఆధారపడి ఉంటాయని రాల్స్ భావిస్తాడు. తరువాత దశలో ఈ చట్టాలను న్యాయమూర్తులు, పరిపాలనాధికారులు నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేస్తారు. ఈ దశలో అజ్ఞానదొంతర పూర్తిగా తొలగించబడుతుంది.

## 4.4 రాజకీయ వ్యవస్థ - స్వభావము - విధులు :

న్యాయబద్ధమైన రాజకీయ వ్యవస్థలో సార్వజనీన ఓటుహక్కుద్వారా, నిర్ణీత కాలానికి ఎన్నికైన చట్టసభ మాత్రమే చట్టాలను రూపొందించే అధికారాన్ని కలిగి ఉంటుంది. ఈ చట్టసభ నిర్ణయాలు అధిక సంఖ్యాక ప్రతినిధుల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది కావున వాళ్ళ నిర్ణయాలు ప్రజల స్వేచ్ఛకు భంగం కలగని విధంగా, రాజ్యాంగంలో స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను పొందుపరచడం ద్వారా రక్షణ ఇవ్వబడుతుంది. రాజకీయ వ్యవస్థలో పౌరులందరికి రాజకీయ విషయాలకు సంబంధించిన సమాచారం సమానంగా అందుబాటులో ఉండాలి. పౌరులకు తమంతట తాముగా ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకోవడానికి అవకాశం ఉండాలి. కొద్దిమంది తమ వ్యక్తిగత అధికార సాధనాల ఆధారంగా రాజకీయ చర్చను మరియు చట్టాలను రూపొందించే క్రమంలో తమ ప్రయోజనాలకనుగుణంగా ఒత్తిడి చేసే అవకాశం ఉన్నందున రాజకీయ స్వేచ్ఛ తన విలువను కోల్పోతుంది. పౌరుల స్వేచ్ఛ పరిరక్షింపబడాలంటే ఆస్థి విస్తృత స్థాయిలో పంపిణీ కాబడినపుడే సాధ్యమవుతుంది.

రాల్స్ రెండవ సూత్రం ప్రకారం ప్రభుత్వం సరైన మరియు సమానమైన అవకాశాలను అందరికి కల్పించాలి. అంటే ప్రభుత్వం విద్య మరియు సాంస్కృతిక అవకాశాలను అందరికి అందుబాటులోనికి తీసికొని రావలెనంటే ప్రభుత్వమే విద్యావ్యవస్థను ఏర్పాటు చేయడంద్వారా కాని లేక ప్రైవేటు విద్యాలయాల్లో ప్రవేశాన్ని అందరికి సమానంగా లభింపచేయాలంటే కొంత ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరించవలసి ఉంటుంది. విద్యావకాశాలతోపాటు ప్రభుత్వం మరో నాలుగు ముఖ్యమైన విధులను నిర్వర్తించవలసి ఉంటుందని రాల్స్ ప్రతిపాదిస్తాడు. అవి :

1) వస్తువుల ధరలు పూర్తిగా మార్కెట్ చేత నిర్ణయింపబడకుండా, ఒకవైపు ఆర్థికంగా సంపన్న వర్గాల ఆదాయాలపై పన్నులను విధించి, మరోవైపు సామాన్య ప్రజానీకానికి అనేక రాయితీలు కల్పించడం ద్వారా, రాల్స్ ప్రతిపాదించే సామాజిక న్యాయం ఆచరణలోకి వస్తుందంటాడు.

2) సాధ్యమైనంతవరకు సంపూర్ణ ఉద్యోగితను మరియు వ్యక్తులు తమ వృత్తులను ఎంపిక చేసికొనేందుకు అవసరమైన అవకాశాలను విస్తృత స్థాయిలో కల్పించినపుడే, వ్యక్తి స్వేచ్ఛలు ఆచరణ సాధ్యం కాజాలవు.

3) సమాజంలోని అట్టడుగు వర్గాల, దీర్ఘకాల జీవిత ఆకాంక్షలు నెరవేరాలంటే వాళ్ళందరూ కనీస ఆదాయాలు పొందేటట్లు ప్రభుత్వం ప్రయత్నించాలి. ఎందువలెనంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మానవ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆదాయాలను పంపిణీ చేయదు కనుక ప్రభుత్వమే కనీస ఆదాయ పంపిణీ జరిగేటట్లు చూడాలి. ప్రభుత్వం కనీస ఆదాయ పంపిణీ అట్టడుగు వర్గాలకు లభించేటట్లు చూడగలిగితే, వారి ప్రాధమిక అవసరాలు, ఆత్మాభిమానం పరిరక్షించబడతాయి కాబట్టి, మిగతా పంపిణీ మార్కెట్ ద్వారా నిర్ణయించబడటం సమర్థనీయమేనని రాల్స్ అభిప్రాయం.

4) ఆర్థిక అసమానతలను ప్రభుత్వం సరిదిద్దకపోయినట్లయితే ఇతర రాజకీయ, విద్యా ఉద్యోగావకాశాలు సమానంగా పంపిణీ కావు కనుక ప్రభుత్వం ఆస్థి పంపిణీని వారసత్వం, వినియోగం మొదలైన వాటిపై పన్నులను విధించటం ద్వారా సమాన అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడాలి.

## 4.5 పౌర విధులు - బాధ్యతలు :

పౌరులకు విధులేకాని రాజకీయ బాధ్యతలు ఏమీ ఉండవని రాల్స్ ఉద్దేశ్యం. ప్రభుత్వ పదవులలో ఉన్నవాళ్ళు, ఆయా స్థానముల ఆధారంగా వారు పౌరులపట్ల నిర్వర్తించవలసిన విధులను రాజకీయ బాధ్యతలుగా పేర్కొనవచ్చును. కాని పౌరసత్వం అనేది ఒక సంస్థకి చెందిన పదవికాదు కాబట్టి, పౌరునికి బాధ్యతలు ఉండవు. ఇతరులకు సహాయపడటం, న్యాయబద్ధమైన సంస్థల నిర్ణయాలను అనుసరించడం మొదలైనవి పౌరవిధులుగా పేర్కొనవచ్చు. అలాగే న్యాయబద్ధమైన సామాజిక వ్యవస్థలో ప్రభుత్వ చట్టాలు కాని, విధానాలు గాని కొన్ని సందర్భాలలో న్యాయబద్ధంగా లేనప్పుడు, పౌరులు వాటిని ధిక్కరించరాదు. అయితే న్యాయబద్ధ సమాజంలో శాసనంగాని, విధానం కాని ఘోరమైన స్థాయిలో పౌరస్వేచ్ఛల, ఉల్లంఘునకు దారితీసే అవకాశం ఉందని భావించినపుడు మాత్రమే, రాజ్యధిక్కారానికి పౌరుడు పాల్పడవచ్చు.

## 4.6 సారాంశము :

రాల్స్ న్యాయసూత్రాలు ఉదారవాద సిద్ధాంతానికి ఒక నూతన పునాదిని ఏర్పరచాయి. ఉదారవాదం వ్యక్తిత్వ వికాసం గురించి మాట్లాడినప్పటికీ, అది ఆచరణ సాధ్యంకావడానికి గల అవకాశాలను గురించి వివరించడంలో విఫలమైంది. వ్యక్తినిర్ణయాలపై బాహ్య నియంత్రణ లేకుండా చూడగలగటమే స్వేచ్ఛ అని పరిమిత అర్థంలో ఉదారవాదం నిర్వచించినది కాని, స్వేచ్ఛ వ్యక్తీకరణకు సామాజిక అవకాశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని పట్టించుకొనలేదు. అలాగే నైతిక విలువలకు రాజకీయ విలువలకు మధ్య ఉండవలసిన సంబంధంపై, అస్పష్టమైన అభిప్రాయాలను, ఉదారవాదం వెలిబుచ్చింది. ఉదారవాదంలోని ఈ బలహీనతలను గుర్తించి, వాటిని ఉదారవాద భావజాల పరిధిలోనే ఎలా అధికమించవచ్చునో, తన న్యాయ సూత్రాల ద్వారా వివరించాడు. స్వేచ్ఛ మనిషి యొక్క నైతిక స్వభావంపై ఆధారపడి ఉంటుందని, వ్యక్తి యొక్క ఆత్మ గౌరవం, స్వీయవిలువ (Sense of his own worth) లు స్వేచ్ఛ అనే భావనతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటుందని నిరూపించేందుకు ప్రయత్నించాడు. మనుషులు కేవలం భౌతిక అవసరాలు తీర్చుకొనేందుకు మాత్రమే కలసి జీవిస్తారని చెప్పడం సరైనది కాదని,

ఇతర మానసిక అవసరాలైన ఆత్మగౌరవం, తోటివ్యక్తులపట్ల కరుణ మొదలైనవి కూడా సామాజిక సహజీవనానికి ప్రాతిపదిక కాగలవని చెప్పినవ్యక్తి రాల్స్. ప్రతి వ్యక్తి వికాసం, తాను కలసి జీవించే ఇతర వ్యక్తుల వికాసంతో ముడిపడి ఉంటుందన్న విషయాన్ని స్పష్టపరచాడు. ఆ విధంగా సామాజిక సహజీవనంలో స్వేచ్ఛ, సమానత్వం, అనే భావనలను న్యాయం అనే భావన ద్వారా సమన్వయపరచవచ్చునని, తన న్యాయసిద్ధాంతం ద్వారా వివరించాడు.

## 4.7 మాదిరి ప్రశ్నలు :

1. రాల్స్ యొక్క న్యాయసిద్ధాంతాన్ని వివరించండి.
2. పౌరవిధులపై రాల్స్ అభిప్రాయం.
3. రాజకీయ వ్యవస్థ - స్వభావం
4. రాల్స్ న్యాయసూత్రాలు

## 4.8. చదువదగిన గ్రంథాలు :


1. John Rawls, A Theory of Justice, Clarendon Press, Oxford, 1972.
2. Samuel Freeman (ed) : The Cambridge Corporation to Rawls, Cambridge University Press, Cambridge, 2003.
3. Bhikhu Parekh : Contemporary Political Thinkers, Martin Robertson, Oxford, 1982.


రచయిత : **వజ్రాల అంజిరెడ్డి**

పాఠం - 5

# రాబర్ట్ నోజిక్ - స్వేచ్ఛావాద హక్కుల సిద్ధాంతం

# LIBERTARIAN CONCEPTION OF RIGHTS - ROBERT NOZICK

పాఠ్య నిర్మాణ క్రమం:


5.0. లక్ష్యం

5.1. రాబర్ట్ నోజిక్ జీవిత విశేషాలు

5.2. నోజిక్-స్వేచ్ఛావాదం

5.3. వ్యక్తిగత హక్కులు

5.4. చట్టబద్ధమైన ఆస్థి హక్కుల సిద్ధాంతం

5.4.1. ప్రారంభ సముపార్జన

5.4.2. స్వచ్ఛంద బదిలీ

5.4.3. అన్యాయాలను సరిదిద్దడం

5.5. హక్కుల భావన - అరాచక వాదం నుండి రాజ్యం వైపు

5.5.1. రక్షక్ష సంఘాలు

5.5.2. అదృశ్య హస్త విశ్లేషణ

5.6. విస్తృత రాజ్యం ప్రమాదం

5.7. నోజిక్ స్వేచ్ఛావాదం తదనంతరం ఆలోచనలు

5.8. ముగింపు

5.9. మాదిరి పరీక్ష ప్రశ్నలు

5.10. ఆచూకి గంథ్రాలు

## 5.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశం అధ్యయనం ద్వారా రాబర్ట్ నోజిక్ యొక్క తాత్విక పరిజ్ఞానాన్ని విద్యార్థి తెలుసుకుంటాడు. ముఖ్యంగా నోజిక్ విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి చెప్పినటువంటి స్వేచ్ఛావాదం, హక్కుల సిద్ధాంతం, న్యాయసూత్రాల విశ్లేషణ, హక్కుల రక్షణకు సంబంధించి వాటి రక్షణ కొరకు ఏవిధమైన రాజ్య స్థాపన జరగాలి. రక్షక సంఘాలు ఏవిధంగా ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి వంటి విశ్లేషణాత్మక అంశాలను విద్యార్థికి తెలియజేయడమే ఈ పాఠ్యాంశం యొక్క లక్ష్యం.

## 5.1. రాబర్ట్ నోజిక్ (Rober Nozick) జీవిత విశేషాలు:

రాబర్ట్ నోజిక్ 1938లో న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో యూదుల వలసవాదుల కుటుంబంలో జన్మించాడు. అతను మెటాఫిజిక్స్, ఎపిస్టెమాలజీ, డెసిషన్ థియరి, పొలిటికల్ ఫిలాసఫి మరియు వాల్యూ థియరి వంటి అంశాల మీద పరిశోధనలు చేసిన విశిష్టమైన తత్వవేత్తగా పేరుగాంచాడు. రాబర్ట్ నోజిక్ ఒక విశ్లేషణాత్మక తత్వవేత్తగా చెప్పబడెను. అతను తను ఎంచుకొని దృగ్విషయాలను అర్ధవంతంగా వివరించడానికి మరియు సాంప్రదాయక జ్ఞానానికి ఆచరణీయ ప్రత్యామ్నాయాలను అందించడానికి ఆమోదయోగ్యమైన వివరణాత్మక సిద్ధాంతాలను వివరించడానికి ప్రయత్నించాడు. ఒక నిర్దిష్ట సిద్ధాంతం నిజమని విమర్శకులను ఒప్పించడం తత్వశాస్త్రం యొక్క లక్ష్యం కానవసరం లేదని అతను భావించాడు. నోజిక్ తత్వశాస్త్రాన్ని ఆలోచనల మధ్య సంబంధాలను ఏర్పరచడానికి మరియు అధ్యయన విషయాలు ఏవిధంగా ఉండవచ్చో వివరించడానికి ఒక అన్వేషణాత్మక పునాదిగా భావించాడు. నోజిక్ తన పాండిత్యాన్ని పెంపొందించడానికి తత్వశాస్త్రం వెలుపల అనేక తాత్విక విభాగాల నుండి అనేక విషయాలను కూడా వినియోగించడం జరిగినది. ఉదాహరణకు ఆర్థిక శాస్త్రం, పరిణామాత్మక జీవశాస్త్రం, బౌద్ధమతం మరియు నైతిక మనస్తత్వశాస్త్రం నుండి అంతర్విషయాలను పొందుపరిచారు మరియు వాటిని అనుభావిక అధ్యయనాలలో పొందుపరచినారు.

రాజకీయ తత్వశాస్త్రానికి సంబంధించి, నోజిక్‌ని పరిపూర్ణ స్వేచ్ఛావాదిగా చెప్పవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, వ్యక్తులు తమను తాము కలిగి ఉంటారని. ప్రైవేటు ఆస్తిపై హక్కు కలిగి ఉంటారు అనే ఆలోచనను ప్రాచుర్యం చేశాడు. నోజిక్ అభిప్రాయంలో చట్టబద్ధమైన ప్రభుత్వాలకు వ్యక్తులు మరియు వారి ప్రైవేటు ఆస్థిని రక్షించడం వంటివి ముఖ్యమైన విధులుగా భావించాడు. ఈ విధంగా రాబర్ట్ నోజిక్ తన భావజలాన్ని విశ్లేషించడం జరిగినది. ఈయన 2002 వ సంవత్సరంలో ఉదర సంబంధ కాన్సర్ వ్యాధితో మరణించాడు.

## 5.2. నోజిక్-స్వేచ్ఛావాదం:

20వ శతాబ్దంలో వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని, పరిమిత రాజ్యాన్ని సమర్ధించి అందుకుగాను ఒక పటిష్టమైన తాత్విక భూమికను ఏర్పరచిన ప్రముఖ తత్వవేత్తగా రాబర్ట్ నోజిక్‌కు పేరు ఉంది. సంక్షేమవాదం, సామ్యవాద భావజలాల గాలులు బలంగా వీస్తున్న రోజులలో నోజిక్ ఆ రెండింటిని తీవ్ర విమర్శలకు లోనుచేశాడు. అరాచక వాదము, సంక్షేమ వాదము,

సామ్యవాదము ఉత్తమమైన సంఘజీవనానికి ప్రమాదకరమని నోజిక్ వాదించాడు. బలప్రయోగము, దొంగతనము, మోసాలను అరికట్టడం ఒప్పందాలను అమలు చేయడం వగైరా విధులకు మాత్రమే కట్టుబడిన ఒక పరిమిత రాజ్యము న్యాయ సమ్మతమని నోజిక్ నిర్ధారించాడు మరియు స్వేచ్ఛాసూత్రం, వ్యత్యాస సూత్రం రెండింటినీ ఒకే సమయంలో రక్షించడం సాధ్యపడదు. ఎందుకంటే స్వేచ్ఛను రక్షించడం అంటే ఆస్థి హక్కులను పరిమితం చేయకుండా ఉండడం. అదేవిధంగా వ్యత్యాస సూత్రం ఆస్థి హక్కులను ప్రశ్నిస్తుంది. స్వేచ్ఛాసూత్రానికి విరుద్ధంగా నడుస్తుంది. దీనివల్ల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు ఆస్కారం కల్పిస్తుంది. కాబట్టి, రాజ్యము అనేది మానవుని వ్యక్తిగత అంశాలలో జోక్యం చేసుకోకుండా, సమానత్వం పేరుతో స్వేచ్ఛను తిరస్కరించడం లేకుండా ఉండాలని చెప్తారు. "ప్రతికూల స్వేచ్ఛా సిద్ధాంతాన్ని" ప్రతిపాదిస్తారు. దీని ప్రకారం విరుద్ధ ప్రయోజనాల కోసం స్థాపించబడిన ప్రభుత్వ యంత్రాంగాన్ని పరిమితం చేయడం ద్వారా మన స్వేచ్ఛా రంగంలో రాజ్యం జోక్యం చేసుకోకుండా నిరోధించడం అతనికి ముఖ్యం.

రాబర్ట్ నోజిక్ తన ప్రఖ్యాత గ్రంథమైన 'అనార్కి, స్టేట్ అండ్ యుటోపియా' (Anarchy, State and Utopia) లో ఆయన రాజనీతి భావాలను చూడవచ్చు. అరాచక వాదులు లేవనెత్తిన పలు మౌలిక ప్రశ్నలకు సమాధానంగా పరిమిత రాజ్యము ఎలా అవతరించిందో దాని కొనసాగింపు ఎందుకు అవసరమో నోజిక్ వివరించాడు. అంతేకాక సంక్షేమవాద, సామ్యవాద సిద్ధాంతవేత్తల రాజ్యభావన ఎలా అసంమజసమో కూడా వివరించాడు. ఈ రెండు సిద్ధాంతాలు - సంక్షేమవాదం సామ్యవాదం - విస్తృత రాజ్యాన్ని సమర్ధిస్తున్నాయని దీని వలన వ్యక్తుల హక్కులు స్వేచ్ఛగా అనుభవించలేరని కాబట్టి సమర్ధనీయం కాదని నోజిక్ భావించాడు.

## 5.3. వ్యక్తిగత హక్కులు:

రాబర్ట్ నోజిక్ "వ్యక్తులకు హక్కులు ఉన్నాయి" అనే వాదనతో 'అనార్కీ, స్టేట్ అండ్ యుటోపియా' అనే గ్రంథాన్ని ప్రారంభించాడు. మానవునికి వ్యక్తిగత హక్కులు ఉన్నాయి అని చెప్పేదానికి తనకు సరైన పునాదుల, ప్రాతిపదికలు లేవని ఒప్పుకుంటూనే వ్యక్తులు హక్కులు కలిగి ఉండటానికి గల కారణాలను అన్వేషిస్తూ వ్యక్తులు హక్కులను కలిగి ఉండటానికి ఇష్టపడతారని వివరించారు. అదేవిధంగా స్వేచ్ఛా సంకల్పం కలిగి ఉండటం అంటే వ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తున్నట్లు సూచించదని వివరించాడు.

వ్యక్తులు హక్కులను కలిగి ఉంటారనే భావనకు నోజిక్ దగ్గర నిర్మాణాత్మక వాదన లేనప్పటికీ దానికి అనుకూలంగా కారణాలు ఉన్నాయని అతను భావించాడు. ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేకమైన విలువ ఉంటుందనే ఆలోచనల నుండి వ్యక్తి హక్కులను కలిగి ఉన్నాడు అనే అంతరదృష్టి కోణాన్ని నిరూపించే ప్రయత్నం చేశారు. వ్యక్తులు కలిగి ఉన్న వ్యక్తిగత హక్కులు వారు ఏమి చేయాలనే దానిపై కొన్ని నైతిక పరిమితులను నిర్ణయిస్తుంది. నోజిక్ అభిప్రాయం ప్రకారం 'ఒక వ్యక్తి ప్రణాళికబద్ధమైన జీవన విధానాన్ని అలవరచుకోవడం ద్వారానే జీవితాన్ని అర్ధవంతంగా చేసుకోగలడు' దీని ద్వారా మానవుని జీవితం ఎందుకు ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటుంది అనే ప్రశ్నకు హేతుబద్ధమైన సామర్థ్యం ఉన్న జీవులు మాత్రమే అర్ధవంతమైన జీవితాన్ని కలిగి ఉంటారు అనేది నోజిక్ వాదన.

## 5.4. చట్టబద్ధమైన ఆస్థి హక్కుల సిద్ధాంతం:

1974లో ప్రచురించబడిని "అనార్కి, స్టేట్ అండ్ యుటోపియా" లో నోజిక్ కొన్ని న్యాయ సూత్రాలను ప్రతిపాదించాడు. నోజిక్ ఆస్థి మరియు వనరులకు చట్టబద్ధమైన యజమాని ఎవరో నిర్ణయించడానికి మూడు సూత్రాలను ప్రతిపాదించాడు.

### 5.4.1. ప్రారంభ సముపార్జన:

సమాజంలో వనరులపై మొదటగా ఎవరైతే యాజమాన్య హక్కులను కలిగి ఉంటారో అటువంటి ప్రైవేట్ ఆస్థి న్యాయ సమ్మతమైనది.

### 5.4.2. స్వచ్ఛంద బదిలీ:

స్వేచ్ఛగా బదిలీ చేయడానికి, విక్రయించడానికి దానముగా ఇవ్వడానికి సమ్మతమైన ఆస్థి మాత్రమే న్యాయమైనది. అంతేకాకుండా ఇది వనరుల న్యాయమైన పంపిణీకి దారితీస్తుంది.

### 3. అన్యాయాలను సరిదిద్దడం:

చట్టబద్ధమైన ఆస్థి హక్కులను నిర్ణయించడానికి పరిహారం చెల్లింపు పేరుతో జరిగే అన్యాయమైన కొనగోళ్ళను ఇతను వ్యతిరేకించాడు. అదేవిధంగా ఇతరుల కోసం కూడా తగినంత వనరులను మిగిలించాలి అనే పేర్కొన్నారు.

ఈ న్యాయ సూత్రాలను ఆధారంగా చేసుకొని నోజిక్ తన స్వంత విధానానికి పునాదులు వేసుకున్నారు. ఇది స్వీయ యాజమాన్యం అనే ఆలోచన చుట్టూ తిరుగుతుంది. ఇది నోజిక్ యొక్క స్వేచ్ఛావాద స్థానం యొక్క ప్రాథమిక సూత్రం.

## 5.5. హక్కుల భావన - అరాచక వాదం నుండి రాజ్యం వైపు:

మనుషులు సంఘజీవులుగా బ్రతకడానికి రాజ్యం అవసరము లేదని, రాజ్య స్థాపన మనుషుల స్వేచ్ఛను, హక్కులను హరించి వేస్తుందని, రాజ్యం ఒక దుష్టశక్తి అని అరాచకవాదులు భావించారు. అన్ని రకాల రాజ్యాలను అంటే అసలు రాజ్య వ్యవస్థను నిర్మూలించడం ద్వారానే మనిషికి మంచి మనుగడ సాధ్యం కాగలదని వారు భావించారు. అరాచక వాదులు లేవనెత్తిన ప్రశ్నలను నోజిక్ నిశితంగా పరిశీలించాడు. అరాచక వాదలు వాదన ఫలితంగా రాజనీతి సిద్ధాంతంలో ఉత్పన్నమైన ఒక మౌలికమైన ప్రశ్న ఏమిటంటే: రాజ్యం అనేది అసలు ఉండాలా? దీనికి సమాధానంగానే నోజిక్ పరిమిత రాజ్య భావనను ప్రతిపాదించాడు.

నోజిక్ తన విశ్లేషణను సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలలో ముఖ్యంగా లాక్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతంలో పేర్కొన్న ప్రాకృతిక వ్యవస్థతో తన విశ్లేషణను ప్రారంభించాడు.

ప్రాకృతిక వ్యవస్థలోని అసౌకర్యాలను అధిగమించేందుకు చేసుకున్న ఏర్పాటుగానే పౌరప్రభుత్వము ఆవిర్భవించిందన్న లాక్ ప్రతిపాదనను నోజిక్ అంగీకరించాడు. వ్యక్తి తన హక్కులను అమలు పరచుకోవడం ఇతరుల

నుండి నష్టపరిహారం వసూలు చేసుకోవడం అనేది తనంతటతానుగా అమలు చేసుకునే పరిస్థితులలో ఘర్షణలు ఉత్పన్నమైనమవుతాయని నోజిక్ వివరించాడు. అటువంటి స్థితిలో వ్యక్తులు వివాదాలను పరిష్కరించుకునేందుకు ఖచ్చితమైన మార్గాలు లేవు. అందువల్ల ప్రాకృతిక వ్యవస్థలో తన హక్కులను అమలుపరచుకొనే అవకాశం వ్యక్తికి ఉండదు. అనగా ఒక వ్యక్తి హక్కులను ఉల్లంఘించిన తరువాత మిగిలిన ప్రజలు అతనికంటే బలహీనులు అయినప్పుడు వారు అతనిని శిక్షించడం గాని, నష్టపరిహారం వసూలు చేయడంగాని అసాధ్యం. దీనికి సమాధానంగా నోజిక్ కొన్ని ప్రతిపాదనలు చేశారు.

### 5.5.1. రక్షక్ష సంఘాలు:

ప్రాకృతిక వ్యవస్థలోని అరాచక స్థితి నుండి పరస్పర రక్షక్ష సంఘాలు రూపుదిద్దుకుంటాయి. వ్యక్తుల హక్కులను అమలు చేయడం, ఇతర వ్యక్తు మీద దాడిచేయకుండా ఉండడం, వేరే సమూహాల నుండి దాడులు జరగకుండా నివారించడం, వ్యక్తి హక్కులకు భంగం కలగజేసిన వారిని శిక్షించడం ఈ సంఘాల పని. కొంతకాలానికి ఈ శాంతి భద్రతల విధులను నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను సమాజం ఏర్పరచుకుంటుంది. ఒక ప్రదేశంలో విభిన్న రక్షక సంఘాలు ఏర్పడడానికి మొదట్లో అవకాశం ఉంది. ఈ భిన్న రక్షక సంఘాల మధ్య ఘర్షణలు కూడా తెలత్తవచ్చు. ఈ రక్షక సంఘాల కార్యకలాపాలు సమన్వయం చేయడానికి, ఆ ప్రదేశంలో ఉన్న పౌరులందరి హక్కులను పరిరక్షించడానికి ఒక ఆధిపత్య రక్షక సంఘం రూపొందుతుంది. నోజిక్ మాటల్లో చెప్పాలంటే "అరాచక స్థితిని దాటి మనుషులు తమంతటతాముగా సమూహాలుగా ఏర్పడి పరస్పర రక్షక సంఘాలను ఏర్పరచుకుంటారు. శ్రమ విభజన, మార్కెట్ సంబంధాలు, వివేచనాత్మక స్వప్రయోజనం అనేది కలసి ఒక పరిమిత రాజ్యానికి దారితీసాయి.

### 5.5.2. అదృశ్య హస్త విశ్లేషణ:

రాజ్యం యొక్క ప్రాథమిక రూపాన్ని ఒక వ్యక్తి లేక బృందం ఉద్దేశ్య పూర్వకంగా ఒక పథకం ప్రకారం సృష్టించింది కాదు. రాజ్యానికి ప్రాథమిక దశలో కూడా ఒక రీతి, పద్ధతి ఉన్నాయి. అయితే దానికి ఒక వ్యక్తో లేక బృందమో కారణం కాదు. దీనిని చెప్పడానికి నోజిక్ అంతకుముందు ఆడమ్ స్మిత్ రూపకల్పన చేసిన "అదృశ్య హస్త సిద్ధాంతాన్ని" వినియోగించుకున్నాడు. రాజ్యానికి అదృశ్య హస్త వివరణగా నోజిక్ దీనిని పిలిచాడు. స్మిత్ ప్రకారం ప్రతివ్యక్తి తన స్వభావాన్ని ఉద్దేశించి మాత్రమే ఆలోచిస్తాడు. దానికోసమే ఇతరులకు సహకరిస్తూ తన కార్యకలాపాలు కొనసాగిస్తాడు. అయితే ఈ క్రమంలో మొత్తం సామాజిక హితం నెరవేరేదిశగా అతనిని అదృశ్య హస్తం నడిపిస్తుంది. నోజిక్ కూడా ఆ విధంగానే భావించాడు. ఆధిపత్య రక్షక సంఘం రూపుదిద్దుకోవడానికి అదృశ్య హస్త వివరణ అత్యంత సంతృప్తికరమైనదని నోజిక్ భావించాడు.

ఈ ప్రైవేటు రక్షక సంఘాలు పరిమిత రాజ్యము కన్నా భిన్నమైనది. ప్రైవేటు రక్షక సంఘాలు పరిమిత రాజ్యంగా పరివర్తన చెందే క్రమంలో కనీసం మరొక మధ్యంతర సామాజిక ఏర్పాటు జరిగి ఉండాలని నోజిక్ భావించాడు. దీనిని అతడు "అత్యంత పరిమిత రాజ్యం" గా పిలిచాడు. ఈ అత్యంత పరిమిత రాజ్యానికి సమాజంలో వ్యక్తుల మీద

బలప్రయోగం చేసే అధికారం ఉంటుంది. అంటే తప్పులు జరిగినప్పుడు అది తప్పు అని తీర్పు చెప్పడానికి, ఆ తప్పును సరిదిద్దడానికి, ప్రతీకార చర్య తీసుకోవడానికి నష్ట పరిహారం రాబట్టుకోవడానికి వ్యక్తికి అధికారం ఉండదు.

దీని ప్రకారం అత్యంత పరిమిత రాజ్యం అనేది ప్రాకృతిక వ్యవస్థలో నుండి ఎవరి హక్కులకు భంగం కాని రీతిలో ఉత్పన్నం అవుతుంది. బలప్రయోగం మీద దానికి ఉన్న గుత్తాధిపత్యం వలన దానిని వ్యక్తుల మీద ప్రయోగించడం అన్యాయంగా పరిగణించబడదు. నైతికంగా ఆమోదయోగ్యమైన మార్గాలలో అవి వృద్ధి చెందుతుంది. అదృశ్య హస్త క్రమములో అది రూపుదాలుస్తుంది. ఎవరికి ప్రత్యేక హక్కులు కల్పించకుండా, ఒకరికి ఉన్న హక్కులు మరొకరికి లేకుండా ఉండే పరిస్థితిని ఇది అంగీకరించదు.

ఈ సందర్భంగా వ్యక్తులు తమంతట తాము నైతికంగా ఏర్పరచుకునే కొన్ని ఆంక్షలు గూర్చి నోజిక్ వివరిస్తాడు. ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేక అస్థిత్వం ఉన్నది. మొత్తం సామాజిక శ్రేయస్సు గురించి ఒక వ్యక్తి యొక్క ప్రయోజనాలను బలిపెట్టవచ్చునున్న నీతి సిద్ధాంతాన్ని ఎవరూ అంగీకరించరు. ఈ ప్రమేయం ఆధారంగా నోజిక్ ఒక వ్యక్తి మరొక వ్యక్తి మీద దాడిచేయకూడదు అన్న నిబంధనను వ్యక్తులే ఏర్పరచుకుంటారు అని చెప్పారు.

## 5.6. విస్తృత రాజ్యం ప్రమాదం:

అరాచక స్థితి నుండి పరిమిత రాజ్యం ఏర్పడవలసిన ఆవశ్యకతను నోజిక్ సవివరంగా ప్రతిపాదించాడు. ఈ పరిమిత రాజ్య అవధులను ఎందుకు దాటకూడదో కూడా నోజిక్ వివరించాడు. పరిమిత రాజ్యం కన్నా మరింత విస్తృతమైన రాజ్యం అవసరమని చెప్పిన వాదనలను నిశిత పరిశీలనకు గురి చేశాడు. విస్తృత రాజ్యాన్ని కోరుకునే వితరణ న్యాయము మార్క్సిజం ముందుకు తెచ్చిన వాదనలు ఆమోదయోగ్యం కావు అని అన్నారు.

చెలామణిలో ఉన్న భిన్న న్యాయ సిద్ధాంతాలలో పలు లోపాలున్నాయని నోజిక్ భావించాడు. (వితరణ న్యాయము, హక్కుల న్యాయము మొదలైనవి ఇందుకు ఉదాహరణలు) వితరణ న్యాయము ప్రతిపాదించే నియమాలను ఆయన తిరస్కరించాడు. సమాజంలో కొంతమంది మరికొంత మంది సంక్షేమం కోసం వ్యయం లేదా చెల్లింపులు చేయడానికి ఆయన వేరే కారణాన్ని చూపాడు. ప్రాకృతిక వ్యవస్థలో వ్యక్తి అనుభవించిన హక్కులను రాజ్యములోనికి రావడం ద్వారా కోల్పోయిన దానికి నష్టపరిహారంగా రాజ్యం వ్యక్తులకు రక్షణ కల్పించవచ్చునన్నాడు. అంటే బడుగువర్గాల ప్రజల సంక్షేమానికి రాజ్యము చేసే ఏర్పాటు ఆ వ్యక్తి హక్కులకు ఇంతకుముందు జరిగిన ఉల్లంఘనను సరిదిద్దడానికే అని భావించాలి. ఇది మొత్తం సమాజంలో సాధారణ సంక్షేమాన్ని పెంపొందించవచ్చును. ఒక రకంగా నోజిక్ కూడా రాల్స్ ప్రతిపాదించిన న్యాయసూత్రాలలో రెండవ దానిని వేరే రూపంలో అంగీకరించాడని చెప్పవచ్చు. అన్యాయాలకు నష్టపరిహారంగా రాజ్యం అందించే సంక్షేమాన్ని చూడాలని భావించడం జరిగింది. రాల్స్ యొక్క వ్యత్యాస సూత్రాన్ని తిరిగి చెప్పడంగా దీనిని భావించవచ్చు. అయితే దీనిని సమాజంలో ఆదాయం, సంపదల పునః పంపిణీని ఒక పథకం ప్రకారం రాజ్యం చేపట్టడంగా భావించరాదు. ఒక సమాజంలో ఆస్థి, ఆదాయాల క్రమబద్దీకరణకై రాజ్యం ఎటువంటి విధానాన్ని ప్రజలపై రుద్దకూడదు.

ఇంతకు ముందు తత్వవేత్తలు ఊహకల్పన చేసిన స్వాప్నిక రాజ్యాన్ని పరిమిత రాజ్యంలోనే నెరవేర్చుకోవడం సాధ్యమని నోజిక్ భావించాడు.

## 5.7. నోజిక్ స్వేచ్ఛావాదం తదనంతరం ఆలోచనలు:

**నోజిక్ తన గ్రంథం:** 'అనార్కీ, స్టేట్ అండ్ యుటోపియా' ప్రచురణ తరువాత రాజకీయ తత్వశాస్త్రంనకు సంబంధించిన పరిశోధనలు విడిచి పెట్టాడు. అలాగే "సన్ ఆఫ్ అనార్కీ, స్టేట్ అండ్ యుటోపియా" అని రాయడం ద్వారా రాజకీయ సిద్ధాంతంలో తన స్వేచ్ఛావాద అభిప్రాయాలను విమర్శకుల నుండి సమర్ధించుకోవడంలో తనకు ఆసక్తి లేదని స్కోక్రటీస్ ఫజిల్స్‌లో పేర్కొన్నాడు. అయితే 'ది ఎగ్జామిన్డ్ లైఫ్' లో, నోజిక్ స్వేచ్ఛావాదానికి దూరంగా ఉన్నాడని సూచించాడు. తరవాత కాలంలో స్వేచ్ఛావాదానికి దూరంగా ఉన్నాడని సూచించాడు. తరువాత కాలంలో స్వేచ్ఛావాదానికి తన స్వంత ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలని ఉద్దేశించలేదని మరియు సిద్ధాంతం యొక్క ప్రధాన వైఫల్యంగా తాను భావించిన దానిని మాత్రమే ఎత్తి చూపుతున్నానని చెప్పాడు.

## 5.8. ముగింపు:

ఈ విధంగా రాబర్ట్ నోజిక్ తన 'అనార్కీ, స్టేట్ అండ్ యుటోపియా' గ్రంథం ద్వారా స్వేచ్ఛావాదాన్ని వివరిస్తూ వ్యక్తిగత హక్కులను, చట్టబద్ధ హక్కుల ప్రాధాన్యాన్ని వివరించాడు. అదేవిధంగా రాల్స్ చెప్పిన న్యాయ సూత్రాలను విమర్శిస్తూ కొన్ని న్యాయ సూత్రాలను ప్రతిపాదించారు. హక్కుల ప్రాధాన్యతలను వివరిస్తూనే హక్కుల రక్షణ బాధ్యత ఎవరు తీసుకోవాలో మరియు ఏ విధమైన రాజ్య ఆవిర్భావం జరిగితే హక్కులకు భంగం కలగకుండా రక్షించబడతాయో విశ్లేషించడం జరిగినది. అదేవిధంగా అపరిమిత రాజ్యం కంటే పరిమిత రాజ్యాన్ని సమర్ధించడం జరిగినది. ఈవిధంగా రాబర్ట్ నోజిక్ తన స్వేచ్ఛావాద భావనలను వివరించడం జరిగింది.

## 5.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు:

### I. వ్యాసరూప ప్రశ్నలు:

1) నోజిక్ స్వేచ్ఛావాదంపై వ్యాసం వ్రాయండి?

2) హక్కుల భావన - "అరాచక వాదం నుండి రాజ్యం దిశగా" అనే అంశంపై వ్యాసం వ్రాయండి?

### II. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:

1) చట్టబద్ధమైన ఆస్థి హక్కుల సిద్ధాంతం గూర్చి తెలుపండి?

2) అదృశ్య హస్త విశ్లేషణ గూర్చి వ్రాయండి?

**5.10. ఆచూకి గంథ్రాలు:**

1. రాబర్ట్ నోజిక్ - అనార్కీ, స్టేట్ అండ్ యుటోపియా
2. నోజిక్ - తాత్విక వివరణలు
3. నోజిక్ - సోక్రటిక్ ఫజిల్స్
4. నోజిక్ - ఎగ్జామిన్డ్ లైఫ్
5. డి. ముర్రే - నోజిక్ స్వయం ప్రతిపత్తి మరియు పరిహారం

రచన:
**డా॥ డి. మనో వికాస్**
M.A., B.Ed., Ph.D.
రీసెర్చ్ స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

పాఠం - 6

# ఎఫ్. ఏ. హేయక్ (1899 - 1992)

**విషయసూచిక**


6.0 లక్ష్యం

6.1. పరిచయం

6.2. సామ్యవాదంపై విమర్శ

6.3. స్వేచ్ఛాయుత సమాజంలో స్వేచ్ఛ మరియు చట్టం

6.4. శ్రేయోరాజ్యం సామాజిక న్యాయంపై విమర్శ

6.5. ఉదారవాదం ప్రజాస్వామ్య భావనలపై వివరణ

6.6. సారాంశము

6.7 చదువదగిన గ్రంధాలు


## 6.0. లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఉదారవాద భావజాల ముఖ్యాంశాలు, వాటి విశిష్టతను గ్రహించగలరు.

బి) సామ్యవాదం, శ్రేయోరాజ్యపాలన ఏ విధంగా ఉదారవాద విలువలకు భంగకరమో వివరించడం జరుగుతుంది.

సి) ఉదారవాదం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత విఫణి వ్యవస్థలు ఎలా పరస్పర పూరకాలో వివరించడం జరుగుతుంది.

## 6.1. పరిచయం :

ఈ శతాబ్దం తొలి ఐదు లేక ఆరు దశాబ్దాల వరకు సామ్యవాదం, శ్రేయోవాదం, ప్రజాస్వామ్య భావజాలాలు పాశ్చాత్యదేశాల మేధావివర్గాన్ని మరియు ప్రజానీకాన్ని విస్తృతంగా ప్రభావితం చేశాయి. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం అనే రాజకీయ లక్ష్యాలను సాధించేందుకు ఈ భావజాలాలు ప్రయత్నించాయి. మార్క్సిజం, శ్రామికవర్గ నియంతృత్వాన్ని, శ్రేయోవాదుల మెజారిటీ ప్రతినిధుల పాలనను ఈ లక్ష్యాల సాధనాలుగా ప్రకటించాయి. ప్రణాళికాబద్ధ అభివృద్ధి మరియు పంపిణీల ద్వారా ఈ లక్ష్యాలు సాధించబడతాయని భావించడం జరిగింది. ఈ భావజాలాల ఆధారంగా సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలలో ఉత్పత్తి సాధనాలను వ్యక్తిగత యాజమాన్యం నుండి తొలగించి రాజ్యపరిధిలోనికి తీసికొని రావడమేగాక, రాజ్యం ఆర్థిక ప్రణాళికా వ్యూహరచన ఆధారంగా ఆర్థికవ్యవస్థలో విస్తృతంగా జోక్యం చేసుకోవడం జరిగింది. అలాగే ఇతర పశ్చిమ ఐరోపాదేశాలలో రాజ్యం ప్రజాస్వామ్య లక్ష్యాలైన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందరికీ కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఆర్థిక వ్యవస్థలో పంపిణీ రూపంలో జోక్యం చేసుకోవడం జరిగింది. అయితే 1970 దశకానికల్లా అటు సోవియట్ యూనియన్ ఇతర తూర్పు

ఐరోపా దేశాలలోను ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన తగ్గుదల స్పష్టంగా కనిపించడమేగాక పైన పేర్కొనబడిన రాజకీయ లక్ష్యాలు రాజ్యం ద్వారా సాధించబడగలవన్న వాదనపై సంశయాలు మొదలైనాయి. ఈ నేపథ్యంలో హేయక్ 1940 నుండే ఈ భావజాలాలపై, 'The Road to Serfdom' అనే గ్రంథం ద్వారా చేసిన విమర్శ, క్రమేణా ఐరోపా దేశాలలో ప్రధాన చర్చనీయాంశంగా మారినది. సాంప్రదాయక ఉదారవాద భావజాల ప్రాతిపదికలైన వ్యక్తి స్వేచ్ఛ మరియు హక్కులు, రాజ్య నియంత్రణలేని స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ పోటీ ప్రపంచములోనే ఆచరణ సాధ్యం అవుతాయని, సామ్యవాద, శ్రేయోరాజ్యాలలో ఈ స్వేచ్ఛలు పరిరక్షించబడవని చెప్పటంలోనే హేయక్ యొక్క భావాల విశిష్టత ఉంది. శ్రేయోరాజ్యం, సామ్యవాదం 1940, 50 దశకాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకాన్ని, మేధావివర్గాన్ని ఆకర్షిస్తున్న కాలంలో కూడ, ఆ వ్యవస్థలపై సునిశితమైన విమర్శ చేసిన వ్యక్తి హేయక్. 1970, 80 దశకాలలో శ్రేయోవాదంపై రాజకీయ విమర్శ విస్తృత స్థాయిలో ప్రజల ఆమోదాన్ని పొందటంతో, హేయక్ ప్రతిపాదించిన భావాలపై ఇటీవల కాలంలో ప్రధాన చర్చకొనసాగుతుంది.

## 6.2 సామ్యవాదంపై విమర్శ :

1944లో వెలువడ్డ The Road to Serfdom, 1988లో ప్రచురించబడ్డ The Fatal Conceit, The Errors of Socialism అనే గ్రంథాలలో హేయక్ సామ్యవాద వ్యవస్థ అంతిమంగా నియంతృత్వం వైపు పయనించడం ఎలా అనివార్యమో వివరించడం జరిగింది. ఆధునిక సమాజాలలో ఉత్పత్తి వ్యయం, వినియోగదారుల కోర్కెలు, వస్తువుల ధరలకు సంబంధించిన సమాచారాన్ని లక్షల లేక కోట్లాది వ్యక్తులు తమంతట తాముగా ఒంటరిగా గ్రహిస్తుంటారు. ఈ కోట్లాది మంది తమ జీవిత లక్ష్యాల కనుగుణంగా సేకరించే సమాచారాన్నంతటిని రాజ్యానికి చెందిన ఒకసంస్థ సేకరించి తదనుగుణంగా మొత్తం వ్యవస్థకు సంబంధించిన స్థూల ఆర్థిక నిర్ణయాలను చేయడం అసాధ్యం. అంటే సామ్యవాద రాజ్యాలలో ప్రభుత్వ ప్రణాళికా సంస్థ మొత్తం వ్యవస్థకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు, ప్రజలు ఒంటరిగా తీసుకునే నిర్ణయాలకు మధ్య అంతరం ఉండే అవకాశం ఉంది. అందువలన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్పత్తి పంపిణీలకు సంబంధించిన నిర్ణయాలను ప్రభుత్వం సహేతుకంగా తీసుకోకుండా, తన అధికారం ద్వారా తీసికొనే నిర్ణయాల వలన ఉత్పత్తికారకాలు (Labour, Capital etc.,) వాటి గరిష్టవిలువల కనుగుణంగా వినియోగించకపోవడం వలన ఉత్పాదకత క్రమేణా తగ్గుతూ ఉంటుంది. అందువలన సోషలిస్ట్ వ్యవస్థలలో రాజ్యం చేసే ప్రణాళికాబద్ధ నిర్ణయాల వలన ప్రజల అవసరాలు మరింత ఎక్కువగా తీరుతాయనేది భ్రమ మాత్రమేనని హేయక్ ఉద్దేశ్యం.

## 6.3 స్వేచ్ఛాయుత సమాజంలో న్యాయం మరియు చట్టం :

స్వేచ్ఛాయుత సమాజం(free market economy) లో హేయక్ యొక్క న్యాయసిద్ధాంతం ప్రకారం నిర్దిష్ట మానవ లక్ష్యాలతో ప్రమేయం లేకుండా చట్టాలు రూపొందించబడాలి. సమాజానికి, సంస్థకి మధ్య మౌలిక వ్యత్యాసం ఉందని హేయక్ చెప్తాడు. కొద్దిమంది వ్యక్తులు తమ ఉమ్మడి లక్ష్యాలను సాధించుకునేందుకు సంస్థను ఏర్పరచుకొంటారు కావున ఆ సంస్థ నిర్వహణ సౌలభ్యం కొరకు ఆ సంస్థలో పనిచేసే వ్యక్తులు కొన్ని నియమాలను రూపొందించుకుంటారు. అయితే అభివృద్ధి చెందిన మానవ సమాజాలలో మొత్తం సమాజానికంతటికీ వర్తించే నిర్దిష్ట రాజకీయగమ్యాలు లేక లక్ష్యాలు ఏమీ ఉండవని, అయితే ప్రతివ్యక్తి స్వేచ్ఛగా తన జీవిత లక్ష్యాలను ఆయా సంస్థల ద్వారా సాధించుకొనేందుకు ప్రయత్నిస్తాడంటాడు. దీని పర్యావసానంగా మొత్తం సమాజంలో మానవ సంకల్పంతో ప్రమేయం లేకుండా ఒకక్రమబద్ధమైన వ్యవస్థ (Spontaneous Order) ఏర్పడుతుందంటాడు. ఈ స్వేచ్ఛాయుత సమాజంలో అందరూ అంగీకరించిన "సమిష్టి శ్రేయస్సు" అంటూ నిర్దిష్టంగా

ఏమీ ఉండదని, అయితే సమిష్టిశ్రేయస్సు (Common Good) అంటే ఇక్కడ ప్రతివ్యక్తి తన శ్రేయస్సును పెంపొందించుకొనేందుకు దోహదపడటమే. దానినే హేయక్ చట్టపాలన (Rule of Law) అంటాడు. ఈ నియమాలు అమూర్త స్థాయిలో నిర్వచించబడి ఒక క్రమపద్ధతిని ఏర్పరచడం ద్వారా వ్యక్తులు తమ జీవిత నిర్ణయాలను స్వేచ్ఛగా సాధించుకొనేందుకు అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి హేయక్ దృష్టిలో న్యాయం అంటే నిర్దిష్ట సామాజిక శ్రేయస్సును సాధించడమో లేక సమాజంలో విభిన్నవర్గాల మధ్య సమన్వయాన్ని సాధించటమోకాదు. కేవలం న్యాయం అంటే అతని దృష్టిలో సార్వత్రిక నియమాల చట్రాన్ని (A framework of Rules or Rule of Law) రూపొందించటం ద్వారా ప్రతివ్యక్తి తన వ్యక్తిగత శ్రేయస్సును స్వతంత్రంగా పొందేందుకు వీలు కల్పించడమే. కావున స్వేచ్ఛాయుత మార్కెట్ వ్యవస్థలో కొంతమంది వ్యక్తులు పేదరికంలో ఉండటానికి కాని, లేక నిరుద్యోగులుగా ఉండటంకాని, వ్యవస్థీకృత ఫలితాలుగా పరిగణించక ఆయా వ్యక్తుల వ్యక్తిగత లక్షణాల ఫలితంగా పరిగణించబడాలంటాడు. కావున స్వేచ్ఛాయుత మార్కెట్ వ్యవస్థలో ఆస్థి, ఆదాయాలు మరియు వస్తుసేవల సహజపంపిణీ ఆ సమాజంలో అసమానతలకు దారితీసినప్పటికీ ఆ పంపిణీని సమంజసమని భావించాలని, ఎందువలనంటే ఏ వ్యక్తి లేక ప్రభుత్వ ప్రమేయం అందులో ఏ మాత్రం లేదని అది కేవలం అనేక వేల లేక లక్షల మంది వ్యక్తుల నిర్ణయాల ఫలితంగా భావించాలంటాడు.

## 6.4 శ్రేయో రాజ్యంలో సామాజిక న్యాయభావనపై విమర్శ :

స్వేచ్ఛాయుత మార్కెట్ సమాజాలలో సామాజిక న్యాయాన్ని ప్రతిభ మరియు అవసరం అనే అంశాల ఆధారంగా నిర్వచించి, ఆ న్యాయసూత్రాల ఆధారంగా ఆయా సమాజాలలోని ఆస్థి, ఆదాయం మరియు వస్తుసేవలు పంపిణీ చేయడం న్యాయమని, అనేక న్యాయసిద్ధాంతాలు ప్రతిపాదించాయి. అయితే ప్రతిభను, అవసరాన్ని మార్కెట్‌తో ప్రమేయం లేకుండా మదింపు చేయటం కష్టసాధ్యమని మరియు ఆ సమాజాలలో ఈ పంపిణీ సూత్రాలపై ఏకాభిప్రాయం లేదని హేయక్ వాదన. ఒకవేళ ప్రతిభ లేదా అవసరం ఆధారంగా పంపిణీ జరగాలన్నా ఈ ప్రతిభ లేక అవసరాన్ని ఏ ప్రాతిపదికపై అంచనా వేయాలన్న విషయంలో ఏకాభిప్రాయాన్ని సాధించడం కష్టతరమని అతని ఉద్దేశ్యం. అంతేకాక ఈ పంపిణీని చేసే బాధ్యత అంతిమంగా ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుందని, ప్రభుత్వం ఈ పంపిణీని తన ఇష్టానుసారంగా చేసినపుడు వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని అతని వాదన. ప్రభుత్వం ఇలా పంపిణీ చేయడం వలన రెండు దుష్ఫలితాలుంటాయని చెప్తాడు. మొదటిది : భిన్న జీవన లక్ష్యాలను స్వేచ్ఛగా సాధించుకోవడం మార్కెట్ వ్యవస్థ ప్రధాన లక్షణంకాగా ప్రతిభ లేక అవసరం ఆధారంగా ఆర్థికవనరులను పంపిణీ చేయడం ఒకానొక న్యాయదృక్పథాన్ని, ఆ సమాజంలోని అందరిపై బలవంతంగారుద్ది ఆమోదింపచేయడం వాళ్ళ స్వేచ్ఛకు విరుద్ధం. రెండవది : ఎవరికైతే ఈ పంపిణీ బాధ్యత ఇవ్వబడుతుందో ముఖ్యంగా ప్రభుత్వాధికారులు తమ విశేష అధికారాన్ని తమ ప్రయోజనాల కనుగుణంగా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నది. ఎప్పుడైతే ప్రభుత్వం ఈ పంపిణీ బాధ్యత స్వీకరిస్తుందో, అప్పుడు ఆయా సమాజాలలోని ప్రభావవర్గాలు (Interest Groups) తమ తమ ప్రయోజనాలకనుగుణంగా సామాజిక న్యాయాన్ని నిర్వచించి ప్రభుత్వంపై ఒత్తిడిని తీసికొని రావడంద్వారా పంపిణీలో ప్రతివర్గం ఎక్కువ వాటాని పొందేందుకు ప్రయత్నిస్తుంది. ఎప్పుడైతే ప్రభుత్వంపై ప్రభావవర్గాల ఒత్తిడి పెరుగుతుందో, అప్పుడు ప్రభుత్వం విచక్షణారహిత నిర్ణయాలను తీసికోవడం తత్ఫలితంగా పాలనా సంక్షోభాన్ని (Governability Crisis) ఎదుర్కొనవలసి వస్తుంది. ఒక ప్రభావ వర్గానికి అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని భావించినపుడు ఇతరవర్గాలు ఏకంకావడం, చివరకు ప్రభుత్వం అస్థిరతకు దారితీయడం జరుగుతుంది. కాబట్టి హేయక్ దృష్టిలో సామాజిక న్యాయాన్ని ప్రతిభ లేదా అవసరం ఆధారంగా నిర్వచించి అందుకు అనుగుణంగా ప్రభుత్వ ఆదాయం, వస్తుసేవలను పంపిణీ చేసినట్లయితే అది చివరకు ప్రభుత్వ నిరంకుశపాలనకు, అలాగే ప్రభుత్వం అస్థిరత్వానికి దానితీసే అవకాశం ఉంది. కనుక హేయక్ దృష్టిలో ఉదారవాద సమాజాలలోని రాజ్యం,

స్లోవేనియన్ తత్వవేత్త "స్లావోజ్ జిజెక్" వాదిస్తూ, మనం చరిత్ర ముగింపుకి చేరుకున్నామని ఫుకుయామా ఆలోచన పూర్తిగా నిజంకాదని, లిబరల్ ప్రజాస్వామ్యం పెట్టుబడిదారీ విధానంతో ముడిపడి ఉందని జిజెక్ సూచించాడు. అయినప్పటికీ చైనా మరియు సింగపూర్ వంటి నిరంకుశ దేశాలలో పెట్టుబడిదారీ విధానం యొక్క విజయం పెట్టుబడిదారీ విధానానికి మరియు ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న సంబంధం విచ్ఛిన్నమైందని చూపిస్తుంది. పెట్టుబడిదారీ విధానం మరియు నయా ఉదారవాద విధానాల విజయం వల్ల ఏర్పడిన సమస్యలు సంపదల అసమానతలు మరియు పర్యావరణ ప్రమాదాలు, అనేక దేశాలలో ఎన్నుకోబడిన ప్రభుత్వాల పట్ల వ్యతిరేఖతలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా ఉదారవాద ప్రజాస్వామ్యం స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వలన ఏర్పడిన అనేక సమస్యల నుండి బయటపడడానికి చాలా కష్టపడవలసి వచ్చినది.

త

## 9.12. ముగింపు:

ఫుకుయామా చరిత్ర ముగింపు విషాదకరమైన సమయం అని ముగించారు. ఎందుకంటే ప్రజలు తమ ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్న సైద్ధాంతిక పోరాటాల సంభావ్యత ఇప్పుడు "ఆర్థిక గణన, సాంకేతిక సమస్యల అంతులేని పరిష్కారం, పర్యావరణ ఆందోళనలు మరియు అవకాశాలతో భర్తీ చేయబడింది. అధునాతన వినియోగదారుల డిమాండ్ల సంతృప్తి అనగా ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్యం పరిపూర్ణ రాజకీయ వ్యవస్థ అని నమ్ముతున్నాడని కాదు. మరొక రాజకీయ నిర్మాణం పౌరులకు ఉదారవాద ప్రజాస్వామ్యం చేయగలిగిన సంపద మరియు వ్యక్తిగత స్వేచ్ఛలను అందించగలదని అతను భావించడం లేదు.

## 9.13. మాదిరి పరీక్ష ప్రశ్నలు:

### I. వ్యాసరూప ప్రశ్నలు:

1) ఫుకుయామా చరిత్ర ముగింపు - ఉదార ప్రజాస్వామ్య సమర్ధనను విపులంగా చర్చించండి?

2) ఫుకుయామా సిద్ధాంత అనుకూల - ప్రతికూల వాదనలను చర్చించండి?

### II. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:

1) ఫుకుయామా సిద్ధాంత విమర్శలను క్లుప్తంగా చర్చించండి?

## 9.14. ఆచూకి గ్రంధాలు:

1) జె.జె. క్లార్క్ - "ది ఎండ్ ఆఫ్ హిస్టరీ".

2) ఫుకుయామా - "ది ఎండ్ ఆఫ్ హిస్టరీ - ది నేషనల్ ఇంట్రస్ట్".

3) ఫుకుయామా - "ది ఎండ్ ఆఫ్ హిస్టరీ - 20 ఇయర్స్ లేటర్".

రచన:
**డా॥ డి. మనో వికాస్**
M.A., B.Ed., Ph.D.
రీసెర్చ్ స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

పాఠం - 10

# ఆంటోనియో గ్రాంసీ

విషయసూచిక

10.0 లక్ష్యం
10.1 జీవిత సంగ్రహం
10.2 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు
10.3 ఆధిపత్య భావన
10.3.1 బూర్జువా వర్గ ఆధిపత్యం
10.3.2 కార్మిక వర్గ - చారిత్రక శిబిరంలో అలయన్స్‌లు
10.4 పౌర సమాజం
10.5 మేధావులు
10.6 రాజకీయ పార్టీ
10.7 నిష్క్రియా విప్లవం
10.8 సారాంశం
10.9 మాదిరి ప్రశ్నలు
10.10 చదువదగిన గ్రంథాలు

## 10.0 లక్ష్యం :

గ్రాంసీ ప్రతిపాదించిన ప్రధాన భావనలను వివరించటం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠంలో ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు, ఆధిపత్య భావన, మేధావులు వంటి అంశాలపై గ్రాంసీ అభిప్రాయాలను తెలుసుకుంటాము.

## 10.1 జీవిత సంగ్రహం :

దక్షిణ ఇటలీలోని సార్డీనియా ద్వీపంలో 1891లో గ్రాంసీ జన్మించాడు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశాడనే నెపంపై తండ్రి జైలుపాలయ్యాక గ్రాంసీ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. తల్లి ఒక టైలరు దగ్గర కూలీగా పనిచేస్తూ తెచ్చే డబ్బుతోనే ఏడుగురు పిల్లలు బ్రతకాల్సి వచ్చేది. ఆ కుటుంబం దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించేది. పుట్టుకతోనే అర్భకంగా వెన్నెముక వ్యాధితో పుట్టిన గ్రాంసీ, బ్రతుకుదెరువు కోసం ఎనిమిదవ ఏటనే సామాన్లు మోసేవాడు. 1904లో తండ్రి జైలు నుండి తిరిగి వచ్చాక మళ్ళీ బడికి వెళ్ళాడు. 1908లో దిగువ స్కూలు పరీక్ష పాసయి, 1908లో క్యాలరీలో ఉన్న అన్నయ్య వద్దకు వెళ్ళి పాఠశాల విద్య పూర్తి చేశాడు. 1911లో పేద విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌ను సంపాదించి టురిన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. కమ్యూనిస్ట్ ఉద్యమంతో పరిచయం, సోషలిస్టు పత్రికలకు

వ్యాసాలు వ్రాయటం మొదలు పెట్టాడు. తీవ్రమైన అనారోగ్యం వలన 1915లో చదువు మానివేశాడు. 1916 - 19ల మధ్య కాలంలో గ్రాంసీ లెక్కకు మించిన వ్యాసాలు వ్రాసి, అందరిచేత "అజేయ రాజకీయ వ్యాఖ్యాత'' గా పేరు సంపాదించుకున్నాడు. 1924లో గ్రాంసీ ఇటలీ వెలుపల ఉంటూనే, ఇటలీ పార్లమెంటుకు ఎన్నిక అయారు. కమ్యూనిస్టు పార్టి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1926లో అరెస్టయి జైలుకు పంపబడ్డారు. జైలులో విపరీతమయిన అనారోగ్యానికి గురయ్యారు. కదలటానికి కూడా శక్తిలేని పరిస్థితులలో 1937 ఏప్రిల్ 11 న విడుదల అయ్యారు. కాని ఏప్రిల్ 25న మెదడులోని రక్తనాళాలు చిట్లిపోవటం వలన ఏప్రిల్ 27న కన్ను మూసారు. తన సుదీర్ఘమయిన జైలు జీవితంలో 3000 పేజీలకు పైగా వ్యాసాలను వ్రాశారు. అనేక విషయాలకు సంబంధించిన సైద్ధాంతిక చర్యలను ఈ 3000 పేజీలలో పొందుపరిచారు. వీటినే "జైలు నోట్ బుక్స్'' అని అంటారు. ఈ 33 జైలు నోట్ బుక్స్‌లోనే గ్రాంసీ రాజకీయ సిద్ధాంతం లభిస్తుంది. గ్రాంసీని ఒక సిద్ధాంతవేత్తగా గుర్తించేవారు ఈ జైలు నోట్ బుక్స్‌కు చాలా ప్రాధాన్యత ఇస్తారు. గ్రాంసీ భావాలను 1) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు 2) ఆధిపత్య భావన 3) పౌర సమాజం 4) మేధావులు 5) రాజకీయ పార్టీ 6) నిష్క్రియా విప్లవం అనే శీర్షికలుగా విభజించి అధ్యయనం చేయవచ్చు.

## 10.2 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు :

గ్రాంసీ భావజాలంలో ప్రధాన అంశం ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ నిర్మాణం - నిర్వహణ. బూర్జువాప్రజాస్వామ్యానికి విరుద్ధంగా రాడికల్ కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయటం ఉద్యమ ధ్యేయం. ప్రతి ఫ్యాక్టరీలోనూ శారీరక శ్రమ, గుమస్తాపనులు, సాంకేతిక నిపుణులు ఇలా శ్రమకు సంబంధించిన ప్రతి విభాగం నుండి, 15 మంది కార్మికులకు ఒకరి చొప్పున ప్రతినిధులను ఎన్నుకొనేవారు. ఆయా వార్డులలో నివసించే ఇతర శ్రామికులను, ఉదా॥ వీధులు ఊడ్చేవారు, టాక్సి డ్రైవర్లు, నెరేటర్లు మొదలయిన వారిని వార్డు కౌన్సిళ్ళలో చేర్చుకొనేవారు. ఈ విధంగా కార్మికులు నివశించే వార్డులోని మొత్తం శ్రామిక వర్గానికి న్యాయబద్ధ, క్రమశిక్షణాయుత వేదికనొకదానిని నిర్మించే ప్రయత్నం జరిగింది. ఈ వార్డు కౌన్సిళ్ళు ఆశయాలు ఈ విధంగా ఉండేవి.

1) ఫ్యాక్టరీ వ్యవస్థలో తీసుకురావల్సిన పరివర్తన గురించి వివరంగా, ఆచరణాత్మకంగా చర్చించటం.
2) నిజమైన ఉత్పతిదారులయిన కార్మికుల వర్గ చైతన్యం పెంపొందించటం.
3) ఉత్పత్తి సాధనాలను తమ చేతుల్లోకి తీసుకోవటానికి, ఉత్పత్తి సంబంధాలను పునర్ వ్యవస్థీకరించటానికి అవసరమయిన సైద్ధాంతిక, ఆచరణాత్మక విధానాలను వివరించడం.
4) సోషలిస్టు సమాజాన్ని సాధించిన తర్వాత అవసరమయే శ్రామికవర్గ సంస్కృతి గురించి వివరించటం.
5) శ్రామికులలో హక్కులకూ, విధులకూ సంబంధించిన చైతన్యాన్ని వ్యాప్తిచేయటం.
6) బూర్జువా సంస్థలతో, బూర్జువా భావాలతో అట్టడుగు స్థాయి నుండి విమర్శనా దృష్టితో వర్గ పోరాటాన్ని నిర్వహించె శక్తిని కల్పించటం.
7) ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోని 'ఆర్థిక వాదం' స్థానంలో, రాడికల్ రాజకీయ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, శ్రామికవర్గ దృక్పథంలో మార్పుతేవటం.

పెట్టుబడి ప్రయోజనాల కోసం పారిశ్రామికులు రూపొందించిన ఉత్పత్తి క్రమాన్ని ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలి. సామ్యవాదంలో ఫ్యాక్టరీ నిర్వహణ ఏవిధంగా ఉంటుందో, అదే తరహాలలో సూక్ష్మరూపంలో ప్రతి ఫ్యాక్టరీ కార్మికులకు తర్ఫీదు నివ్వాలి. అయితే ఈ ప్రక్రియ కార్మికులపై బయట

నుండి రుద్దబడరాదని, కార్మికులలో నుండే ఈ అవగాహన, చైతన్యం రావాలని గ్రాంసీ భావించాడు. ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ సక్రమ నిర్వహణ ద్వారా, ప్రజలకు ఒక శాశ్వత, క్రమశిక్షణాయుత నిర్మాణాన్ని సమకూర్చే ప్రయత్నం జరగాలి. రాజకీయ, పరిపాలనా అనుభవాలకు సంబంధించి ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు పాఠశాలలుగా ఉపయోగపడాలి. చిట్టచివరి మనిషి వరకు ప్రజలందరూ ఈ ప్రక్రియలలో భాగస్వాములు కావాలి. ఫలితంగా వారిలో సైద్ధాంతిక పరిజ్ఞానం, గట్టిదనం, పట్టుదల పెరిగి, క్రమశిక్షణ గల్గిన సైనికులలాగా తయారవుతారని గ్రాంసీ భావించాడు.

కౌన్సిళ్ళు పూర్తిగా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. కౌన్సిల్ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలిపెట్టే విధంగా పై స్థాయిలోని నాయకత్వం ప్రయత్నించకూడదు. కౌన్సిళ్ళ స్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిని అమలు చేయటం వలన ప్రతి కార్మికుడు తన సామర్థ్యం, కార్యరంగాల పరిధిలో ఆయా సమస్యలతో మమేకమయి, పరిష్కారం ఆలోచించగలుగుతారు. సమస్యలపై స్పష్టమైన అవగాహన సంపాదించటంలో, పనిచేయటంలో, ఒకనినొకరు చైతన్య పరుచుకోవటంలో ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేసే ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు గణనీయంగా సహాయపడతాయని గ్రాంసీ భావించాడు.

కౌన్సిళ్ళ నిజమైన ప్రాముఖ్యం కర్మాగారంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడంలోనేకాదు, గుణాత్మకంగా నూతనమైన సంబంధాలను, కొత్త జ్ఞానాన్ని, కొత్త ఉత్పత్తి సంబంధాలను, బూర్జువా వర్గానికి భిన్నమైన కార్మికవర్గ స్వీయాత్మక లక్షణాలను అభివృద్ధి చేసే కేంద్రాలుగా పనిచేయడంలోనే కౌన్సిళ్ళ నిజమైన ప్రాముఖ్యం ఇమిడివుందని పలువురు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. అవి పరివర్తన సాధనాలు. పెట్టుబడిదారీ సంస్థల లోపల విప్లవానికి సన్నాహాలు చేసే సాధనాలు. సిద్ధాంతం - ఆచరణల మధ్య ఐక్యత సాధించి వర్తమానాన్ని భవిష్యత్‌తో అనుసంధించే సాధనాలు. పౌర సమాజంలో జరగాల్సి ఉందని గ్రాంసీ చెప్పిన ముఖాముఖి యుద్ధానికి (War of Position) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు మంచి ఉదాహరణ అవుతాయి.

ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ రాజకీయ చొరవను విశ్లేషిస్తూ గ్రాంసీ వాటి "ఓటమి" కి రెండు ముఖ్య కారణాలు చూపించారు. కార్మికవర్గ చొరవను దెబ్బతీసిన సోషలిస్టుపార్టీ, ట్రేడ్ యూనియన్ నాయకత్వ సంస్కరణవాద స్వభావం మొదటి కారణం. రెండవ కారణం -- కార్మికోద్యమం రైతాంగంతో దక్షిణప్రాంత మేధావులతో, ఇతర ప్రజాతంత్ర శక్తులతో ఐక్య సంఘటన నిర్మించుకోలేకపోవడం. అలాంటి మైత్రి రూపొంది ఉంటే, బూర్జువా వర్గం కార్మిక కర్షక వర్గాల పౌరజీవితం, ఆర్థిక రంగం, రాజ్యం -- వీటిలో బూర్జువా అధికారాన్ని సమర్దంగా సవాలు చేయగల కొత్త చారిత్రక శక్తి ఆవిర్భవించి ఉండేదని గ్రాంసీ భావించాడు.

## 10.3 ఆధిపత్య భావన :

గ్రాంసీ భావజాలంలో ఇది చాలా కీలకమయినదని చాలా మంది విశ్వాసం. గ్రాంసీని చాలా గొప్ప మార్క్సిస్టు మేధావిగా నిరూపించటానికి ప్రయత్నించేవారు, గ్రాంసీ ప్రతిపాదించిన ఈ భావన మార్క్సిజాన్ని మరింత సుసంపన్నం చేసిందని ఆనందిస్తూ ఉంటారు. మార్క్స్, లెనిన్ ఈ భావనకు చాలా ప్రాధాన్యత ఇచ్చారన్న విషయాన్ని గ్రాంసీ అభిమానులు విస్మరిస్తూ ఉంటారు. లెనిన్ **1905 - 1917** ల మధ్య ఈ భావనపై కొన్ని రచనలు చేశారు. అయితే రష్యన్ భాషలో ఆధిపత్యం అనే అర్థంలో లెనిన్ ఈ పదాన్ని వాడితే, అనువాదకులు దాన్ని "నియంతృత్వం" అని అనువదించారు. మార్క్స్, లెనిన్‌లు ఆధిపత్య భావనను ఏవిధంగా వివరించారు అన్న విషయాన్ని ప్రక్కన పెట్టి, గ్రాంసీ ఏం చెప్పాడో తెలుసుకుందాం. "నిర్బంధం, అణచివేతలు ప్రాతిపదికగా గల అధికారం బదులు, పౌర సమాజంలో సమ్మతి, భావజాల ప్రభావం ప్రాతిపదికన అధికారాన్ని చెలాయించటాన్ని" గ్రాంసీ ఆధిపత్యమని అన్నాడు. మరో మాటలో చెప్పాలంటే సమాజంలో అధికారం

కేవలం బలప్రయోగం ద్వారా మాత్రమే సాగదని, దానికి భావజాలం పునాదిగా ఉన్నప్పుడు మాత్రమే నిరంతరం కొనసాగుతుందని అర్థం. అధికార చెలాయింపులో బలం, దౌర్జన్యం కన్నా, రాజకీయ, న్యాయ, సాంస్కృతిక, మనస్తత్వ, భావజాలం మొదలైన ఉపరితల అంశాలు కీలకపాత్ర పోషిస్తాయని గ్రాంసీ భావించాడు.

## 10.3.1 బూర్జువా వర్గ ఆధిపత్యం :

బూర్జువా వర్గాలు తమ అధికారాన్ని దీర్ఘకాలం ఎలా నిలుపుకుంటున్నాయి ? అన్న ప్రశ్న వేసుకొని, ఫ్రెంచి విప్లవ కాలంలోని జాకోబిన్ల ఉదాహరణను తీసుకొని, గ్రాంసీ ఈ క్రింది విధంగా సమాధానం చెప్పాడు. "జాకోబిన్లు బూర్జువా ప్రభుత్వాన్ని నెలకొల్పడమేకాక - అంటే బూర్జువా వర్గాన్ని పెత్తందారీ వర్గంగా ప్రతిష్టించటమేకాక - మరికొన్ని పనులు చేశారు. బూర్జువా రాజ్యాన్ని సృష్టించారు. బూర్జువా వర్గాన్ని జాతి ఆధిపత్య వర్గంగా నిలబెట్టారు. మరో మాటలో చెప్పాలంటే క్రొత్త రాజ్యానికి శాశ్వత పునాది కల్పించి, సువ్యవస్థిత ఆధునిక ఫ్రెంచి జాతిని సృష్టించారు".

రాజకీయ పోరాటమంటే శత్రువర్గాల మధ్య సంఘర్షణ మాత్రమేకాదని , దానిలో సంక్లిష్ట సంబంధాలు ఇమిడి ఉన్నాయని గ్రాంసీ భావన. అధికారంతో పాటు, దానికి జాతీయ ప్రజాసమ్మతి సృష్టించగల సైద్ధాంతిక యంత్రాంగాన్ని తయారు చేయటమే ఆధిపత్య భావనలోని కీలక అంశం. అనేక వర్గాలతో సంఘటన (Allianu) ను ఏర్పరచుకొని, ఆ సంఘటనకు ప్రజామద్దతు కూడ గట్టగలగటం, ఆ మద్దతుకు ఆధారంగా ఒక సైద్ధాంతిక, సామాజిక, పునాదిని సృష్టించగలగటం అవసరం. సంఘటన కేవలం కొన్ని వర్గాల మధ్య మాత్రమే ఏర్పడినా, ఆ సంఘటనను జాతీయ సంఘటనగా చూపి, ప్రజలందరి ఆమోదాన్ని పొందటం ద్వారా మాత్రమే, ఆధిపత్యం సాధ్యపడుతుందని గ్రాంసీ వాదించాడు.

ఇటలీలో 1930లలో పెల్లుబికిన సంక్షోభాన్ని గురించి వివరిస్తూ గ్రాంసీ ఈ విధంగా వ్రాశాడు : "సోషలిస్టులు ప్రజాతంత్ర అలయన్స్‌ను నిర్మించలేకపోవడం వల్లనే, బూర్జువా అధికారాన్ని అన్ని స్థాయిలలో ఎదిరించి జాతీయ ప్రజానాయకత్వాన్ని నిర్మించడం కోసం చొరవతీసుకోవడం వల్లనే ఫాసిజం వేరూనుకోగలిగిందని" గ్రాంసీ వాదించారు. కొత్తగా ముందుకొచ్చిన విప్లవకర బృందం బూర్జువా రాజ్యాధికారాన్ని సవాలు చేయడానికి గాని, భగ్నం చేయడానికిగాని ప్రయత్నించలేదు. సమాజం అంగీకరించదగిన రీతిలో తనవైన నైతిక, రాజకీయ, సాంస్కృతిక విలువలను నెలకొల్పడానికి కూడా ప్రయత్నించలేదు. "ఈ కోణంలోంచి చూస్తే, చివరికి సోషలిస్టులు కూడా బూర్జువా పరిధుల్లోనే పనిచేశారని చెప్పకతప్పదు. సోషలిస్టుల నుంచి ఆధిపత్య చొరవ లేకపోవడం వల్లనే, సంక్షోభాన్ని పెట్టుబడి తనకు అనుకూలంగా పరిష్కరించుకోగలిగింది." అని గ్రాంసీ అభిప్రాయపడ్డాడు.

## 10.3.2 కార్మిక వర్గ - చారిత్రక శిబిరంలో అలయన్స్‌లు :

గ్రాంసీ కాలపు ఇటలీ చాల అసమానంగా అభివృద్ధి చెందిన దేశం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఉత్తర ఇటలీకి, వ్యావసాయక దక్షిణభాగానికి మధ్య వ్యత్యాసాలు కొట్టొచ్చినట్లు కనిపించేవి. కార్మికవర్గానికి విస్తృతమైన గ్రామీణ పునాది ఉండేది. రైతాంగం ప్రధానంగా యధాతథవాద (Conservative) స్వభావం కలిగి ఉండేది. మతగురువులు, ఉపాధ్యాయులు తదితరుల విస్తృత 'సైన్యం' మద్దతు కలిగిన రోమన్ క్యాథలిక్ చర్చి కార్మిక, కర్షకులపై గట్టి ప్రభావం కలిగి ఉండేది. దీనికి తోడు కార్మిక వర్గ నాయకత్వంలో అత్యధికంగా మేధావులు ఉండేవారు.

ఈ సమానాభివృద్ధి, భావజాలం నేపథ్యంలో ఇటలీ బూర్జువా వర్గాన్ని సవాలు చేయాలంటే కమ్యూనిస్టులు దక్షిణాది రైతాంగం, ఉత్తరాది పారిశ్రామిక కార్మికుల మధ్య అలయన్స్ సాధించడం అవసరమని గ్రాంసీ వాదించారు :

పెట్టుబడిదారీ విధానానికి, బూర్జువా రాజ్యానికి వ్యతిరేకంగా మెజారిటీ శ్రామిక ప్రజానీకాన్ని సమీకరించడానికి తగిన అలయన్స్ వ్యవస్థను కార్మికవర్గం ఏమేరకు సృష్టించగలదో ఆ మేరకు అది నాయకత్వ, ఆధిక్యవర్గం కాగలుగుతుంది. ఇటలీలో, అక్కడ ఉన్న నిజమైన వర్గ సంబంధాల నేపథ్యంలో చెప్పాలంటే రైతాంగ ప్రజల సమ్మతిని సాధించడం మీద కార్మికవర్గం విజయం ఆధారపడుతుంది.

ఇది జరగాలంటే కార్మికవర్గం తన సొంత ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి ఆలోచించాల్సి ఉంటుంది. ఈ ప్రయోజనాలనే గ్రాంసీ 'కార్పొరేటిజం' అన్నారు. రాజకీయాల్లో ట్రేడ్ యూనియన్ మనస్తత్వం విఫలం కావడానికి ఇదే ముఖ్య కారణమని భావించారు. అవసరమైతే రైతాంగంతో, దక్షిణాది మేధావులతో అలయన్స్‌ను సంఘటితం చేసుకోవడం కోసం కార్మికవర్గం తన ప్రయోజనాలు కొన్నింటిన త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు.

సంఘటన (Alliance) లోని నాయకత్వ వర్గం, అనేక స్వీయ ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి, ఇతర ప్రజల పోరాటాలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడే, తన ఆధిపత్య చొరవను నిలబెట్టుకోగలుగుతుందని గ్రాంసీ నొక్కి చెప్పారు. "ఆధిపత్యం సంపాదించదలచుకున్న వర్గం మొత్తం జాతీయ శక్తి సామర్థ్యాల అభివృద్ధికి, సార్వత్రిక విస్తరణకు చలన (Motor) శక్తిగా రూపొందాలి'', "కార్మిక వర్గం ఆధిపత్యం సాధించటం కోసం తనను తాను జాతీయం చేసుకోవాలి'' అన్న గ్రాంసీ సూత్రీకరణలు చాలా ప్రధానమయినవి.

దోపిడికి గురవుతున్న ప్రజల సముద్ధరణ కోసమే సోషలిజం అన్న భావనను విడవడకుండా, అదే సమయంలో జాతీయ మెజారిటీ దృక్పథ భావనను ప్రధాన నినాదంగా ముందుకు తీసుకురావాలన్నది ఆయన ఉద్దేశ్యం. కార్మికవర్గ నియంతృత్వం అనే భావనలో ఇతర వర్గాలను చెదరగొట్టే అంశం నిబిడీకృతమై ఉందని, దానికి బదులుగా సమాజంలోని ఇతర ప్రధాన వర్గాలను - ఉదా : మధ్యతరగతి - కలుపుకొని ఉద్యమానికి జాతీయ దృక్పధాన్ని కలిగించే ప్రయత్నాన్ని చేయాలని గ్రాంసీ భావించారు. ఈ సామాజిక గమనంలో మూడు దశలుంటాయని గ్రాంసీ భావన. మొదటిది ఆదిమ ఆర్థిక చలనం. ఈ దశలో వివిధ బృందాల వృత్తి సంబంధమయిన ప్రయోజనాలే ప్రాముఖ్యం వహిస్తాయి. రాజకీయ ఆర్థిక చలనం రెండవదశ. ఈ దశలో వర్గ ప్రయోజనాలను గురించిన ఆర్థికపరమైన స్పృహ ఉంటుంది. ఆధిపత్యం దశ మూడవది. ఈ దశలో ఆర్థిక, రాజకీయ, మేధోపర ధ్యేయాల మధ్య ఐక్యత సాధించే సైద్ధాంతిక పోరాటం ప్రాముఖ్యం వహిస్తుంది. ఈ దశలో నాయకవర్గం ఇతర బృందాలతో, వర్గాలతో తన స్వీయ ప్రయోజనాల్ని సమన్వయం చేసుకోవలసి ఉంటుంది అని గ్రాంసీ భావించాడు.

## 10.4 పౌర సమాజం :

రాజ్యం పాలక వర్గం చేతిలో పనిముట్టు. పేద సమాజం చరిత్ర శోదకశక్తి అన్న మార్క్సు అభిప్రాయంతో గ్రాంసీ ఏకీభవించాడు. పౌర సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే ఆర్థిక అంశాలను దాటి చూడగలగాలని ప్రతిపాదించారు. గ్రాంసీ అభిప్రాయంలో; ఉపరితలంలో రెండు ప్రధాన స్థాయిలను మనం గుర్తించవచ్చు. ఒకటి పౌర సమాజం. ఇది మామూలుగా మనం 'వ్యక్తిగతం' (ప్రైవేటు) అని వ్యవహరించే సజీవ అంశాల సమాహారం. రెండవది, 'రాజకీయ సమాజం' లేక రాజ్యం.

ఈ రెండు స్థాయిలకు ఒక ప్రక్క మొత్తం సమాజం మీద ఆధిక్య బృందం అమలు జరిపే 'ఆధిపత్యం' విధితోనూ, మరోప్రక్క రాజ్యం ద్వారా 'చట్టబద్ధ' ప్రభుత్వం ద్వారా అమలు జరిగే 'ప్రత్యక్ష పెత్తనం' లేక కమాండ్‌తోనూ సంబంధం ఉంటుంది.

గ్రాంసీ అభిప్రాయంలో బూర్జువా అధికారం కేవలం బూర్జువా రాజ్యంలో కేంద్రీకృతం అయి ఉండదు. వాస్తవానికి, పౌర సమాజమే బూర్జువా అధికారానికి స్థిరమైన మూలాధారం. రాజ్యం రెండు విధాలుగా పనిచేస్తుందని గ్రాంసీ సూచించారు. ఒకటి పెత్తనం. అంటే దమన నీతి, భౌతికంగా బలవంతపెట్టడం. రెండవది సమ్మతి. ఇది వ్యక్తిగత జీవితాన్ని కనుబద్ధీకరించే సంస్థల ద్వారా, భావజాలం ద్వారా పనిచేస్తుంది. విస్తృత వైవిధ్యం కలిగిన సంస్థలు, రాజకీయాలతో సంబంధం లేవని భావించే సంస్థలు కలసి పౌర సమాజం అవుతుంది. పాఠశాల, కుటుంబం, మతం, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, ప్రసార సాధనాలు - ఈ సంస్థలకు ఉదాహరణలు, లోకోక్తులు, దైనందిన తర్కం (Commonsense Logice) లు కూడా పౌర సమాజంలో భాగమే. దీన్ని గ్రాంసీ "కామన్ సెన్స్" అని అన్నాడు. విజ్ఞానశాస్త్రాలు, కళలు, వృత్తిపర కార్యాచరణ, సౌందర్య (arsthetic) రూపాలు మొదలైనవన్నీ ఇందులో భాగం. అంటే, పరోక్షంగా ఈ రంగాలన్నీ రాజకీయ జోక్యానికి అనువైన రంగాలే అవుతాయి

పైకి చూడటానికి ఈ సంస్థలు రాజ్యం పరిధికి బయట ఉన్నట్లు, స్వయం ప్రతిపత్తితో పనిచేస్తున్నట్లు కన్పించినా, నిజానికి అవన్నీ కలిసి పౌర సమాజం అవుతాయి. ప్రధానంగా ఈ పౌర సమాజ సంస్థలలోనే ఆధిపత్య వర్గం నాయకత్వం నెరపుతుంది. తన అధికారానికి సమ్మతిని సాధిస్తుంది. ఏ ప్రభుత్వమయినా, చివరకు అతి నిరంకుశ ప్రభుత్వాలయినా, ఏదో ఒక మేరకు పౌర సమాజము సమ్మతిని న్యాయబద్ధతను సాధించి, ఆధిపత్యాన్ని పొందగలుగుతాయి. ఇది జరుగనినాడు ప్రభుత్వాల మనుగడ సాధ్యం కాదు.

## 10.5 మేధావులు :

"మేధావులు" అనే మాటకున్న సాధారణ అర్థాన్ని గ్రాంసీ అంగీకరించడు. "సమాజంలోని అన్ని రంగాలలోనూ సమీకర్తల (Orgamisors) పాత్రను నిర్వహించేవారు" మేధావులని గ్రాంసీ అభిప్రాయం. వీరు ఒక సాంఘిక బృందానికి విద్యా చైతన్యాన్ని అందించేవారుగా, పాలనా నిర్వాహకులుగా, నిర్దేశకులుగా, నాయకులుగా వ్యవహరిస్తూ ఉంటారు. ఆధిపత్యాన్ని సాధించటంలో, నిర్వహించటంలో, పునరుత్పత్తి చేయటంలో ఈ మేధావుల పాత్ర ఉంటుందని గ్రాంసీ వాదన.

చరిత్రలో నూతన సాంఘిక వర్గం ఆవిర్భవించిన ప్రతిసారీ క్రొత్త సమీకర్తల/మేధావుల బృందాలు రూపొందుతూ ఉంటాయి. తమ వృత్తినీ, ఉద్యోగాన్ని బట్టి కాకుండా, తాము సజీవ సంబంధం కలిగి ఉన్న వర్గం భావాలకు, ఆశయాలకు వారు నిర్దేశికత్వాన్ని అందిస్తూ, సజీవ మేధావులుగా గుర్తింపు పొందుతారు. ఉదాహరణకు పెట్టుబడిదారులు వారితోపాటు తమ కార్యకలాపాలకు నైతికత్వం, ఆధికృతను ఇవ్వగలిగిన మేధావులను కూడా ముందుకు తెస్తారు. ఈ మేధావులలో పారిశ్రామిక, సాంకేతిక నిపుణులు, మేనేజర్లు, రాజకీయ అర్థశాస్త్ర నిపుణులు, నూతన సంస్కృతిని, శాసన వ్యవస్థను, విద్యను, విజ్ఞానాన్ని సమర్థించే "సమీకర్తలను" కూడా ముందుకు తెస్తారు.

మేధావులు, లేదా సమీకర్తలు కేవలం పార్టీలలోనూ, యూనివర్శిటీలలోనో మాత్రమే ఉండరు. మానవునికి సంబంధించిన ప్రతిరంగంలోనూ వారు పనిచేస్తూ ఉంటారు. అయితే, మేధావులను తయారు చేసుకోవాలంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒకమేరకు ఉండే మేధాశక్తిని విమర్శనాత్మకంగా అభివృద్ధి చేయాలి. అయితే ఈ మేధావుల బృందం కాల్పనిక జగత్తులో బ్రతుకుతూ సిద్ధాంతాలను తయారుచేసేవారు మాత్రం కాకూడదు. వారి నిత్య జీవితంలో వారి నిర్దిష్ట

వర్గపు రోజువారి పని, దైనందిక అనుభవాలే వారి మేధస్సుకు ఆలంబనం కావాలి. గ్రాంసీ మాటలలో చెప్పాలంటే, "సాధారణ వాస్తవ కార్యాచరణలో ఒక భాగమయి భౌతిక, సాంఘిక ప్రపంచంలో నిరంతరం నూతన ఆవిష్కరణలకు దారితీసే శారీరక - మేధో (Moscular - nervous) కృషియే నూతన ప్రాపంచిక అవగాహనకు పునాదిగా ఉండేటట్లు జాగ్రత్త పడాలి". గ్రాంసీ మేధావి లక్షణం గురించి వివరిస్తూ ఈ విధంగా చెప్పాడు -

"మేధావి పని అంటే భాషణ చాతుర్యం కాదు. అది కేవలం పై తొడుగు. అప్పటికప్పుడు ఉద్వేగం, ఉద్రేకం కలిగిస్తుంది, అంతే. నూతన మేధావి వాస్తవ జీవితంలో --- నిర్మాతగా, సమీకర్తగా, శాశ్వత ప్రేరకుడిగా -- క్రియాశీలంగా పాల్గొనాలి. ఆవిధంగా టెక్నిక్ ఒకపని అనే స్థాయి నుండి టెక్నిక్ ఒక శాస్త్రం స్థాయికి ఎదుగుతుంది. చరిత్రపట్ల మానవవాద అవగాహన వృద్ధి చెందుతుంది. అలాంటి అవగాహన లేకపోతే ఆ మేధావి 'నిపుణుడి' గా మాత్రమే ఉండిపోతాడు : 'నిర్దేశకుడు' (నిపుణుడు, రాజకీయుడు రెండున్నూ) కాజాలడు". మేధావులను అభివృద్ధి చేసుకోవడం చాల కష్టమైనపని. దానిలో చాల ఇబ్బందులున్నాయి. కాని ఒక ఆధిపత్య విధానం స్థానంలో కొత్తది వచ్చి నిలబడాలంటే ఈ పని తప్పనిసరి. ఉన్న వ్యవస్థను సవాలు చేసి తన ఆధిపత్యం నిలపాలనుకునే వర్గం సాంప్రదాయ మేధావులలో కొన్ని బృందాలను "సైద్ధాంతికంగా గెలుచుకుని, తనలో ఇముడ్చుకోవాలి. ఆ వర్గం తన సొంత సజీవ మేధావులను ఎంత సమర్ధంగా అభివృద్ధి చేసుకోగలిగితే, అంత సమర్ధంగా సాంప్రదాయిక మేధావులను తనలో ఇముడ్చుకోగలుగుతుంది.

## 10.6 రాజకీయ పార్టీ :

రాజకీయ పార్టీపై గ్రాంసీ భావాలు అతని జైలు రచనలలోని "మోడరన్ ప్రిన్స్" అనే అధ్యాయంలో వివరించబడ్డాయి. గ్రాంసీ రచనలలో "రాజకీయపార్టీ" పై వెలిబుచ్చిన అభిప్రాయాలు అనిర్దిష్టంగా ఉంటాయి. కొందరి అభిప్రాయంలో గ్రాంసీ పార్టీ భావన లెనిన్ ప్రతిపాదించిన పార్టీ భావనకన్నా భిన్నంగా ఉన్నదని కొందరి అభిప్రాయం. వీరి ప్రకారం, గ్రాంసీ ప్రతిపాదించిన రాజకీయ పార్టీ నమూనాలో అగ్రగామి పార్టీ యొక్క కేంద్రీకృత ఆదేశాలు కాకుండా, కార్మికుల చైతన్యయుత విమర్శనాత్మక కార్యాచరణే విప్లవానికి చోధకశక్తిగా ఉంటుంది. అయితే, ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన టోగ్లియాటి అభిప్రాయంలో రాజకీయ పార్టీ పట్ల గ్రాంసీ వెలిబుచ్చిన భావన, లెనిన్ ప్రతిపాదించిన భావన ఒకటే.

గ్రాంసీని లోతుగా అధ్యయనం చేసినవారు పై రెండు అభిప్రాయాలు సమంజసమైనవేనని భావించారు. 1919 - 20 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ కాలంలో గ్రాంసీ స్థానిక స్వయంపాలన కోసం, అట్టడుగు నుంచి ప్రజల మధ్య విమర్శనాత్మక చర్చ కోసం సరైన సంస్థా రూపాలు ఉండాలని భావించాడు. 1921 - 24 సంవత్సరాలలో, కౌన్సిళ్ళ ఉద్యమం ఓడిపోయిన తర్వాత, గ్రాంసీ కేంద్రీకృత పార్టీ నిర్మాణం, సైద్ధాంతిక మార్గదర్శకత్వం అనే భావనను సమర్థించారు. ఆ తర్వాత గ్రాంసీ జైలు జీవితం గడుపుతున్నపుడు, ఆయన భావాలలో మరికొన్ని మార్పులు వచ్చినవి. రాజకీయ పార్టీపై స్థూలంగా గ్రాంసీ అభిప్రాయాలు క్రింద వివరించబడ్డాయి.

1) ప్రధాన చారిత్రక ఉద్యమాలలోనూ, దైనందిన పోరాటాలలోనూ నైతిక రాజకీయ విప్లవానికి మార్గాన్ని సుగమనం చేయటమే రాజకీయ పార్టీ కర్తవ్యం.
2) హేతుబద్ధంగా, సృజనాత్మకంగా ప్రజాచైతన్యాన్ని మేల్కొలిపి, జాతిని ఏకం చేయటమే పార్టీ కర్తవ్యం.
3) పార్టీ కార్మిక రాజ్యానికి పునాదులు వేయగలిగిన రాజకీయ హేతుబద్ధతను సమీకరించే శక్తి.

4) పార్టీలో మూడు శ్రేణులుంటాయి. అవి 1) విడివిడిగా ఉన్న సాధారణ సగటు సభ్యులు. 2) సూత్రబద్ధమైన సుసంఘటితమైన శ్రేణి. 3) ఈ రెంటికి మధ్యనుండే శ్రేణి. మిగిలిన రెండు శ్రేణుల మధ్య సంబంధాన్ని ఏర్పాటుచేసి, ఈ శ్రేణి వాటికొక రూప మిస్తుంది.

## 10.7 నిష్క్రియా విప్లవం :

దీనినే విప్లవరహిత విప్లవం అని కూడా అంటారు. ఏదైనా ఒక వర్గం లేదా కొన్ని వర్గాలు సామాజిక మార్పును కోరి ఉద్యమిస్తాయి. వ్యూహాత్మకంగా, ఎత్తుగడల రూపంగా అవి విజయవంతమయి ఆశించిన మార్పును తేగలిగితే అది విప్లవం. వ్యూహాత్మకమైన తప్పిదాల వలన గాని, ఇతర కారణాల వలన గాని సమాజంలో ఆశించిన మార్పు రాకపోగా, ఆ అవకాశాన్ని వర్గశత్రువులు తమకు అనుకూలంగా మార్చుకుంటే అది నిష్క్రియా విప్లవం. మరో మటలో చెప్పాలంటే విప్లవ ఫలితాన్ని వర్గశత్రువు అనుభవించటం, ఉత్పత్తి సంబంధాలను తనకు అనుకూలంగా మార్చుకోవటం - ఈ ప్రక్రియలో విల్లవానికి బోధకశక్తులైన వర్గాలు నష్టపోవటం. సమకాలీన యూరప్ చరిత్ర నుండి అనేక ఉదాహరణలను ఇస్తూ గ్రాంసీ “నిష్క్రియా విప్లవ” భావనను వివరించాడు.

## 10.8 సారాంశం :

కేవలం 46 సం॥లు మాత్రమే జీవించినప్పటికిని మార్క్సిజాన్ని మరింత పరిపుష్టం చేయటానికి శ్రమించిన వ్యక్తి ఆంటోనియో గ్రాంసీ. ఆచరణలోనూ, మేధాసంపత్తిలోనూ వైవిధ్యాన్ని చూపించగలిగాడు. గ్రాంసీ ప్రతిపాదించిన భావనలో అందరి దృష్టిని ఆకర్షించిన భావన ఆధిపత్య భావన. కార్మిక వర్గం అధికారాన్ని తన చేతుల్యోకి తెచ్చుకునే క్రమంలో, సమకాలీన సమాజంలోని అన్ని వర్గాలపై భావజాల ఆధిపత్యాన్ని కూడా సంపాదించి ప్రయత్నం చేయాలన్నది ఆ భావన సారాంశం. అదే విధంగా ఫ్యాక్టరీల మీద కూడా ఆయన లోతైన భావాలను వ్యక్తపరిచారు.

## 10.9 మాదిరి ప్రశ్నలు :

1) మార్క్సిస్టు సిద్ధాంతానికి గ్రాంసీ చేసిన సేవను వివరించండి.
2) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు, ఆధిపత్యం, రాజకీయ పార్టీ భావనలపై గ్రాంసీ అభిప్రాయాలను వ్రాయండి.

## 10.10 చదువదగిన గ్రంథాలు :

1) James Joll, Gramsci.
2) సుశీతారు, ఆంటోనియో గ్రాంసీ, జీవితం, కృషి.

పాఠం - 11

# మార్కెట్ సోషలిజం - డేవిడ్ మిల్లర్

# MARKET SOCIALISM - DAVID MILLER

పాఠ్య నిర్మాణ క్రమం:


11.0. లక్ష్యం

11.1. డేవిడ్ మిల్లర్ - జీవిత విశేషాలు

11.2. మార్కెట్ సోషలిజం-పరిచయం

11.3. స్వేచ్ఛావాద తత్వశాస్త్రం-విమర్శ

11.3.1. స్వేచ్ఛ

11.3.2. విధానపరమైన న్యాయం

11.3.3. మార్కెట్ న్యూటాలిటి (తటస్థిత)

11.3.4. పరోపకారం మరియు సంక్షేమం

11.4. మార్కెట్ల రక్షణ

11.4.1. వినియోగదారుల సార్వభౌమాధికారం

11.4.2. పంపిణీ న్యాయం

11.4.3. దోపిడి

11.4.4. పరాయీకరణ మరియు సంక్షేమం

11.5. ది పొలిటిక్స్ ఆఫ్ డెమోక్రటిక్ సోషలిజం

11.6. మార్కెట్ సోషలిజం

11.6.1. మార్పుకు ప్రతిఘటన

11.6.2. మార్కెట్ సోషలిస్ట్ దృక్పథం

**11.6.3. మార్కెట్ పరిరక్షణ**

**11.6.4. మార్కెట్ సోషలిజం - సాధ్యత**

**11.6.5. లోటుపాట్లు**

**11.7. ముగింపు**

**11.8. మాదిరి పరీక్ష ప్రశ్నలు**

**11.9. ఆచూకి గ్రంథాలు**

## 11.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశ అధ్యయనం వలన మార్కెట్ సోషలిజం అనగా ఆర్థిక వ్యవస్థలో ముడిపడి ఉన్న రాజకీయ విశ్లేషణలు మరియు సంక్షేమ ప్రభుత్వాలు సామాజిక అసమానతలను తగ్గించడానికి మార్కెట్ వ్యవస్థలను వినియోగదారులకు ఏవిధంగా భాగస్వామ్యాన్ని కల్పించాలనే విషయాలను తెలుసుకొనవచ్చును.

## 11.1. డేవిడ్ మిల్లర్ - జీవిత విశేషాలు:

డేవిడ్ లెస్లీ మిల్లర్ మార్చి 8, 1946వ సంవత్సరంలో బ్రిటన్ నందు జన్మించాడు. తను ఆంగ్ల రాజనీతి సిద్ధాంత కర్త. మిల్లర్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో పొలిటికల్ థియరి ప్రొఫెసర్‌గా మరియు ఆక్స్‌ఫర్డ్ నఫీల్డ్ కాలేజ్‌లో అఫీషియల్ ఫెలోగా పనిచేస్తున్నారు. అతను కేంబ్రిడ్జి విశ్వవిద్యాయలయం నుండి డిగ్రీని మరియు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ ఫిలాసఫీ మరియు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీలను పొందారు. ఇతని రచనలలో సామాజిక న్యాయం, జాతీయత, పౌరసత్వం మరియు జాతీయ గుర్తింపు వంటివి ప్రముఖమైనవి. మిల్లర్ నిరాడంబరమైన జాతీయవాదానికి మద్దతునిచ్చిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందారు.

డేవిడ్ మిల్లర్ తన సామాజిక న్యాయ సూత్రాలలో బహుత్వ సామాజిక న్యాయవాదాన్ని ప్రతిపాదిస్తారు. న్యాయానికి ఒక కొలమానం ఉండదని వాదించాడు. ఇతని భావాలు రాబర్ట్ నోజిక్ మరియు రాల్స్ వంటి సిద్ధాంతకర్తలకు వ్యతిరేకంగా ఉంటుంది.

డేవిడ్ మిల్లర్ తన ప్రధాన గ్రంథం అయిన "మార్కెట్, స్టేట్ అండ్ సొసైటీ" నందు మార్కెట్ సోషలిజం యొక్క సైద్ధాంతిక పునాదాలను విశ్లేషించడం జరిగినది. ఇది మార్కెట్ సోషలిజంనకు సైద్ధాంతిక రక్షణను కల్పిస్తుంది. సాంప్రదాయ పెట్టుబడిదారి విధానం మరియు సాంప్రదాయ సోషలిజం మధ్య మూడవ మార్గంగా దీనిని పేర్కొన్నారు. ఇది మార్కెట్ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిపై సామాజిక నియంత్రణ మరియు కార్యాలయాలపై ఉద్యోగుల నియంత్రణతో మిళితం చేస్తుంది.

## 11.2. మార్కెట్ సోషలిజం-పరిచయం:

మార్కెట్ సోషలిజం అనేది స్వేచ్ఛావాద హక్కు యొక్క స్వేచ్ఛా మార్కెట్ ఆలోచన మరియు అనేక మంది సోషలిస్టుల గణాంక ఆలోచనలకు ప్రత్యామ్నాయం. ఇది మార్కెట్ల స్వేచ్ఛ మరియు సామర్థ్య ప్రయోజనాలను మరింత ప్రజాస్వామ్యబద్ధమైన పనిగా మరియు వనరుల సమాన పంపిణీతో కలపడం లక్ష్యంగా పెట్టుకుంది. సహకార సంస్థలు ఉత్పత్తిని నిర్వహించడానికి సమర్థవంతమైన మార్గంగా ఉంటాయి. వాటికి మూలధనాన్ని సరఫరా చేయడానికి తగిన పెట్టుబడి ఏజెన్సీలను సృష్టించవచ్చు.

మార్కెట్ సోషలిజం మొదటి భాగం అంతా స్వేచ్ఛా-మార్కెట్ పెట్టుబడిదారి విధానాన్ని రక్షించడానికి ఉపయోగించే స్వేచ్ఛావాద తత్వశాస్త్రం యొక్క విమర్శను అందిస్తుంది. సంక్షేమ రాజ్యానికి ప్రత్యామ్నాయంగా స్వేచ్ఛ, న్యాయం, మార్కెట్ల తటస్థత మరియు ప్రైవేటు స్వచ్ఛంద సమస్యలపై దృష్టి సారిస్తుంది. రెండవ భాగం సోషలిస్టు విమర్శలకు వ్యతిరేఖంగా మార్కెట్లను కాపాడుతుంది. వినియోగదారులు సాధారణంగా వారి స్వంత సంక్షేమానికి ఉత్తమ న్యాయనిర్ణేతలు అని ఇక్కడ చూపబడింది. మూడవ భాగం సోషలిస్ట్ రాజ్యం యొక్క నమూనాను అభివృద్ధి చేస్తుంది. పౌరసత్వం యొక్క ప్రాతిపదికగా జాతీయ సమాజం యొక్క ఆలోచనలను, పౌరుల మధ్య సంభాషణ యొక్కఒక రూపంగా రాజకీయాలు, సాంస్కృతిక మైనారిటీలను ఆవరించిన సంఘంగా ఏకీకృతం చేయడం మరియు మెజారిటీ పాలనపై రాజ్యాంగ పరిమితులను సమర్థించడం వంటి అంశాలను ఇక్కడ చర్చించడం జరిగినది.

## 11.3. స్వేచ్ఛావాద తత్వశాస్త్రం-విమర్శ:

ఇందులో మొదటగా మార్కెట్ పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించడానికి ఉపయోగించే స్వేచ్ఛావాద తత్వశాస్త్రం యొక్క విమర్శను పరిశీలిద్దాం. సంక్షేమ రాజ్యానికి ప్రత్యామ్నాయంగా స్వేచ్ఛ, న్యాయం, మార్కెట్ల తటస్థత మరియు ప్రైవేట్ స్వచ్ఛంధ సమస్యలపై దృష్టి సారించే విషయాలను విమర్శనాత్మకంగా చర్చిద్దాం.

### 11.3.1. స్వేచ్ఛ:

స్వేచ్ఛావాదులు ప్రతికూల స్వేచ్ఛ యొక్క ఇరుకైన సంస్కరణను సమర్థిస్తారు.హేయక్ స్వేచ్ఛను వ్యక్తిపై బలప్రయోగం లేకపోవడం అని నిర్వచించాడు. అయితే ఇతని వాదన అసంపూర్ణంగా చూపబడింది. సాధారణ అభిప్రాయంలో చట్టాలు మరియు ఉద్దేశపూర్వకంగా విధించబడిన ఇతర అడ్డంకులు స్వేచ్ఛను పరిమితం చేస్తాయి. అయితే ఆర్థిక అవకాశాల కొరత ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

### 11.3.2. విధానపరమైన న్యాయం:

నోజిక్ మరియు హేయక్ వంటి స్వేచ్ఛావాదులు న్యాయాన్ని విధానపరమైన అంశంగా నిర్వచించారు. నోజిక్ ఆస్థికి సంబంధించి ఉదారవాద భావాలను సమర్థించాడు. అలాగే జాన్‌లాక్ చెప్పినటువంటి స్వంత ఆస్థి సిద్ధాంతంపై ఆధారపడి తన భావాలను వివరించాడు. ఇదేవిధంగా హేయక్ నియమాల మార్గనిర్దేశనంను న్యాయంగా భావించారు. కానీ నియమాల ఎంపికకు ఏది మార్గనిర్దేశం చేయాలో సంతృప్తికరంగా వివరించడంలో విఫలయయ్యాడు. చివరగా,

సామాజిక న్యాయం యొక్క ఆలోచన అనేక స్వేచ్ఛావాద అభ్యంతరాలకు వ్యతిరేఖంగా సమర్ధించబడినది.

**11.3.3. మార్కెట్ న్యూట్రాలిటి (తటస్థత):**

మంచి జీవితం, వ్యక్తిగత భావనల మధ్య రాజ్యం తటస్థంగా ఉండాలని ఉదారవాదులు తరచుగా పేర్కొంటారు మరియు ఆర్థిక మార్కెట్లను రక్షించడానికి ఈ వాదనను ఉపయోగిస్తారు. తటస్థత అనేది సంస్థలు మరియు విధానాలకు అందించబడిన కారణాలను లేదా వాటి ప్రభావాలను సూచిస్తుంది. ఇక్కడ సమర్ధించబడిన అభిప్రాయం ఏంటంటే సంస్థాగత రూపకల్పన తటస్థంగా ఉంటుంది. పెట్టుబడిదారి సంస్థలలో మార్కెట్‌లో పోటీపడుతున్న సహకార సంస్థలు తమ సభ్యులు ఎదుర్కొంటున్న ప్రోత్సాహకాలు లేమి కారణంగా తగినంత పెట్టుబడిని సమకూర్చుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి ఇవి తటస్థతను పొందాలంటే నాన్-కమోడిటి ఆధారిత భావనలకు మద్ధతిచ్చే ప్రభుత్వ సంస్థల వలననే మార్కెట్ సమతుల్యతను సాధించవచ్చు.

**11.3.4. పరోపకారం మరియు సంక్షేమం:**

పేదల పట్ల పరోపకార చింతన సంక్షేమ రాజ్యం ద్వారా కాకుండా ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించాలని స్వేచ్ఛావాదాలు వాదించారు. అయితే పరోపకారం అనేది ఒక సంక్లిష్ట భావన. ఇది ప్రాధాన్యతలను సంతృప్తి పరచడానికి లేదా అవసరాలను తీర్చడానికి నిర్ధేశించబడుతుంది అనేది. ఇప్పటికి కూడా ఒక్క ప్రశ్నగానే మిగిలి ఉంది. ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలు కొన్ని ఇతరులు అందించే సహకారాల మీద ఆధారపడి వారు సహాయం చేసినంత కాలం మాత్రమే ఇతరులకు సహకారం అందిస్తుంది. అలాగే సంక్షేమ రాజ్యాలు ఇతరుల మీద ఆధారపడకుండా ప్రజల కష్టాలను తీర్చే మార్గంగా వారికి సహకారాలను అందిస్తుంది. కాబట్టి స్వచ్ఛంద సంస్థల కంటే కూడా సంక్షేమ రాజ్యాన్ని ఆమోదించడమే సమాజానికి సరియైనదిగా భావించబడింది.

## 11.4. మార్కెట్ల రక్షణ:

ఈ భాగంలో సోషలిస్టు విమర్శలకు వ్యతిరేకంగా మార్కెట్లను కాపాడుతుంది. వినియోగదారులు సాధారణంగా వారి స్వంత సంక్షేమానికి ఉత్తమ న్యాయనిర్ణేతలని, ప్రజలు వారి మార్కెట్ రసీదులకు అర్హులని, దోపిడి అనేది మార్కెట్ లావాదేవీల యొక్క స్వాభావిక లక్షణం కాదని మరియు మార్కెట్ అనేది రాజకీయ నియంత్రణకు లోబడి ఉంటే పరాయీకరణను అధిగమించవచ్చని ఇక్కడ చూపబడింది. కొన్ని అంశాలను మార్కెట్ సంరక్షణకు సంబంధించి ప్రస్తావించడం జరిగినది.

**11.4.1. వినియోగదారుల సార్వభౌమాధికారం:**

వినియోగదారుల కోరికలను సంతృప్తిపరచడానికి మేము కలిగి ఉన్న అత్యంత ప్రభావవంతమైన యంత్రాగం అనే కారణంతో ఆర్థిక మార్కెట్లు తరచుగా సమర్ధించబడతాయి. కానీ మార్కెట్లు తరచుగా కోరికలను ఉత్పన్నం చేయడం ద్వారా ఈ మార్కెట్ రక్షణ అనేది తగ్గించబడవచ్చు. ఈ అధ్యయనం వివిధ మార్గాలను అన్వేషిస్తుంది. దీనిలో ప్రజల కోరికలు వారి సంక్షేమం ధృక్కోణం నుండి సరైనవి కావు మరియు ఇది జరగకుండా నిరోధించడానికి రాజకీయంగా

జోక్యం చేసుకునే ప్రయత్నాలు విజయవంతం కావు. ఉత్పత్తి కోరికల కంటే అవసరాలకు ప్రతిస్పందించాలనే వాదన కూడా పరిగణించబడుతుంది.

### 11.4.2. పంపిణీ న్యాయం:

కారెన్స్ వంటి కొంతమంది సమతావాదులు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పంపిణీ న్యాయం యొక్క ప్రమాణాలకు అనుగుణంగా ఫలితాలను ఇవ్వగలదా అని ప్రశ్నించడం జరిగినది. అదేవిధంగా మార్కెట్‌లు ఉత్పత్తిని నియంత్రించాలి కానీ పంపిణీని కాదని ప్రతిపాదించారు. ఉత్పత్తిదారులను ప్రేరేపించడానికి నైతిక ప్రోత్సాహకాలపై ఆధారపడతారు. కానీ ఇది అవాస్తవంగా కనిపిస్తుంది. బదులుగా, వారి ఉత్పాదక సహకారం ద్వారా కొలవబడినట్లుగా, తగిన విధంగా రూపొందించబడిన మార్కెట్ ప్రజలు కోరుకున్న ఆదాయాన్ని ఇవ్వగలదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ ప్రతిపాదనకు వివిధ సవాళ్ళను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా 'ఎకనమిక్ డిసర్ట్' అనే భావనను విశదీకరించడం జరిగింది.

### 11.4.3. దోపిడి:

మార్కెట్‌ల ఏర్పాటులో ఇతర వ్యక్తులు ప్రయోజనాలు పొందే కోణంలో దోపిడి ఏవిధంగా జరుగుతుంది అనే దృష్టి కోణం నుండి విలువ యొక్క ఏకపక్ష బదిలీల పరంగా మార్క్స్ దోపిడీని అర్థం చేసుకున్నాడు. స్టెయినర్ మరియు రోమర్ వనరుల అన్యాయమైన పంపిణీ నేపథ్యానికి వ్యతిరేఖంగా చేసిన ధరల మార్పిడి పరంగా దీనిని అర్థం చేసుకున్నారు. ఈ అభిప్రాయాలకు విరుద్ధంగా, దోపిడీ లావాదేవీలు అనేది సమతౌల్య ధరల వద్ద జరిగే మార్పిడి అని వాదించబడింది. సమాచారం యొక్క అసమానత మరియు బేరసారాల శక్తి కారణంగా, దోపిడీకి సంబంధించిన ఈ ధృక్పథం పెట్టుబడిదారి విధానం అంతర్లీనంగా ఎందుకు దోపిడీ చేస్తుందో అర్థం చేసుకోవడానికి అనుమతిస్తుంది. అయితే, మార్కెట్ సోషలిజంలో, దోపిడి నిర్దిష్ట పరిస్థితులలో మాత్రమే జరుగుతుంది.

### 11.4.4. పరాయీకరణ మరియు సంక్షేమం:

సోషలిస్టులు మతపరమైన అంశాలను కాకుండా వ్యక్తిగత సంబంధాలను సృష్టించే కారణంగా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలపై దాడి చేశారు. మార్క్స్ యొక్క పరాయీకరణ సిద్ధాంతాన్ని ప్రాధాన సూచనగా తీసుకుని, మార్కెట్‌కు ప్రత్యేకమైన వనరులను వేరుచేస్తూ పరాయీకరణకు సంబంధించిన వివిధ సంభావ్య వనరులను అన్వేషిస్తుంది. ఏది ఏమైనప్పటికీ పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో వ్యక్తులు అనుభవించిన సామాజిక అసమానతల నుండి విముక్తి పొందడం కోసం పెట్టుబడిదారి విధానాన్ని మార్క్స్ ప్రశంసించారు. మార్కెట్ సోషలిజంలో, ఆర్థిక సంబంధాలు ధ్వంధ్వ పాత్రను కలిగి ఉంటాయి. ఉత్పత్తి పరికరాలు, పోటీతత్వం ఒక స్థాయిలో ఉంటే మానవ సహకారం మరియు ప్రణాళికలు రెండవ స్థాయిలో ఉంటాయి. వీటి ద్వారా పరాయీకరణను అధిగమించవచ్చు.

## 11.5. ది పాలిటిక్స్ ఆఫ్ డెమోక్రటిక్ సోషలిజం:

ఈ భాగంలో సోషలిస్ట్ రాజ్యం యొక్క నమూనాను విశ్లేషించడం జరిగింది. పౌరసత్వం యొక్క ప్రాతిపదికగా

జాతీయ సమాజం యొక్క ఆలోచనలను, పౌరుల మధ్య జరిగే సంభాషణల రూపమే రాజకీయాలుగా, భిన్నమైన సంస్కృతులు కలిగిన వారిని, మైనార్టీలను ఒక సంఘంగా ఏకీకృతం చేయడం మెజారిటీ పాలనపై రాజ్యాంగ పరిమితులను సమర్ధించడం. మునపటి అధ్యయనాలలో వివరించిన వ్యవస్థ యొక్క రాజకీయ ఔన్నత్యాన్ని సమర్ధించడం వంటి అంశాలను విశదీకరించడము. ఈ భాగము నందు మనం చూడవచ్చు. వీటికి అనుగుణంగా కొన్ని అంశాలను ఇక్కడ పరిశీలించడం జరిగినది.

## 11.6. మార్కెట్ సోషలిజం:

మార్కెట్ సోషలిజం అనేది ఒక ఆర్థిక వ్యవస్థ. దీనిలో ఉత్పత్తి సాధనాలు స్వంతంగా లేదా ప్రణాళికబద్ధంగా రూపకల్పన చేయబడవు. కేవలం మార్కెట్ ద్వారానే మధ్య వర్తిత్వం వహించబడతాయి. ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనలు రాజ్యం మరియు ప్రజలు ఇరువురూ కలిగి ఉంటారు. కాబట్టి ఇక్కడ సహకార పంపిణీ వ్యవస్థ ఉంటుంది. మార్కెట్ నిర్మాణం అనేది పంపిణీ లాభాలను ఎలా పంపిణీ చేయబడాలో నిర్ణయిస్తుంది. ఉద్యోగులకు వేతనంగా, సమాజానికి ప్రయోజనకరంగా మరియు సాధారణ ప్రజలకు సామాజిక డివిడెండ్లుగా లాభాలను పంచడం జరుగుతుంది.

### 11.6.1. మార్పుకు ప్రతిఘటన:

మార్పుకు నయా ఉదారవాదం యొక్క ప్రతిఘటన కేవలం ఆర్థిక రంగాన్ని మాత్రమే కాకుండా, ఎన్నికల రాజకీయాలు, విద్యారంగం మరియు మీడియాను కూడా విస్తరించింది. ఇవి ప్రజల అవగాహనపై ప్రభావం చూపుతాయి. క్యాపిటల్ గ్లోబలైజేషన్ ఫలితంగా జాతీయ రాష్ట్రీయ పాలక వర్గాలు బలహీనపడటం జరిగినది. మార్పును ప్రభావితం చేయగల ఎన్నికల వ్యవస్థ సామర్థ్యాన్ని పరిమితం చేయడం, పాలక, రాజకీయ వర్గాలకు వెలుపల మరొక ప్రత్యామ్నాయాన్ని గుర్తించడంలో వామపక్షాలు సఫలం కాకపోవడం, కార్మిక ఉద్యమాలు క్షీణించడం, సాంప్రదాయ కార్మిక వర్గం తన ఉనికిని కోల్పోవడం వంటి చర్యల వలన సోషలిస్టు ఉద్యమాలు తమ ప్రభావాన్ని కోల్పోయే విధంగా మార్కెట్ సోషలిస్ట్ సూత్రాలు ఉండటం చేత ఈ మార్కెట్ సోషలిస్టు సూత్రాలను ప్రక్కకు నెట్టడం జరిగింది. ప్రస్తుత పొదుపు విధానాలు మరియు పెరుగుతున్న నిరుద్యోగంతో, మార్కెట్ సోషలిజం సూత్రాలను పునరుద్ధరించడానికి ఇది మంచి సమయం. ఇటువంటి విధానాలు కొన్ని నష్టాలను కలిగి ఉన్నప్పటికీ, వాటికి కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

### 11.6.2. మార్కెట్ సోషలిస్ట్ దృక్పథం:

బ్రిటీష్ రాజకీయ శాస్త్రవేత్తలు జూలియన్ లేగ్రాండ్ మరియు డేవిడ్ మిల్లర్ ప్రకారం మూలధన యాజమానాన్ని సాంఘీకీరించేటప్పుడు మార్కెట్ సోషలిజం మార్కెట్ మెకానిజంను సంరక్షిస్తుంది. ఈ సామాజిక ప్రజాస్వామ్య విధానం యొక్క ముఖ్య సిద్ధాంతం ఏమిటంటే, మార్కెట్లు సమర్ధతను మాత్రమే కాకుండా స్వేచ్ఛ మరియు ప్రజాస్వామ్యాన్ని కూడా పెంచుతాయి. వాటిని రాజకీయంగా ఆకర్షణీయంగా చేస్తాయి.

'సామాజిక యాజమాన్యం' అనేక రకాలుగా నిర్వచించబడుతుంది. వ్యక్తుల సమూహం యాజమాన్యానికి అత్యంత అనుకూలమైనది. ఉద్యోగుల స్వంత ఉత్పత్తి పరికరాలను మరియు వ్యాపారాలను కలిగి ఉండకుండా ఉండే పరిస్థితిని ఉద్యోగులు పెట్టుబడిదారీ విధానంగా నిర్వచించాడు.

సంస్థలు తమ ఆస్తులను అనేక వైవిధ్యాలలో ఉపయోగించుకునే మరియు లాభం పొందే హక్కులను కలిగి ఉంటాయి. అయితే పెట్టుబడి వ్యవస్థలు మూలధనాన్ని కలిగి ఉంటాయి. మరియు వ్యూహాత్మక నిర్వహణ నిర్ణయాలు తీసుకుంటాయి. అయితే ప్రతి వ్యాపారానికి ప్రజాస్వామ్య రూపం ఉంటుంది. మరియు వాటిలో ఒకటి ఉద్యోగుల నియంత్రణలో ఉంటుంది. ప్రజా భాధ్యతలో స్పష్టంగా లేని కంపెనీలు మార్కెట్ సోషలిజం వ్యూహం ఫలితంగా సాంఘీకరించబడతాయి. ప్రస్తుతం బ్యాంకింగ్, ఇంధనం మరియు రైలు రవాణా పరిశ్రమలు ఇందుకు ఉదాహరణలు.

వృద్ధి మరియు ఉపాధిని పునరుద్ధరించడానికి, పెట్టుబడిదారీ చట్రంలో ఆర్థిక సంస్కరణలను అమలు చేయవచ్చు. ఇది ప్రజల నియంత్రణకు పెంచే సవాచనాత్మక ప్రణాళికల రకాలను ప్రవేశపెట్టడానికి వీలు కల్పిస్తుంది.

### 11.6.3. మార్కెట్ పరిరక్షణ:

ఆస్థిని పంచుకునేటప్పుడు, ఈ విధానం మార్కెట్ క్యాపిటలిజం యొక్క ఆకర్షణను చాలా వరకు ఉంచుతుంది. మరియు స్పష్టమైన సోషలిస్ట్ లోపాలను తగ్గిస్తుంది. సామ్యవాద నీతి సూక్ష్మంగా వ్యాప్తి చెందడం వల్ల ఉత్పాదక కంపెనీల ప్రస్తుత మార్కెట్ లింకులను నిలుపుకోవడంలో ఈ ప్రతిపాదనకు ప్రయోజనం ఉంది.

జేమ్స్ యాంకర్ అనే అమెరికన్ ఆర్థిక వేత్త ఈ ఆలోచనా విధానాన్ని స్థాపించారు. ప్రస్తుత వినియోగదారుల సంస్కృతిని కొనసాగిస్తూనే 'వ్యావహారిక మార్కెట్ సోషలిజం' అసమానతను ఎలా తగ్గిస్తుంది అని ఆయన నొక్కి చెప్పారు. కొంతమంది పెట్టుబడిదారులు, ప్రస్తుత లేదా మాజీ వ్యవస్థాపకులు అయినా, వారి ప్రయత్నాలకు ప్రతిఫలంగా లాభానికి చట్టపరమైన హక్కు ఉందని అతను గుర్తించాడు. ఏది ఏమైనప్పటికీ అత్యంత భారీ మూలధన సంపదలు అనేవి, వారసత్వం మరియు ఆర్థిక మూలధన మార్కెట్ ఊహాగానాలకు సంబంధించిన అక్రమ ప్రతిఫలం. ఇటువంటి ఆదాయాలు ఆర్థికంగా అవసరం కానీ నైతికంగా అవసరం లేదు. ఇతని అభిప్రాయం ప్రకారం స్థాపించబడిన ప్రతి పెద్ద వ్యాపార సంస్థలు అన్ని కూడా ప్రజల యాజమాన్యంలో ఉండాలి.

### 11.6.4. మార్కెట్ సోషలిజం - సాధ్యత:

మార్కెట్ పోటీతత్వం ఫలితంగా లాభాలు లేదా దివాలా తీయడం కొనసాగుతుంది. మూలధన ఆస్తుల కేటాయింపులో సమానత్వ స్థాయిని పెంచడమే లక్ష్యంగా మార్కెట్ సోషలిజం పనిచేస్తుంది. మూలధన ఆస్థి నుండి వచ్చే ఆదాయం మరియు దాని అసమాన పంపిణీ నైతిక బాధ్యత ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. రాజకీయ తత్వవేత్త క్రిష్టోఫర్ ఫియర్సన్‌తో సహా చాలామంది వ్యక్తులు 'మార్కెట్ సోషలిజం' యొక్క సాధ్యత సోషలిస్ట్ ఎజెండా యొక్క పరిధిని మరియు స్వచ్ఛతను కోల్పోతుందని నమ్ముతారు. ఆర్థిక వ్యవస్థ సాంఘీకరించబడవచ్చు మరియు అమలు చేయవచ్చు. ఫలితంగా కృత్రిమ సమాజం ఏర్పడుతుంది.

### 11.6.5. లోటుపాట్లు:

అంతిమ లక్ష్యంగా చూసినప్పుడు మార్కెట్ సోషలిజంలో చాలా లోపాలు ఉన్నాయి. పోటీతత్వం మరియు లాభదాయకత యొక్క పెట్టుబడిదారీ ఆదర్శాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి మరియు సామాజిక యాజమాన్యం ద్వారా తీసుకువచ్చిన సోషలిస్టు లక్షణాలు ఓడిపోవచ్చు. ఇటువంటి కార్యక్రమాలు సోషలిస్ట్ ఓవర్‌లోడ్‌లతో కూడిన ఒక రకమైన ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ విధానం కావచ్చు. వామపక్షాలలో చాలా మంది అసమానత స్థాయిలను తిరస్కరించారు. మార్కెట్ సోషలిస్ట్‌లు హైబ్రిడ్ ఆర్థిక నిర్మాణం కోసం తమ ప్రణాళికలను సరళీకృతం చేసే అవకాశం ఉంది. మార్కెట్ సామర్థ్యాన్ని కోరుకునే స్వయం ప్రతిపత్తి వ్యాపారాలకు ప్రోత్సాహకాలు అవసరమవుతాయి మరియు వాటి విజయం లాభం పరంగా కొలవబడుతుంది. ఫలితంగా అసమానతలు ఏర్పడటమే కాకుండా సోషలిస్ట్ విలువలకు కూడా ముప్పు వాటిల్లుతుంది. ప్రజా యాజమాన్యం విషయంలో కూడా, మార్కెట్ శక్తులు ఆర్థిక అస్థిరతను కలిగిస్తాయి. పేదల ఖర్చుతో సంపన్నులు ప్రయోజనం పొందుతారు.

ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో మార్కెట్‌ను కూడా అర్థం చేసుకోవాలి. ఇది దేశాల వారీగా మార్కెట్ సోషలిజం అమలును క్లిష్టతరం చేస్తుంది. జాతీయ రాజ్యం తన ఆర్థిక సమన్వయ అధికారాలను కోల్పోతుంది. ఒకవేళ పరిహారం చెల్లించినప్పటికీ, జాతీయాకరణను ఎదుర్కొన్నట్లయితే, అంతర్జాతీయ సంస్థలు తమ ఆస్థుల యాజమాన్యాన్ని రాజ్యానికి అప్పగించడం జరుగదు.

### 11.7. ముగింపు:

మార్కెట్ సోషలిజం సమకాలీన ఔన్నత్యాన్ని రాజకీయ ఆదర్శంగా అన్వేషిస్తుంది. మార్కెట్ సోషలిజం అందించే ప్రయోజనాలు వాస్తవానికి ప్రజలు కోరుకునే ప్రయోజనాలేనా? లేక ఆచరణలో విరుద్ధంగా ఉన్న అవసరాలను గూర్చి తెలియజేస్తుందా అని మిల్లర్ మార్కెట్ సోషలిజం ప్రశ్నిస్తుంది.

### 11.8. మాదిరి పరీక్ష ప్రశ్నలు:

**I. వ్యాసరూప ప్రశ్నలు:**

1) డేవిడ్ మిల్లర్ మార్కెట్ సోషలిజంపై ఒక వ్యాసం వ్రాయండి?

2) స్వేచ్ఛావాద తత్వశాస్త్రంపై విమర్శనాత్మక విశ్లేషణ చేయుము?

**II. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:**

1) మార్కెట్ల రక్షణను గూర్చి క్లుప్తంగా వివరింపుము?

2) మార్కెట్ సోషలిస్ట్ ధృక్పథం గూర్చి క్లుప్తంగా వ్రాయుము?

**11.9. ఆచూకి గ్రంథాలు:**

1) డేవిడ్ మిల్లర్ - "మార్కెట్, స్టేట్, కమ్యూనిటి - మార్కెట్ సోషలిజం యొక్క సైద్ధాంతిక పునాదులు".

2) ఎన్. స్కాట్ అర్నాల్డ్ - "మార్కెట్ సోషలిజం".

3) జాన్. ఓ. నీల్ - 'సోషలిజం, అసోసియేషన్లు మరియు మార్కెట్.

4) డేవిడ్ మిల్లర్ - "మార్కెట్ సోషలిజం గురించి మా అసంపూర్ణ చర్చ".

రచన:
**డా॥ డి. మనో వికాస్**
M.A., B.Ed., Ph.D.
రీసెర్చ్ స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**M.A** (Political Science) **DEGREE EXAMINATION**

Second Semester

Paper I- MODERN POLITICAL THEORY

Tiem: Three hours Maximum : 70 marks

Answer ALL questions

(4 x 15 = 60)

1. (a) Explain the empirical traditions to study political science.

అనుభవ పూర్వక పరిశీలనా పద్ధతులను రాజనీతిశాస్త్ర అధ్యయనంలో పేర్కొనుము.

Or

(b) Explain the basic features of normative political theory.

విలువల ఆధారిత రాజనీతి సిద్ధాంత లక్షణాలను వివరింపుము.

2. (a) Discuss Hayek's views on social progress

సామాజిక ప్రగతి పై హేయకి భావాలను వివరింపుము.

Or

(b) Explain Rowl's theory of justice.

రాల్స్ న్యాయ సిద్ధాంతమును వివరింపుము.

3. (a) Elucidate the reasons for decline of democratic institutions in developing countries.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థల క్షీణతకు గల కారణాలను విపులీకరింపుము.

Or

(b) How Francis Fukuyama defined liberal democracy as an end of History?

ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని చారిత్రానంతరవాద సిద్ధాంతంగా ఫ్రాంసిస్ పుకుయామా ఎలా సమర్థించెను.

4. (a) How Alec Nove explained the failure of socialism in soviet union?

సోవియట్ యూనియన్‌లో సామ్యవాద వ్యవస్థ వైఫల్యాన్ని అలెత్ నోవ్ ఎలా వివరించారు.

Or

(b) How Gramsci explained the concept of Hegemony and passive revolution.

అధిపత్యం, మంద కొడి విప్లవ భావాలను గ్రామస్కీ ఎలా వివరించెను.

5. Answer any TWO of the following: (2 x5 =10)

ఏవైనా రెండిటికి సమాధానములు వ్రాయుము.

(a) Market socialism

విపణి సామ్యవాదం

(b) Theory of justice

న్యాయ సిద్ధాంతము

(c) Robert Nozick's conception of Rights.

రాబర్ట్ నోజిక్ దృష్టిలో హక్కులు

(d) Civil society.

పౌర సమాజము